thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 70 | కరీంనగర్ బుధవారం, 21 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి ఉచిత బీమా

చెన్నై: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమార్థం ప్రభుత్వం పలు రాయితీలు కల్పించడంతోపాటు, ప్రమాదంలో మరణించినా, అవయవాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.కోటి అందేలా ఉచిత బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సీఎం స్టాలిన్ సమక్షంలో సచివాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం ఏడు బ్యాంకులతో అవగాహన కుదుర్చుకుంది. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తున్న ఉద్యోగుల సంక్షేమంపై దృష్టిసారించిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్జితసెలవు రోజుల భత్యాన్ని ఈ ఏడాది నుండి పెంచడంతో పాటు, ఈ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు రాయితీలను కూడా ప్రభుత్వం తరుపున కల్పిస్తున్నారు. సంపన్న దేశాల్లో లాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం ప్రకటించారు.




అండమాన్ అంతట నైరుతి రుతుపవనాలు దూకుడుగా ముందుకు సాగుతున్నాయి. నైరుతి రుతుపవనం వల్ల బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. రానున్న ఏడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాలపై భారీ తుఫాను ఎఫెక్ట్ ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ తుఫాను పేరు 'శక్తి తుఫాన్' గా నామకరణం చేశారు. ఈ తుఫాను వల్ల రానున్న ఏడు రోజుల పాటు భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతూనే ఉన్నాయి.

**ఏపీలో భారీ వర్షం..** ఏపీలోని గుంటూరు, విజయవాడ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ, శ్రీకాకుళం, వైజాగ్ లోను వర్షాలు పడుతూనే ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లోని నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ కూడా హెచ్చరిక చేసింది. మరోవైపు విజయనగరం, ఉభయగోదావరి జిల్లాలో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఉపరితల ఆవర్తనం వల్ల ఏపీకి రానున్న మరో మూడు రోజుల వరకు రోజుల పాటు వర్షాలు సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## బాబోయ్.. భారత్‌లో మళ్లీ కరోనా కలకలం..




యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి.. మానవాళిని వెంటాడుతోంది. కొత్త కొత్త వేరియంట్ల రూపాల్లో విరుచుకుపడుతోంది. ఇప్పటికే ఆసియాలోని పలు దేశాల్లో కరోనా కల్లోలం రేగింది. తాజాగా భారత్ లోనూ మళ్లీ కోవిడ్ మొదలైంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటన చేసింది.

అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో ప్రస్తుతం ఉన్న కేసులన్నీ స్వల్ప తీవ్రతతోనే ఉన్నాయని వెల్లడించింది. కాగా, గత కొన్ని వారాలుగా సింగపూర్, హాంకాంగ్ లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. దీంతో తాము అప్రమత్తంగా ఉన్నట్లు కేంద్రం చెప్పింది. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం మే 12 నుంచి వారం రోజుల్లో 164 కొత్త కేసులు రికార్డ్ అయ్యాయి. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో అత్యధిక కరోనా కేసులు వెలుగుచూశాయి. గత వారం కేరళలో 69 కొత్త కేసులు నమోదయ్యాయి.

మహారాష్ట్రలో 44, తమిళనాడులో 34 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో ప్రస్తుతం 56 కోవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నాయి. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ విభాగం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల నిపుణులతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశం తర్వాత ఈ ప్రకటన వెలువడింది. అందుబాటులో ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం, కేసులు చాలావరకు తేలికపాటివి, అసాధారణ తీవ్రత లేదా మరణాలతో సంబంధం కలిగి లేవని ఓ అధికారి తెలిపారు.

దేశంలోని జనాభాను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం భారత్ లో యాక్టివ్ కేసుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. ఈ కేసులన్నీ దాదాపు తేలికపాటివి అని, బాధితులెవరూ ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని వివరించారు. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్, ICMR ద్వారా COVID-19 తో సహా శ్వాసకోశ వైరల్ వ్యాధుల నిఘా కోసం బలమైన వ్యవస్థ ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ గుర్తించింది. "కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి తగిన చర్యలు తీసుకుంటోంది. అప్రమత్తంగా, చురుగ్గా వ్యవహరిస్తోంది" అని అధికార వర్గాలు పేర్కొన్నాయి.




హైదరాబాద్: భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌కూ జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీకంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణసంస్థల ప్రతినిధులు.. ఇలా అందరినీ విచారించింది. ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్లుగా ప్రభుత్వం 7 సార్లు కమిషన్ గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే గడువు పొడిగించింది. దీనిప్రకారం ఈ నెలాఖరుకు కమిషన్ గడువు పూర్తికావాలి. ఈ నెల 21న లేదా 22న జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో.. సీనియర్ ఇంజినీర్లు, అధికారుల్లో ఎక్కువమంది గత ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయాలు జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలుచేశామని చెప్పిన నేపథ్యంలో.. వీటిపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలనే నిర్ణయంతో కమిషన్ ఉన్నట్లు సమాచారం.

## పేద ప్రజలకు అండగా నిలిచేది భూ భారతి చట్టం : మంత్రి పొంగులేటి



చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు న్యాయం జరిగే దిశగా ఆలోచించి భూ భారతి చట్టం వెలుగులోకి తీసుకుని వచ్చిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా భీమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిన ధరణి లో ఉన్న లోపాలను, మిగిలి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా భూ భారతి ఆర్ఓఆర్ 2025వ చట్టం తీసుకురావడం జరిగిందని, సుమారుగా లక్ష మంది తో చర్చలు జరిపి పేద రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ధరణిలో పరిష్కారం కానీ మిస్సింగ్ సర్వేనెంబర్, రైతుల వివరాలలో తప్పులు, డి ఎస్ పెండింగ్, అసైన్డ్ పట్టా, నిషేధిత జాబితా మార్పు, వారసత్వం, భూసేకరణ సమస్యలు, అటవీ శాఖ రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పదంగా మారిన భూముల మార్పుల వివరాలు, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆర్ఓఆర్ చట్టం వెలుగులోకి తేవడం జరిగిందని ఆయన అన్నారు. భీమవరం మండలంలో 2000 మంది రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని అందులో చాలా వరకు సాదాబైనామాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని వాటిని కూడా అతి త్వరలో పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యల గురించి తనకు వివరించారని ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, మరికొన్ని ఎక్కువగా మంజూరు చేయించాలని తనను కోరడం జరిగిందని తప్పకుండా వెనుకబడిన నియోజకవర్గాలైన చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలకు మరికొన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ముఖ్యంగా చాలా మంది నిరుపేదలు పోడు భూముల పై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని గత ప్రభుత్వం వారిపై నిర్లక్ష్య ధోరణి చూపారని వారికి పట్టాలు అందజేసి వారిని ఆదుకునే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే తనను కోరాడని తప్పకుండా అర్హులైన నిరుపేదలకు పట్టాల అందించే దిశగా ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. గత దొరల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా పథకాలను అమలు చేసే దిశగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ప్రభుత్వ సలహాదారు హార్కార వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తుళ్లూరులో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 10 కోట్లు



## టీటీడీ ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు


**వైద్య సేవల కోసం 597 పోస్టుల భర్తీ**
**స్విమ్స్ ఆసుపత్రి నిర్వహణ కోసం 60 కోట్లతో పాటు అదనంగా 71 కోట్లు కేటాయింపు**
**29 మంది అన్యమత ఉద్యోగస్తులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకం వర్తింపు.**
**ఏ తిరుమలకొండపై పచ్చదనం కోసం 4 కోట్లు**
**ఏ శ్రీవారి ఆలయ భద్రత కోసం యాంటీ డ్రోన్ సిస్టం**
**ఏ కొండపై 57 టెండర్ దుకాణాలకు ఆరు మాసాల పాటు రెన్యువల్**

తిరుమల : తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రి నిర్వహణ కోసం ప్రస్తుతం కేటాయిస్తున్న 60 కోట్లతో పాటు ఇకపై అదనంగా 71 కోట్ల రూపాయలను అంటే మొత్తం 131 కోట్లు నిధులు కేటాయించడానికి టిటిడి ధర్మకర్తల మండలి పచ్చ జెండా ఊపింది. ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం టిటిడి నియమించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ వి సుబ్బారావు అధ్యయనం చేసి అందించిన నివేదిక మేరకు గవర్నమెంట్ కౌన్సిల్ ఆమోదం తెలియజేసిన నేపథ్యంలో టీటీడీ బోర్డు సమావేశం ఈ నిర్ణయం తెలియజేసింది. ఆసుపత్రుల నిర్వహణ కూడా పేద ప్రజల వైద్యం కోసం ఉన్నందున మానవసేవయే మాధవ సేవగా భావించి స్విమ్స్ ఆసుపత్రి నిర్వహణ మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మంగళవారం ఉదయం టీటీటీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది.

టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ధర్మకర్తల మండలి పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాకు వివరించారు.

**టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ముఖ్య నిర్ణయాలు వాటి వివరాలు ఇలా ఉన్నాయి.....**

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్నిఅటవీశాఖ ద్వారా 68.14 శాతం నుండి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయం. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13కోట్లు, 2027-28 సంవత్సరానికి రూ.1.13కోట్లు ప్రభుత్వ అటవీశాఖకు విడుదల చేసేందుకు నిర్ణయం.
- తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్ ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం.
- తిరుమలలోని విఐపి అతిథి భవనాలు అన్నింటికీ భగవంతుడి పేర్లు మాత్రమే ఉండాలని తీసుకున్న నిర్ణయం మేరకు 75 భవనాలలో 45 మందికి పేర్లు మార్చుకోవాలని నోటీసులు జారీ చేశారు . 42 మంది దాతలు విశ్రాంత భవనాల పేర్లు భగవంతుడి పేర్లు అర్థం వచ్చేలా మార్పు చేశారు. మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటారు.
- తిరుమల కొండపై ఉన్న 17 ప్రైవేట్ హోటల్స్ లో భక్తులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించే ఉద్దేశంతో స్థానికంగా ఉన్న వ్యాపారులను పక్కనపెట్టి, బ్రాండెడ్ సంస్థలుగా గుర్తింపు పొందిన హోటళ్లకు టెండర్లను అప్పగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం హోటళ్ల ద్వారా టిటిడి కి లక్షలాది రూపాయలు అద్దెల రూపంలో టీటీడీకి ఆదాయం వస్తున్నప్పటికీ ఆదాయం ప్రధాన ధ్యేయంగా కాకుండా భక్తులకు సరసమైన ధరలకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించడం లక్ష్యంగా మార్పులు చేపడుతున్నారు. తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశంపై ఆమోదించారు. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు నామినేషన్ ప్రాతిపదికన హోటళ్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.
- కొండపై వ్యాపారులు నిర్వహించుకుంటున్న 57 టెండర్ దుకాణాలను వాటి లైసెన్సుల గడువు ను మరో ఆరు మాసాల పాటు కొనసాగిస్తూ ఆమోదం తెలిపారు. దశాబ్దాల తరబడి తిరుమల స్థానికులు నిర్వహించుకుంటున్న ఈ టెండర్ దుకాణాల రెన్యువల్ గడువు మూడేళ్ల పాటు కొనసాగించాలని ప్రతిపాదనలు ప్రవేశపెట్టగా... ఈ దుకాణాల్లో స్థానికులే ఉంటున్నారా లేక పరాధీనం అయ్యాయా.. టెండర్ షాపులను చాలా ఏళ్ల క్రితమే ఖాళీ చేయించాల్సింది పోయి ఇప్పటిదాకా రెన్యువల్ చేయడంలో కారణాలేమిటి..!? అనే అంశంపై పూర్తి సమగ్ర అధ్యయనం చేసి వాస్తవాలను టిటిడి బోర్డు కు నివేదించాలని ఆదేశించారు. అప్పటిదాకా తాత్కాలికంగా ఆరు మాసాల పాటు ఈ దుకాణాల లైసెన్సుల రెన్యువల్ చేస్తున్నట్లు ఆమోదించారు.
- తిరుమల శ్రీవారి ఆలయం నుండి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకాశగంగ, పాపవినాశనం, జాపాలి తీర్థం, వేణుగోపాలస్వామి ఆలయం తదితర సందర్శనీయ ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. రోడ్లు వెడల్పు, సైన్ బోర్డుల ఏర్పాటు, ఫుట్ పాత్ ఏర్పాటు తదితరాలు ఏర్పాటు చేస్తారు.
- రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం. స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు,437 నర్సులు, 15 పారా మెడికల్ సిబ్బంది, 100 మంది ఫ్యాకల్టీ, 15 అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ పోస్టుల నియామకం చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా 85శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (అంకాలజీ, పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం.
- అనేకమంది వైద్య వృత్తిలో కూడా భక్తులకు సేవలు అందించేందుకు ముందుకు వస్తున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, డాక్టర్ల సైతం వైద్యాన్ని ఉచితంగా శ్రీవారి సేవ ద్వారా అందించేందుకు ఆసక్తి చూపుతున్నారని, శ్రీవారి వైద్య సేవను కూడా స్విమ్స్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు.
- టీటీడీలో పని చేస్తున్న 29 మంది అన్యమతస్తులను ప్రభుత్వానికి అక్కడి విభాగాలకు బదిలీ చేసేందుకు టిటిడి పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుండి సమాధానంగా వారందరినీ టీటీడీలోనే సర్దుబాటు చేసుకోవాల్సిందిగా ప్రత్యామ్నాయ మార్గాలు, చూసుకోవాల్సిందిగా సూచించింది. దీంతో 29 మంది అన్యమత ఉద్యోగస్తులను టీటీడీలోనే స్వచ్ఛంద పదవీ విరమణ చేసేలా చర్యలు తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. ఇందుకోసం స్వచ్ఛంద పదవీ విరమణ చేసే అన్యమత ఉద్యోగస్తులకు హిందూమత ఉద్యోగులకు ఇచ్చే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కంటే అదనంగా మరో ఐదు లక్షలు రూపాయలు వారికి అందించాలని ఆఫర్ ప్రకటించారు. ఇప్పటికే టీటీడీలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసే టిటిడి ఉద్యోగులకు 10 లక్షల నుండి 25 లక్షల రూపాయలకు పైగా ప్రయోజనం చేకూరుతోంది.
- ఇటీవల దేశంలో చోటుచేసుకుంటున్నటువంటి సీమాంతర ఉగ్రవాద పరిస్థితులు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.
- తెలుగు రాష్ట్రం లో ఆంధ్రప్రదేశ్ కు భద్రాచలం తరహాలో ఏర్పడిన కోదండ రాముడి ఆలయం ఒంటిమిట్టలో భక్తులకు ఇకపై ప్రతినిత్యం భక్తులకు అన్నదానం అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఒంటిమిట్టలో శాశ్వత భవనం లేనందున తాత్కాలిక వసతి భవనంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని ప్రతినిత్యం అందుబాటులో తీసుకొచ్చేందుకు త్వరలో ప్రారంభం చేయాలని నిర్ణయించారు.
- ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సమీపంలోని తుళ్లూరు మండలం అనంతవరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం మూడు ఎకరాల పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని మరింత విస్తరించేందుకు 20 ఎకరాల స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఏర్పాట్లు చేస్తున్నారు.
- గోవులు అనారోగ్యంతో మరణిస్తున్నాయంటూ ఇటీవల వివాదాస్పదంగా మారిన తిరుపతిలోని ఎస్వీ డైరీ ఫామ్ లో ఉన్న గోవులకు ప్రస్తుతం ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా డాక్టర్లు అందుబాటులో ఉన్నారని, ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ కూడా సమర్థవంతంగా పనిచేస్తున్నారని, త్వరలోనే దాని ఫలితాలు అందరికీ తెలుస్తాయని వెల్లడించారు.
- గోవింద నామాలను, శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.



## రాజభవన్ లో దొంగతనం చేసింది అతనే.. పోలీసుల సంచలన ప్రకటన!

రాజభవన్ లో చోరీకి సంబంధించి పోలీసులు సంచలన ప్రకటన చేశారు. మే 10న రాజభవన్‌లో పనిచేసే ఒక మహిళ ఉద్యోగి తన ఫోటోలను ఎవరో అసభ్యంగా మార్ఫింగ్ చేసారని ఫిర్యాదు చేశారు. అయితే ఆ మార్ఫింగ్ చేసిన ఫోటోలను తనకు ఎవరో పంపించారని శ్రీనివాస్ (45) అనే సహోద్యోగి ఆమెకు చెప్పారు. అయితే శ్రీనివాస్ పైనే తనకు అనుమానం ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మే 12న అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాం. మే12న బెయిల్ పై బయటకొచ్చాడు. అయితే అతన్ని రాజ్ భవన్ అధికారులు చట్ట ప్రకారంగా సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉండగానే రాజభవన్ లోకి వచ్చి, తను ఉపయోగించే సిస్టంలో మార్ఫింగ్ ఫోటోలు ఉన్న హార్డ్ డిస్క్ ను తీసుకుని వెళ్ళిపోయాడు. దీంతో మే14న రాజ్ భవన్ %×% మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుపై, మరో కేసు నమోదు చేసి అతన్ని మే 15న అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాం. ఆ హార్డిస్క్ రికవరీ చేశాం. రాజ్ భవన్‌లో బయటవ్యక్తులు దొంగతనం చేశారని వస్తున్న వార్తలు వాస్తవమని, ఇది అందరూ గమనించాలని పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ సూచించారు.




హైదరాబాద్, మే 20: మెట్రో ఛార్జీల విషయంలో ఎల్ అండ్ టీ సంస్థ దిగొచ్చింది. ప్రస్తుతం పెంచిన ఛార్జీలలో 10 శాతం రాయితీని ప్రకటిస్తూ ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయం తీసుకుంది.

ఈ నెల 24వ తేదీ నుంచి ఈ రాయితీలు వర్తించనున్నాయని సంస్థ ప్రకటించింది. కాగా.. మెట్రో కనీస ఛార్జీలు రూ.10 నుంచి రూ.12కు, గరిష్ఠ ఛార్జీలు రూ.60 నుంచి 75కు పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో సంస్థ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఛార్జీల ఎక్కువగా పెరిగిన నేపథ్యంలో ప్రయాణికుల నుంచే కాకుండా ప్రతిపక్షాలు, వామపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కూడా పెరిగిన మెట్రో ఛార్జీల విషయంలో ఆలోచించాలని ఎల్ అండ్ టీ సంస్థను కోరింది. దీంతో ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను యాజమాన్యం సవరించింది.




చాంద్రాయణగుట్ట: హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఛత్రినాక పరిధిలోని బోయగూడలో ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో అందులో ఉన్నవారంతా భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న ఛత్రినాక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌ల ద్వారా మంటలను అర్పారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలో చెప్పుల గోదాము నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం గుల్జార్ హౌస్ సమీపంలో ఓ భవనంలో అగ్నిమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

## ఐఏఎస్ శరత్ వ్యవహార శైలిపై సీఎం ఆగ్రహం.. చర్యలు తప్పవని సీఎస్ హెచ్చరిక!

సోమవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేటలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా ఐఏఎస్ అధికారి శరత్ అత్యుత్సాహం ప్రదర్శించారు. సభలో పాల్గొనడానికి వచ్చిన సీఎం కాళ్లు మొక్కారు. ఐఏఎస్ శరత్ వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ కాళు ఐఏఎస్ శరత్ మొక్కడంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికార వర్గాల్లో చర్చ జరిగింది. ఈ ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కే.రామకృష్ణారావు సీరియస్ అయ్యారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలంగాణ సీఎస్ రామకృష్ణ రావు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు స్థాయికి తగినట్లుగా ఉండకపోవడం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. సభలు, సమావేశాల్లో ఉన్నతాధికారులు హుందాగా వ్యవహరించాలి. సభలు, సమావేశాల్లో హుందాగా ఉండకపోతే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది. ప్రజలను కలిసినప్పుడు ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రొఫెషనలిజం ప్రదర్శించాలి. ప్రజాప్రతినిధుల పట్ల సివిల్ సర్వీసెస్ రూల్స్‌కు విరుద్ధంగా



వ్యవహరించొద్దు. ఇకపై ఏ అధికారి నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవు' అని సీఎస్ హెచ్చరించారు. గతంలో ఐఏఎస్‌లు ప్రజాప్రతినిధుల కాళ్లు మొక్కడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ఇకపై ఐఏఎస్‌లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు అలా వ్యవహరించవొద్దని సీఎస్‌తో సీఎం ఆదేశాలు ఇప్పించారు.




దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిగా పాకిస్థాన్ పాల్పడిన దుస్సాహసాన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. శత్రు దేశ డ్రోన్లు, క్షిపణులను కూల్చేయడంతో పాటు వారి కీలక సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే, భారత్ తలుచుకుంటే పాక్ మొత్తంపై దాడి చేసే సామర్థ్యం మనకు ఉందన్నారు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ సుమేర్ ఇవాన్ డి కున్హా.

అదే జరిగితే దాయాది ఏదైనా కలుగు వెతుక్కుని అందులో దాక్కోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దాయాదిపై విమర్శలు గుప్పించారు. "పాకిస్థాన్‌పై పూర్తి స్థాయిలో దాడి చేసేందుకు భారత్ వద్ద సరిపడా ఆయుధ సామర్థ్యం ఉంది. పాక్లోని ప్రతి ప్రదేశం మన రేంజ్‌లోనే ఉంది. మన సరిహద్దుల నుంచే ఆ దేశంలోని అన్ని ప్రాంతాలపై దాడి చేయగలం. ఒకవేళ వాళ్లు తమ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌ను రావల్పిండి నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా లాంటి ప్రాంతాలకు తరలించినా.. అక్కడ కూడా దాడులు చేసేవాళ్లమే. అప్పుడు వారు ఏదైనా కలుగు వెతుక్కుని అందులో దాక్కోవాల్సి వచ్చేది" అని సుమేర్ విమర్శించారు. ఈ ఆపరేషన్ సిందూర్‌లో అధునాతన స్వదేశీ సాంకేతికత, దీర్ఘ శ్రేణి డ్రోన్లు, గైడెడ్ మిస్సైళ్లు కీలక పాత్ర పోషించినట్లు ఆయన తెలిపారు. "మన సార్వభౌమత్వాన్ని రక్షించడమే సైన్యం కర్తవ్యం. సరిహద్దుల్లో చొరబాట్లను అడ్డుకోవడంతో పాటు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడటమే మా ప్రథమ ప్రాధాన్యం. దానికి అనుగుణంగానే మేం ఆపరేషన్ చేపట్టాం. ఈ రోజు మనం సాధించిన విజయంతో కేవలం సైనికులే కాదు.. వారి కుటుంబాలు, యావత్ భారతావని గర్వపడుతోంది" అని సుమేర్ ఆనందం వ్యక్తం చేశారు.



## మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ పనుల పూర్తి చేస్తాం - మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ : రానున్నమూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేసిన జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, జి .ఎడవెల్లి గ్రామ చెరువు కు సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతాంగం ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు, రిజర్వాయర్లను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా జి .యడవల్లి చెరువు తూము ,ఇతర పనుల మరమ్మతుకు గాను కోటి రూపాయలను డి ఎం ఎఫ్ టి ద్వారా మంజూరు చేయడమే కాకుండా, బుధవారం నుండి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

నాలుగువేల కోట్ల రూపాయల వ్యయంతో ఎస్ఎల్ బీసీ సొరంగం పనులు చేపట్టడం జరిగిందని , అయితే అటువైపునుండి సొరంగం కూలిపోవడం వల్ల పనులు ఆగిపోయినప్పటికీ తిరిగి పనులను ప్రారంభించి మూడు ఏళ్లలో ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని చెప్పారు.

**ఎడ్లవల్లిలో 80 మందికి ఇందిరమ్మ ఇళ్లు...** ఎడవల్లి గ్రామంలో 4 కోట్ల రూపాయల వ్యయంతో 80 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. దీనితోపాటు, 5 కోట్ల రూపాయలతో బీటి రోడ్లు, 30 లక్షల తో డ్రైనేజీ మంజూరు చేశామని తెలిపారు. ఎడవల్లి చెరువు మరమ్మతు పనులను నాణ్యతగా చేపట్టాలని, నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కనగల్ ఆస్పత్రిలో గ్లూకోమా కంటి పరీక్షలకు అధునాతన యంత్రం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఆస్పత్రి మాదిరిగా కనగల్ ఆసుపత్రిని తీర్చిదిద్దడం జరిగిందని వెల్లడించారు. కనగల్ మండల మహిళా సమాఖ్య సభ్యులకు అయిటి పాములలో లాగే సోలార్ విద్యుత్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు . ఏవైనా సమస్యలు ఉంటే మండల ప్రజలు తన దృష్టికి తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇంచార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ, నల్గొండ ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.




## అధికారులూ.. దుబారా వద్దు.. మద్యం, సిగరెట్ కట్: చైనా

మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులోభాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది. ప్రయాణాలు, మద్యం, సిగరెట్ ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటు చర్యగా ప్రభుత్వం అభివర్ణించింది.

ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులోభాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.



## పాతబస్తీ అగ్నిప్రమాదం.. విచారణకు ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ

హైదరాబాద్: పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ చౌరస్తా సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ కమిటీలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌లతో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈనెల 18న జరిగిన అగ్నిప్రమాద ఘటనపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఘటనకు గల కారణాలు.. అనంతరం వివిధ శాఖలు తీసుకున్న చర్యలపై సీఎంకు సమగ్ర నివేదిక అందజేయాలని పేర్కొంది.

భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలనూ నివేదికలో పొందుపరచాలని సూచించింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత సీఎం, డిప్యూటీ సీఎం, ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం తెలిపింది.

# తెలుగు నవలా సాహిత్య సామ్రాజ్ఞి...సులోచనారాణి

## మే 21...యద్దనపూడి సులోచనారాణి వర్ధంతి



యద్దనపూడి సులోచనారాణి. తెలుగు ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. దశాబ్దాల పాటు తెలుగు నవలా పాఠకులకు, తెలుగు సినిమా ప్రేక్షకులకు అభిమాన రచయిత్రి. తెలుగు నవలా సామ్రాజ్యాన్ని ఐదు దశాబ్దాల పాటు ఏలిన సాహిత్య సామ్రాజ్ఞి. ఆమె నవలల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. ఆమె పాత్రలలో సజీవత్వం తొణికిస లాడుతుంది. పెళ్ళికాని యువతలో, గృహిణుల్లోనూ పాఠక శక్తిని పెంపొందించిన ఘనత ఆమెకే దక్కింది. మధ్యతరగతి కుటుంబ పరిస్థితులే ఆమె పాత్రల నేపథ్యం కాగా, యువతీ యువకుల నుండి వయసు మళ్లిన వారి వరకు ఆమె అభిమాన రచయిత్రిగా మారారు. ఆధునిక జీవనశైలి కి భిన్నమైన, చర్విత చర్వణంగా దినచర్యలు కలిగిన నాటి పరిస్థితులలో రేడియో కార్యక్రమాలు వినడం, నవలలు చదవడం, అప్పుడప్పుడూ సినిమాలు చూడడం సర్వత్రా చోటు చేసుకున్న కాలంలో యద్దనపూడి నవలలు వయసు తో నిమిత్తం లేకుండా నిత్య పఠనాసక్తిని కలిగించాయి అంటే ఆమె రచనా వ్యాసంగం ఎంతటి ప్రభావాన్ని పాఠక లోకంపై చూపిందో స్పష్టం అవుతున్నది. చర్విత చర్వణం లా సాగే నాటి ప్రజా జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనించి, తను పరిశీలించిన జీవితాలను కథా వస్తువులుగా తీసుకొని, పాఠకులకు నచ్చిన రీతిలో ఆమె రచనలు చేశారు. మధ్యతరగతి అమ్మాయిల ఊహలు, అంతరంగానికి, ఆశలకు, స్వాభిమానానికి యద్దనపూడి నవలలు అద్దంపడతాయని నాటి పాఠకులు భావించేవారు. అమ్మాయిల ఆత్మాభిమానం, తల వంచని వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసం, హుందాతనం, మాటకారితనం ప్రతి ఆడ పాత్రలో కనిపిస్తాయి. ప్రతివారి హృదయాలకు హత్తుకునేలా పాత్రల సృష్టి చేశారు. ఆలుమగల మధ్య ప్రేమలు, కుటుంబ కథనాలు రాయడంలో తనకు వేరెవరూ సాటిరారని నిరూపించారు. అందుకే ఆమె రాసిన నవలల ఆధారంగా అనేక సినిమాలు తీసినా అవి నేటికీ అద్భుత చిత్రాలుగా మన గలుగు తున్నాయి. అలాగే ఆమె రచనలు కేవలం సినిమాలు గానే కాక అనేక టీ.వీ. ధారా వాహికలుగా రూపొందించ బడ్డాయి. 1940లో ఏప్రిల్ 2న కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజా గ్రామంలో జన్మించిన యద్దనపూడి సులోచనారాణి తొలిసారిగా చదువుకున్న అమ్మాయిలు చిత్రం ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. 1965లో మనుషులు – మమతలు సినిమాకు కథను అందించారు. తర్వాత వీరు రాసిన మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమ లేఖలు, విచిత్ర బంధం, బంగారు కలలు లాంటి నవలలు చలన చిత్రాలుగా వచ్చాయి. అయితే సెక్రటరీ మాత్రం ఓ అద్భుత ట్రెండ్ సెట్టర్ గా మిగిలి పోయింది. ఆ రోజుల్లో ప్రతి యువకుడు ఓ రాజశేఖరంలా ప్రతి యువతీ ఆత్మాభిమానం గల జయంతిలా ఉండాలనుకునే వారు. 1965 లో మార్కెట్ లోకి వచ్చి సంచలనం సృష్టించింది సెక్రెటరీ నవల. 20 వ శతాబ్దపు బెస్ట్ సెల్లర్ ఏకంగా 75 ముద్రణలు చేసుకున్న నవల ఇది. సీరియల్స్ గా వచ్చినపుడు పాఠకులను మంత్ర ముగ్ధులను చేసేవి కొన్ని నవలలు. సెక్రటరీ, జీవన తరంగాలు, మీన్నా, విజేత, ఆరాధన, కీర్తి కిరీటాలు, ప్రేమ లేఖలు, గిరిజా కల్యాణం, పార్థు, ఈ తరం కథ, ఆత్మీయులు, బంగారు కలలు, కథల్లో బహుమతి, ఐలవ్ యూ... ఇంకా ఎన్నో ఆమె అభిమానులు మెచ్చినవి. ఎన్ని సార్లు ప్రచురించినా, అన్ని ప్రతులూ అతి వేగంగా అమ్ముడు పోయేవి. సులోచనా రాణి శైలి అమోఘం, అనన్యం, అపూర్వం, అనితర సాధ్యం. మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, విచిత్ర బంధం, జై జవాన్, ఆత్మ గౌరవం తదితర నవలలను సినిమాలుగా తీశారు. యద్దనపూడి సులోచనారాణి వయస్సు మళ్లిన ఒంటరి మహిళల కోసం 'విన్' పేరుతో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు ఏడేళ్ల పాటు ఆశ్రమాన్ని నిర్వహించారు కూడా. అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల తన ఆత్మీయులకు హోం బాధ్యతను అప్పగించారు. అనాథ బాలలు, మురికివాడల్లోని పిల్లల కోసం తన ఇంటి ఆవరణ లోనే కొద్ది రోజుల పాటు ప్రత్యేక పాఠశాలను నిర్వహించారు. 'పరాశర' స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాథ బాలల వసతి గృహాలు, వయోధికుల ఆశ్రమాలకు బియ్యం, పప్పు వంటి నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం అందించారు. సెక్రటరీ 50ఏళ్ల వేడుకలో పది మంది విద్యార్థులకు ఆర్థిక సహకారం ద్వారా చేయూత అందించారు. 2018, మే 21న అమెరికా లోని కాలిఫోర్నియాలో తన కూతురు నివాసంలో గుండె పోటుతో గుండెపోటుతో మృతిచెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్ళబండి - మే 21...రాళ్ళబండి కవితాప్రసాద్ జయంతి



తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్. సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు. ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్చిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పి.హెచ్.డి. చేశారు. కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి.హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు.ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు. వరంగల్ లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు.

ఆశుకవితా ఝరి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరా బాదులో హృద్రోగంతో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విలనిజానికి ప్రతిరూపం రాజనాల - మే 21... రాజనాల వర్ధంతి



తెలుగు తెరపై విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన నటులలో రాజనాల అగ్ర స్థానం లో ఉంటారు. అతి భయానకంగా కళ్ళెర్ర చేయడం... భీభత్సంగా వికట్టాట్టహాసం చేయడం... హీరోయిన్‌ని వెంటాడి వేధించడం... హీరోని క్లయిమాక్స్ వరకూ మొండిగా ఎదుర్కోవడం... విలనిజా నికి రాజనాల ప్రతిరూపంగా నిలుస్తారు. రాజనాల తెరపై కనిపిస్తే చాలు మహిళా ప్రేక్షకులు శాపనార్థాలు పెట్టేవారంటే... ఆయా పాత్రల్లో ఆయన ఎలా జీవించాడో అర్థం చేసుకోవచ్చు. పాతతరం నటుల్లో ఎంతమంది విలన్లు ఉన్నా.. విలనంటే గుర్తుకొచ్చే పేరు రాజనాల అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా 400 పై చిలుకు చిత్రాల్లో వివిధ రకాలైన పాత్రలు పోషించారు. 100కు పైగా పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో విలన్ పాత్రలు పోషించారు. తెలుగు సినిమా, నాటకాల్లో ఎక్కువగా నటించారు. కొన్ని తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా నటించారు. 1966లో 'మాయా ది మెగ్నిఫిసెంట్' అనే హాలీవుడ్ సినిమాలో నటించి, హాలీవుడ్ లో నటించిన తొలి తెలుగు నటునిగా రికార్డు సృష్టించారు రాజనాల. ఎన్.టి.రామారావు, ఎం.జి.రామచంద్రన్, జయలలిత ముగ్గురు ముఖ్య మంత్రులతో నటించిన ఏకైక నటుడు.

1952లో రాజమార్గం చిత్రం ద్వారా తెరపరిచితమైన రాజనాల ... 1953లో ప్రతిజ్ఞ చిత్రంలో ప్రతినాయకుని పాత్రలో మెప్పించారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 1953 నుంచి 1978 వరకు రాజనాల నట జీవితంలో స్వర్ణయుగంగా చెప్పొచ్చు. నెల్లూరులో 1925 జనవరి 3 వైకుంఠ ఏకాదశి పర్వదినాన పుట్టిన రాజనాల అసలు పేరు... రాజనాల కాళేశ్వరరావు. చిన్న పెద్ద అంతా ఆయన్ని అభిమానంగా ఎంతో ఆప్యాయతతో పిలిచేవారు. ఇంటర్ చదువుతూనే 1948లో నెల్లూరులో స్నేహితుడు లక్ష్మీకుమార్ రెడ్డితో కలిసి 'నేషనల్ ఆర్ట్ థియేటర్' అనే నాటక సంస్థను ప్రారంభించారు. మొదటగా నెల్లూరు టౌన్‌హాలులో ఆత్రేయ 'ఎవరు దొంగ' నాటకాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వ శాఖలోని అవినీతిని బట్టబయలు చేశావంటూ రాజనాలపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఆ తరువాత 'ప్రగతి' అనే నాటకాన్ని ప్రదర్శించగా కోపగించిన కలెక్టర్ రాజనాలను సస్పెండ్ చేశారు. తరవాత మద్రాసు చేరిన రాజనాల హెచ్. ఎం. రెడ్డి తీసిన 'ప్రతిజ్ఞ' సినిమాకు విలన్‌గా ఎంపిక కాబడి, నెలకు రూ.200/%- జీతానికి హెచ్ఎం రెడ్డితో కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. అలా, తెనాలి రామకృష్ణ, సువర్ణ సుందరి, కుటుంబ గౌరవం, వినాయక చవితి, రాజమకుటం, శ్రీ వెంకటేశ్వర మహత్యం, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి, ఉషా పరిణయం జగదేకవీరుని కథ, నిరపరాధులు, గులేబకావళి కథ, చిట్టి తమ్ముడు, దక్ష యజ్ఞం... ఇలా అనేకానేక చిత్రాల్లో నటించారు. గుండమ్మ కథ, పరువు ప్రతిష్ట, నర్తన శాల, రాముడు భీముడు, దేవత, బొబ్బిలి యుద్ధం, సిఐడి, శ్రీ సింహాచల క్షేత్ర మహిమ, సత్య హరిశ్చంద్ర, శ్రీ కృష్ణ పాండవీయం, పల్నాటి యుద్ధం, శ్రీశ్రీ మర్యాద రామన్న, శ్రీ కృష్ణావతారం... ఇలా ఎన్నో చిత్రాల్లో నటించారు. అప్పట్లో రాజనాల లేని సినిమాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఎన్టీఆర్, కాంతారావు సినిమాల్లో ఆయనే విలన్. రాజనాల... 'కింగ్ ఆఫ్ విలన్స్'గా పేరు తెచ్చుకున్నారు. నాలుగున్నర దశాబ్దాల నటనలో తిరుగులేని విలన్‌గా ఎదిగిన రాజనాల... అవకాశాలు అందిపుచ్చుకుని ఆకాశాలు ఈదారు. వెండితెర వైభవాన్ని సంపూర్ణంగా అనుభ వించారు. అంతలోనే... విధి వక్రించి... చెన్నైలో విలక్షణ నటుడిగా ఖ్యాతి గాంచిన రాజనాల... హైదరాబాద్‌లోని అమీర్ పేట సారథి స్టూడియో వెనుక వీధిలో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ లోకి నెట్టి వేయడం విధి విచిత్రం. కాదనకుండా, లేదనకుండా, దానధర్మాలు చేసిన రాజనాల చరమాంకంలో ఆర్థిక ఇబ్బందుల్లో మునిగి పోయారు. కృష్ణ హీరోగా 'తెలుగు వీర లేవరా' చిత్రం కోసం అరకు లోయలో షూటింగ్ సమయంలో రాజనాలకు కాలికి గాయం అయింది. షుగర్ కూడా తోడవడంతో ఓ కాలు తీసి వేయాల్సి వచ్చింది. జీవితంలో 'భీమాంజనేయ' పేరుతో సొంతంగా ఓ సినిమా తీయాలని కోరిక ఉండేది కానీ అది తీరకుండానే పోయారు. రాజనాల తన చివరి రోజుల్లో ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. జ్యోతిష్యం చెప్పుకుంటూ కూడా కొన్నాళ్లు ఆయన జీవించారు. 1998 మే 21న విధితో పోరాడి, పేద వంచకుడై, చరమాంకంలో కన్నీరు కడలిలో పూర్తిగా మునిగి, తనువు చాలించినా... రాజనాల తాను జీవించిన పలు పాత్రల్లో ఇప్పటికీ కళాకారుడిగా జీవించే ఉన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మానసిక రుగ్మతల బాధితులు మౌనం వీడుదాం ...

ఒక వ్యక్తిగతమైన, ఎంతో ప్రాధాన్యత గల విషయం గురించి మాట్లాడుతున్నాను. నాకు ఎందుకు ఇది అంత ముఖ్యమో చెప్పాలంటే, మూడు సంవత్సరాల వెనక్కి వెళ్లాలి. అది నాకు పీజీ సీటు వచ్చిందన్న వార్త తెలిసిన రోజు. నాకు సైకియాట్రీ లో సీటు వచ్చినట్టు తెలిసినప్పుడు మొదట గర్వంగా అనిపించింది. నా తల్లిదండ్రులు చదువుకున్న వాళ్ళు, సామాజికంగా చురుకుగా ఉండే వాళ్లే అయినప్పటికీ, "నాకు సైకియాట్రీ వచ్చింది" అని వారితో పంచుకోవడం అంత సులభం కాలేదు. "నేను మానసిక వైద్యురాలిని అవుతున్నాను" అని చెప్పినప్పుడు మా అమ్మ అన్న మాట – "పిచ్చి డాక్టర్ అంటారు ", "ఎవరు పిచ్చి డాక్టర్‌ను పెళ్లి చేసుకుంటారు? అంది. ఈ మాటలు ఆమెకు ఆందోళనతోనే వచ్చాయి ఇందులో మా అమ్మ తప్పేమీ లేదు, ఇది ప్రతి తల్లి మనసులోని మాటనే. మానసిక వైద్యాన్ని విద్య పరంగా చూడటం ఆపేసారు. అంతే కాదు నా తోటి డాక్టర్లు అడిగే ప్రశ్నలు వింటే కూడా నాకు వింతగా అనిపిస్తుంది. "ఓహ్, సైకియాట్రీ తీసుకున్నావా? ఎలాంటి పేషెంట్స్ వస్తారు నీ దగ్గరికి? వాళ్ల వలన డేంజర్ ఏమీ ఉండదా ?'' అని. ఇది పేషంట్స్ గురించి మాట్లాడుతున్నట్టు లేదు. ఇదో ఒక జాతికి ఇంకో జాతికి మధ్య జరిగే పోరాటం లో నేనో పాత్ర ఎన్నుకున్నట్టు ప్రతి ఒక్కరి భావన. లిమా పేషెంట్లు మిగతా పేషెంట్ల లాగా తిండి వలనో, వైరస్, బాక్టీరియా వల్లనో వాళ్ల ఆరోగ్యాన్ని వాళ్లే పాడు చేసుకున్న వాళ్ళు కాదు. వాళ్లు ఒక రకంగా ఈ సమాజంలోని అనేక అపసవ్య మానవ సంబంధాల, రుగ్మతల బాధితులు.లి మన చుట్టు ఉండాల్సిన మానసిక సంరక్షణ వ్యవస్థకే గాయాలైన వాళ్ళు. వారిపట్ల ఎంతో సానుభూతితో, బాధ్యతతో ఉండాల్సిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, సభ్య సమాజం వారికి తగిన వైద్యం చేయించి సహాయపడటం కాక వారిని తమ సమీపం నుండి వెళ్ల గొట్టి, కుటుంబం నుండి వదిలించుకుని హాయిగా ఉండాలని కోరుకునే పరిస్థితి ఉంది. పాక్షికంగా మానసిక అనారోగ్యానికి గురైన వ్యక్తులు కూడా తాము మానసిక వ్యాధి పీడితులమని అంగీకరించక, సమస్యను పెద్దది చేసుకోవటం ఈ విషయంలో మరో పెద్ద అడ్డంకి. ఫలితంగా వారంతా చికిత్స లేకుండా, ఏళ్ల తరబడి అవే రుగ్మతలను మోస్తూ వారికీ, ఇతరులకు సమస్యగానే సమాజంలో తిరుగుతున్నారు. మా దగ్గరికి వచ్చే చాలా మంది ప్రాథమిక దశ దాటిపోయి వ్యాధి ముదిరిన దశలో ఉంటున్నారు. ఇక్కడ వ్యాధి వలన బాధ పడడం ఒక ఎత్తైతే, వ్యాధిని గుర్తించక పోవడమే కాక ఆ వ్యాధికి ఒక చికిత్స కావాలి అనే ఆచరణకు వారు దూరంగా బతుకుతున్న సామాజిక విధానం ఒకటి మన మధ్యలో ఉంది. ఈ పరిస్థితికి కారణం మానసిక రోగాల పట్ల, వైద్యం పట్ల సమాజంలో అవగాహన లేకపోవటమే. ఏళ్ల తరబడి కొనసాగుతున్న అపోహలు, మానసిక సమస్య అనేది ఒక సిగ్గుపడాల్సిన విషయంగా(స్టిగ్మా) అంతా భావించటం జరుగుతుంది. ఇంకొంచెం పరిశీలనగా అర్థం చేసుకుంటే – మనుషులు డిప్రెషన్ లో ఉన్నప్పుడు "ఇంతకీ ఎందుకు డిప్రెషన్‌లో ఉన్నావ్? కాస్త ఛీరప్ అవు" అంటారు దగ్గరి వాళ్ళు. కానీ లిడిప్రెషన్ అనేది కేవలం ఆ సందర్భంలో మూడ్ సరిగా లేకపోవటం అనే చిన్న విషయం కాదు. అది ఓ బలమైన జీవరసాయన చర్యల హెచ్చుతగ్గుల ఫలితం.లి అలాగే ఏళ్ల తరబడి వారి భావోద్వేగాలను అణచి పెట్టిన ఫలితం. కానీ చాలా మంది దాన్ని డిప్రెషన్ గా అంగీకరించడానికి సిద్ధంగా లేక సోషల్ స్టిగ్మాతో తేలిగ్గా తీసుకుంటూ మాట్లాడతారు. 1960స్, 70స్లో ఓ rebellious anti-psychiatry ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమం %జూంఎప్ట్రఖ్‌తీఎ%ని, దాని విధానాల్ని ప్రశ్నించింది. కొన్ని విమర్శలు అప్పట్లో సరైనవే కావచ్చు. కానీ psychiatry చాలా మారిపోయింది. కాని ఈ stigma మాత్రం పోలేదు. ఇప్పటికీ మనం ఆ పాత మైండ్‌సెట్ లోనే ఉన్నాం. ఈరోజు మానసిక వైద్యం అంటే పేషెంట్లను సినిమాలలో చూపించినట్టు గదిలో బంధించే పని అసలే కాదు. ఔషధాలు ఇస్తూ వారిని ఆ స్థితి నుండి బయట పడవేయడానికి చేసే ఒక సమగ్రమైన వైద్య విధానం. సైకాలజీ న్యూరోసైన్స్ ఆధారంగా Trauma-inform కేర్ ఆధారంగా వినటానికి, అర్థం చేసుకోడానికి ఓ సురక్షిత స్థలం ఇచ్చే శాస్త్రం. Psychiat[ry అంటే ఓ ఆశ. సింపుల్ గా చెప్పాలంటే – మనిషిలోని కొలుకోలేని వేదనకు అర్థం చెప్పే ప్రయత్నమే మానసిక వైద్య శాస్త్రం. మానసిక ఆరోగ్యం అనేది ఒక అవమానకరమైన వ్యాధికి సంబంధించిన విషయం కాదు. ఇది మనం మాట్లాడుకోవాల్సిన నిజం. ఒక మానసిక వైద్యుని వద్దకు వెళ్ళడం ఓ దౌర్భాగ్యం కాదు. అది ఓ జాగ్రత్త చర్య. ఒక ఫ్రాక్చర్ ఉన్నప్పుడు ఎలా ట్రీట్ చేస్తామో, డిప్రెషన్ ను కూడా అలాగే ట్రీట్ చేయాలి. ఈ రోజు సైకియాట్రీ అనేది ఎవిడెన్స్ బేస్డ్ వైద్య శాస్త్రం. ఇది పేషెంట్ కేంద్రంగా సంపూర్ణ విధానాన్ని అనుసరిస్తుంది. అంటే రోగి కేంద్రంగానే కాక రుగ్మతకు కారణమైన అన్ని విషయాలనూ సమగ్రంగా పరిగణలోకి తీసుకుంటూ చేసే శాస్త్రీయమైన వైద్యం. ఇది కేవలం మందులకు సంబంధించిన శాస్త్రమే కాదు. సైకోథెరపీ, ఫ్యామిలీ కౌన్సిలింగ్, సోషల్ సపోర్ట్,వ్యక్తిత్వ శైలి మరియు జీవనశైలిలో మార్పులతో సహాయపడుతుంది. మోడ్రన్ సైకియాట్రీ అంటే ఈ రోజుల్లో మానసిక నియంత్రణ కాదు. ఇది కనిపించని గాయాలను మాన్పించే ప్రక్రియ. బహుళ క్రమశిక్షణ టీమ్‌లతో పని చేస్తాము. సైకాలజిస్టులు, సోషల్ వర్కర్లు, వృత్తి చికిత్సకులతో కలిసి దుఃఖంతో, ఆందోళనతో, %ఝూణ% తో, బర్నౌట్ తో, లేదా దీర్ఘకాల మానసిక సమస్యలతో బాధపడే వాళ్లకు మార్గనిర్దేశనం చేస్తాము. లిఇది ఒక వ్యక్తిని తిరిగి నిర్మించే ప్రయత్నం. ఒక మానసిక రోగి నయం అయితే ఒక కుటుంబం మొత్తం బాగుపడినట్లు.లి వ్యక్తిగత మానసిక వ్యాధి అన్నది నిజానికి కేవలం వ్యక్తిగతం కాదు. అది సామాజికం కూడా. దీనికి అటాచ్ చేసిన స్టిగ్మా మన సంభాషణలను చంపుతుంది, చికిత్సను ఆలస్యం చేస్తుంది. ఇంకా బాధితులను ఒంటరిగా విడిచిపెడుతుంది. మానసిక ఆరోగ్యాన్ని శారీరక ఆరోగ్యంలాగా సహజంగా మాట్లాడాలసిన పరిణితి ఈ సమాజం లో రావాల్సి ఉంది. " హై , ఎలా ఉంది " అని అడిగితే " కొద్దిగా డిప్రెషన్ అనిపిస్తుంది ఒక సారి వెళ్ళి డాక్టర్ ను కలవాలి " అనే ఈ సంభాషణ మన మధ్య జ్వరం, ఆయాసం గురించి మాట్లాడే విధమైన అవసరతను , సంస్కృతిని మనం గుర్తించాలి. స్కూల్స్, కాలేజీలు, ఆఫీసుల్లో ఈ రోజు ఎలాగైతే సెక్సువల్ అవేర్ నెస్ పెంచాలనే ఒక డిమాండ్ వస్తుందో అలాంటి డిమాండ్ ఒక డాక్టర్ గా నేను సమాజం ముందు పెడుతున్నా ... ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండడం అంటే – మానసికంగా ఒక ఉల్లాస పరిస్థితిలో ఉండడమే ! కాళ్ళు చేతులు బాగుండి, బీపీ, షుగర్ మొదలగు లిమిట్స్ లో ఉండి కూడా మనిషిలో మనిషిగా ఉండాల్సిన ఒక భావన లేకపోతే సమాజం సమిష్టిగా ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఈ రోజు సమాజం లో వస్తున్న మార్పులు అది గ్లోబలైజేషన్ వలన అయితేనేమి, అనిశ్చిత ప్రపంచ రాజకీయ వ్యాపార పరిస్థితి వలన అయితేనేమి ప్రతి వ్యక్తి మానసిక ఆరోగ్యం పైన ప్రభావం చూపుతున్నాయి. లిమనము ఇంకా "మానసిక వ్యాధి" అనే పదానికి భయపడుతూ ఉన్నాం. ఈ మౌనం, ఈ అపహాస్యం ఆగాలి. సైకియాట్రిస్ట్ లు అంటే పిచ్చివాళ్ళ డాక్టర్ లు కాదు. మనందరి ప్రాణాలు కాపాడే మిగతా వైద్యుల మాదిరిగానే వైద్యులు. థెరపీ కోసం వెళ్ళడం బలహీనత కాదు, బుద్ధివంతమైన నిర్ణయం.లి ప్రతి మనిషి మానసిక ఆరోగ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించుకునే సమాజం కావాలి. ఇదే మనం అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూస్తే అమెరికాలో ప్రతి లక్ష మందికి 12 మంది, చైనాలో ప్రతి లక్ష మందికి ముగ్గురు సైకియాట్రిస్ట్ లు ఉంటే, ఇండియా లో లక్ష మందికి ఒక్క సైకియాట్రిస్ట్ కూడా లేదు. మన మినిస్ట్రీ ఆఫ్ ఫేమిలీ అండ్ మెంటల్ హెల్త్ ప్రకారం 10 శాతం అడల్ట్ జనాభాలో మెంటల్ డిజార్డర్స్ ఉన్నాయంటే మన మధ్యలో మానసిక వ్యాధి కలిగిన వాళ్ళు కోట్లలో ఉన్నట్లు. ఇంత పెద్ద సమస్యను ముందు పెట్టుకుని మనల్ని మనం ఆత్మ వంచన చేసుకుంటూ బతుకుతున్నాం. ఇదో పాపపంకిలం అన్నట్టు చూస్తున్నాం. సమాజం మొత్తంగా మనిషి ఆరోగ్య విషయం లో దిగజారి ప్రగతి సాధించలేక పోతున్నాం. ఇక మౌనాన్ని వీడాల్సిన సమయం వచ్చింది.

**డా. సనా కౌసర్‌లి, MBBS., (MD సైకియాట్రి)**
**మమత మెడికల్ కాలేజ్ (ఖమ్మం)**
**Cell No. 8074598139**

# తేనీటి తో మానసిక ఉల్లాసం - మే 21... అంతర్జాతీయ టీ దినోత్సవం




టీ ఉత్పత్తి చేసే దేశాలలో, ముఖ్యంగా తలసరి వినియోగం సాపేక్షంగా తక్కువగా ఉన్న టీ ఉత్పత్తి చేసే దేశాలలో డిమాండ్‌ను విస్తరించే దిశగా ఎక్కువ ప్రయత్నాలు చేయాలని, సాంప్రదాయ దిగుమతి చేసుకునే దేశాలలో తగ్గుతున్న తలసరి వినియోగాన్ని పరిష్కరించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని ఇంటర్ గవర్నమెంటల్ గ్రూప్ ఆన్ టీ పిలుపును తిరిగి నొక్కి చెబుతూ, జనరల్ అసెంబ్లీ మే 21ని అంతర్జాతీయ టీ దినోత్సవంగా ప్రకటించాలని నిర్ణయించింది . తేనీరు ఒక పానీయం. తేయాకును నీటిలో మరిగించి వచ్చిన ద్రావకాన్ని తేనీరు (టీ) అంటారు. మానవ దేహానికి ఉత్తేజాన్ని కల్గించే ఆహార పదార్థాలలో టీ ప్రథమ స్థానంలో ఉంటుంది. దీనిలో పంచదార, పాలు కలుపుకొని త్రాగుతారు. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయే వరకు మనిషి జీవితంలో టీ పాత్ర అమోఘమైంది. నిస్సత్తువగా ఉన్నా, ఉల్లాసంగా ఉన్నా టీ త్రాగడానికి అత్యంత ఉత్సాహాన్ని చూపడం జీవితంలో ఓ అంతర్భాగమై పోయింది. సగటు భారతీయుల్లో దాదాపు సగం మందికి పైగా టీ సేవిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం మానసిక విశ్రాంతి కోసం కాఫీ సేవించడం అలవాటుగా ఉండేది. ఇళ్ళలో కూడా కాఫీ మాత్రమే వాడుకలో ఉండేది. ఫిల్టర్ కాఫీ బాగా వాడుకలో ఉన్న రోజుల్లో ఇన్‌స్టంట్ కాఫీలు రావడం, వాటితోపాటు పలు రకాల టీ పౌడర్లు మార్కెట్‌లోకి విడుదల కావడం, టీకి జనసామాన్యంలో అధిక వినియోగం ఏర్పడడం, పైగా అది సామాన్య మానవుడికి అందుబాటు ధరలలో లభించడం టీకి మరింత ప్రాధాన్యత పెరగడానికి దోహదపడింది. చరిత్ర ప్రకారం.. టీని క్రీస్తుపూర్వం మొదటిసారిగా 2737లో చైనా చక్రవర్తి షెన్‌నంగ్ కనిపెట్టారు. ఆయన తాగే వేడి గిన్నెలో టీ తేయాకు పడిందట.. దాని నుంచి వచ్చిన టేస్ట్ ఆయనకు నచ్చడంతో మొదట బ్లాక్ టీ పుట్టుకొచ్చింది. ఆ తరువాత టీని...మనం తాగే విధంగా తయారు చేయడానికి 3 సంవత్సరాలు పట్టింది. అలాగే శతాబ్దాలుగా టీని ఔషధంగా వాడుతూ వచ్చేవారు. టీని తాగడానికే కాకుండా.. వివిధ రకాల మందులో విరివిగా ఉపయోగించేవారు. 15వ శతాబ్దంలో నాగరిక ప్రపంచంలో టీ త్రాగడం ప్రారంభ మయ్యింది. 17వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వినిమయ పద్ధతిలో బట్టలు, వెండికి, అనధికారికంగా నల్లమందుకు బదులుగా టీని చైనా నుండి దిగుమతి చేసుకునేది.చైనా నుండి బ్లాక్, గ్రీన్ టీ రకాల విత్తనాలను లార్డ్ మెకార్ట్నీ తెప్పించి, భారతదేశంలో 1793 లో కలకత్తా బొటానికల్ గార్డెన్స్‌లో ప్రవేశ పెట్టాడు. ఇవి పశ్చిమ బెంగాల్, కచార్, నీలగిరి ప్రదేశాలలో నాటబడ్డాయి. చాలాకాలం తర్వాత 1823 లో బ్రిటన్‌కు చెందిన బ్రూస్ సోదరులు అస్సాంలో దేశీయంగా తేయాకును కనిపెట్టి నప్పుడు భారతదేశంలో టీ ఉత్పాదన ప్రారంభమయ్యింది. విస్తారంగా టీ వృద్ధి చెందే ప్రాంతాలను వీరు కనుగొన్నారు. ఇవి సింగ్‌ఫో జాతులు తోటల పెంపకంలో మిగిలినవై ఉండవచ్చు. ఈ కొండ ప్రదేశాలలో జనులు టీ ఆకులతో చేసిన నాటు సారాను త్రాగుతూ ఉండేవారు. మొట్టమొదట 1838 లో దిబ్రుఘర్ నుంచి 8 పెట్టెలు ఎగుమతి చేయ బడ్డాయి. ఈ బ్లాక్ టీ సౌచోంగ్, పీకో అని రెండు గ్రేడులుగా చాలా ప్రసిద్ధి పొందింది. చైనాతో 1833 లో ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్య వ్యాపార సంబంధాలు చెడిపోయి నప్పుడు, ఇంగ్లాండు భారతదేశంలో టీ ఉత్పాదనకు తీవ్ర మైన ప్రయత్నాలు ప్రారంభించింది. 1860 కి చైనా టీ ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధిపొందింది. 1880లలో అమెరికాలో మొదటిగా టీ బ్యాగుల వాడకం మొదలైంది. వ్యాపారం నిమిత్తం అక్కడివారికి టీని టేస్ట్ చేయడానికి టీ పొడిని చిన్న బ్యాగుల్లో వేసి ఇచ్చారు. 18వ శతాబ్దం నుంచీ రెండో ప్రపంచ యుద్ధం వరకూ అమెరికాలో గ్రీన్ టీ ఫేమస్. తైవాన్‌లో 1980 నుంచీ బబుల్ టీ అంటే బుడగల టీ వాడకంలో ఉంది. చిక్కటి టీని గిలక్కొట్టి ఇస్తారు. 1904లో వర్జీనియాలో ఐస్‌టీని కనిపెట్టారు. కొన్ని ఐస్ ముక్కలపై టీని పోసి తాగేవారు. నేడు అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రాంతాలు భారతదేశంలో టీని అధికంగా ఉత్పాదించే రాష్ట్రాలుగా ప్రసిద్ధి పొందాయి. భారతదేశపు టీ ఉత్పాదక ప్రదేశాలలో త్రిపుర, కర్ణాటక, మణిపూర్, సిక్కిం, అరుణా చలప్రదేశ్ ముఖ్య పాత్రను వహిస్తున్నాయి. నీలగిరి కొండలలో భారత దేశపు ఉత్తమ రకం టీ ఉత్పాదించ బడుతుంది. మొత్తం సుమారు 98 శాతం టీని ఉత్పాదిస్తున్నాయి. సతత హరితపు మొక్క అయిన టీకి వర్షపాతం అధికంగా ఉండాలి. అప్పుడే అది పుష్కలంగా, సమృద్ధిగా పెరుగుతుంది. దిగుబడి అధికంగా ఉంటుంది. సముద్ర మట్టానికి ఎత్తుగా ఉండే ప్రదేశాలలో పెరిగే టీ ఉత్తమమైనది. కానీ మైదానాలలో పెరిగే టీ వల్ల అధిక ఫలసాయం వస్తుంది. దాదాపు ప్రతి దేశంలోనూ టీ వినియోగంలో ఉన్నా భారతదేశం ఉత్పాదించే టీ వైవిధ్యానికీ, విశిష్టతకూ ప్రసిద్ధి పొందింది. పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ టీ మిక్కిలి నాణ్యమైనది. ఇది సువాసన భరితమైనది. ముఖ్యంగా ఇక్కడి మంచుతో కూడిన హిమాలయ పర్వత వాతావరణ పరిస్థితుల వల్ల, ఈ ప్రదేశంలో భూసార రచనా విధానం వల్ల ఇక్కడ ఉత్పత్తి కాబడే టీకి ప్రత్యేక రుచి, సువాసన సిద్ధిస్తుంది. భారతదేశంలో తేయాకు సాగు ప్రాతిపదికగా అనేక మందికి జీవనోపాధి కలుగుతోంది. ఈ రంగంలో సుమారు 20 లక్షల మంది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ శ్రామికులు ఉన్నారు. వీరిలో 50 శాతం స్త్రీలు ఉన్నారు. చైనా, జపాన్‌లలో టీ త్రాగడం విస్తారమైన తంతుతో కూడిన ఒక గొప్ప ఉత్సవం (%ఝము జవతీవఎశీఅఎ%) గా పరిణమించింది. అక్కడ టీ డికాక్షను కాచి పంచదార, పాలు కలపకుండా త్రాగుతారు. ఒక్కొక్కప్పుడు నిమ్మరసం, పంచదార కలిపి త్రాగుతారు. అమెరికాలో సామాన్యంగా టీలో ఐస్ వేసి, పంచదారతో త్రాగుతారు. భారతదేశం, బ్రిటన్‌లలో పాలు, పంచదార కలిపి త్రాగుతారు. టిబెటియన్‌లు గ్రీన్ టీని ఉప్పు, యాక్ వెన్నతో కొయ్య కప్పులలో త్రాగుతారు. ఆఫ్రికాలో డికాక్షనును చిలికి నురగగా తయారు చేసి త్రాగుతారు. పశ్చిమ ఆసియాలో టీని యాలకులతో కలిపిన డికాక్షన్‌తో త్రాగితే, భారత దేశంలో గుజరాతీలు మసాలా టీ త్రాగుతారు. బ్లాక్ లేక గ్రీన్ టీని ఏలకులు, కొట్టిన బాదంపప్పు కలిపి కహ్వా అని కాశ్మీరీలు త్రాగుతారు. ఇది చాల పుష్టికరమైన, రుచికరమైన పానీయం. గ్రీన్ టీ లేదా ఆకుపచ్చ తేనీరు, అల్లం తేనీరు, తెల్ల తేనీరు, నల్ల తేనీరు, డార్జిలింగ్ టీ ఇలా పలు రకాలుగా ఉన్నాయి. టీ సహజమైన పానీయం. దీనిలో రసాయనిక పదార్థాలుగానీ, కృత్రిమ సువాసనల ద్రవ్యాలుగానీ, ఇతర రంగులుగానీ చేరి ఉండవు. ఇది ఆరోగ్యదాయకమైన, శక్తిదాయకమైన పానీయం. దీనిలో విటమిన్లు ముఖ్యంగా బీ గ్రూప్ విటమిన్లు, రిబోఫ్లేవిన్, నియాసిన్ ఉంటాయి. దీన్లో అతి తక్కువగా లభించే కెఫీన్ మానవ శరీరానికి ఆరోగ్యకరమైనది. అపాయకారి కాదు. తేనీరువల్ల కలిగే ప్రయోజనాలలో, రోజూ టీ తాగేవాళ్లలో ఎముకలు బలంగా ఉంటాయి. బ్లాక్ టీ తాగేవారిని ఫ్లూ జ్వరాలు లాంటివి అంత త్వరగా దరిచేరవు. రోజూ మూడు నాలుగు కప్పుల టీ తాగేవారిలో గుండె పోటు ప్రమాదం 21 శాతం తగ్గుతుంది. టీలో ఉండే ఫ్లోరైడ్ దంతాలు దృఢపడేందుకు సాయపడుతుంది. తేనీరులోని ఫ్లేవనాయిడ్స్ గుండెను ఆరోగ్యవంతంగా పనిచేయిస్తాయి. గ్రీన్, బ్లాక్ టీలలో ఉండే ఎల్-థయానైన్ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ రాకుండా కాపాడతాయి. అనేక రకాల అలెర్జీలకు టీ విరుగుడు. టీ డీహైడ్రేషన్ సమస్యనూ దూరం చేస్తుంది. అలాగే టీ వల్ల నష్టాలూ లేక పోలేదు. ఆహారముతో పాటు టీని తీసుకుంటే ఆహారము లోని పోషక పదార్థములు శరీరము గ్రహించడంలో ఇబ్బంది కలుగుతుంది. ముఖ్యంగా ' ఐరన్ ' టానిన్ తో కలిసి పనికిరాకుండా పోతుంది. టీ ఎక్కువగా తాగితే కడుపులో అసిడిటీ పెరిగి అల్సర్ రావడానికి అవ కాశ ముంటుంది. టీ మెదడుని ఉత్తేజ పరిచి నందున శరీరం హుషారుగా ఉన్నా కొంత సేపటికి దాని ప్రభావము తగ్గి మెదడు డిప్రెషన్ కు లోనవుతుంది. విద్యార్థులు టీ తాగి నిద్ర రాకుండా చదివినా, ఏకాగ్రత ఎక్కువ సేపు నిలువదు. టీ ఎక్కువ సార్లు త్రాగే వారికి ఆకలి మందగించి భోజము తీసుకోవడం తగ్గడం వలన ఆరోగ్యము క్షీణిస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## చురకలు సంపాదకీయం


# సైన్యమే శత్రువైతే.. అదే పాకిస్థాన్.. దేశాధినేతలనే ఉరితీస్తుంది

"ప్రతి దేశానికి సైన్యం ఉంటుంది.. కానీ, సైన్యానికే దేశం ఉంది.. దాని పేరు పాకిస్థాన్".. వినడానికి అతిశయోక్తిగా ఉన్నా.. ఇది నిజం. భారత్ కంటే పట్టుబట్టి ఒక్క రోజు ముందు స్వాతంత్ర్యం పొందిన పాకిస్థాన్ ఇప్పటివరకు 77 ఏళ్లలో దశాబ్దాల పాటు సైనిక పాలనలో మగ్గింది. 1958 నుంచి 2008 వరకు మూడుసార్లు సైనిక తిరుగుబాటు జరగడం గమనార్హం. అందుకనే పాక్ ను ఫెయిల్యూర్ కంట్రీ అని అంటారు. అంతెందుకు? ప్రస్తుత ప్రధాని షాబాజ్ షరీఫ్ అన్న నవాజ్ షరీఫ్ కూడా సైన్యం బాధితుడే. ఓవైపు భారత్ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని ముందుకు దూసుకుపోతుండగా.. మరోవైపు పాకిస్థాన్ ప్రభుత్వాలు సైన్యం చెప్పుచేతల్లో నడుస్తూ దేశాన్ని కుంగదీశాయి. అక్కడ సైన్యం చెప్పిందే వేదం.. లేదంటే ప్రధానమంత్రి అయినా ఖతం. వారి మాటను ధిక్కరిస్తే ప్రభుత్వాలనే పడగొట్టేస్తుంది. 1999లో కార్గిల్ యుద్ధంలో ఓడిపోవడంతో నవాజ్ షరీఫ్ ను ఉన్నపళంగా పీకిపారేసి.. జనరల్ పర్వేజ్ ముషారఫ్ అధికారం చేపట్టారు. 2008 వరకు అతడే సర్వం అన్నట్లు ఏలాడు. 1958లో తొలిసారి పాకిస్థాన్ లో ప్రభుత్వాన్ని సైన్యం కూల్చేసింది. 13 ఏళ్ల పాటు జనరల్ మొహమ్మద్ ఆయూబ్ ఖాన్ పాలన సాగించాడు. 1977లో మళ్లీ తిరుగుబాటు జరిగింది.. ఈసారి జనరల్ జియా ఉల్ హక్ చేతుల్లోకి వెళ్లింది పాకిస్థాన్. 1988 వరకు అతడే పాక్ ను ఏలాడు. మరో 11 ఏళ్ళ గడిచాయో లేదో.. 1999లో ముషారఫ్ చేతబట్టాడు. దాదాపు 20 ఏళ్లు పాకిస్థాన్ సైన్యం చేతుల్లోనే ఉంది. దీన్నిబట్టే ఆ దేశంలో సైన్యం ఎంత శక్తిమంతం అయినదో చెప్పొచ్చు. ఎన్నుకున్న ప్రభుత్వం అయితే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానులు ఉంటారు. కానీ, సైన్యంలో ఎక్కడికక్కడ స్థానిక అధికారులదే పెత్తనం అవుతుంది. వీరంతా పాకిస్థాన్ ను కుదేలు చేశారు. అవినీతితో దేశాన్ని లూటీ చేశారు. ఎక్కడైనా శత్రువుగా భావించే దేశంతో సైన్యం యుద్ధం చేస్తుంది. కానీ, పాక్ సైన్యం ఆ బాధ్యతను ఉగ్రవాదులకు అప్పగించి దేశాన్ని దోచుకోవడంపై పడింది. తమ శరీరంలో భాగమైన ఆయుధాలను పక్కన పారేసి.. భూ ఆక్రమణలకు దిగి వ్యాపార సామ్రాజ్యాలనే నెలకొల్పారు పాక్ సైనిక పాలకులు. ఇందులో ప్రధానంగా బాగుపడింది సైనిక జనరల్సే అని చెప్పాలి. రెండేళ్ల కిందట పాకిస్థాన్ లో గోధుమ పిండికీ యుద్ధాలు జరిగాయి. అంత పేదరికం ఉంది అక్కడ. కానీ, పాకిస్థాన్ సైనిక అధికారులు మాత్రం కోట్లకు పడగలెత్తారు. పెద్దపెద్ద భవనాల్లో ఉంటూ విలాసాల్లో మునిగితేలడమే వీరి పని. ఒకవేళ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉన్నా.. సైన్యందే పెత్తనం. 40 శాతం జనాభా దారిద్ర్యంలో ఉన్నా పాకిస్థాన్ లో ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తం. ఇక అధిక ధరలు, ఆర్థిక సంక్షోభం గురించి చెప్పేదేముంది? ఇప్పటికే అప్పు 126 బిలియన్ డాలర్లు దాటింది. ఇవి తీర్చడానికే బడ్జెట్ లో 40 శాతం సొమ్ము పోతోంది. ఆకలి సూచీలో అట్టడుగున ఉంది. ఆర్థిక వృద్ధి రేటు 2.4 శాతమే. ఇక తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదంఉన్న బలూచిస్థాన్ లో 70 శాతం మంది పేదరికంలో ఉన్నారు. విదేశీ మారక నిల్వలు అడుగంటాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇచ్చే ఉద్దీపన ప్యాకేజీలు, కొన్ని దేశాల రుణాలతో పాక్ నెట్టుకొస్తోంది. దేశంలో దరిద్రం ఇలా ఉంటే.. సైన్యం మాత్రం సంపదతో తులతూగుతోంది. చెప్పాలంటే.. రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్, అగ్రి బిజినెస్, తయారీ, మీడియా, సరుకుల రవాణాతో ఇదొక కార్పొరేట్ సంస్థలా మారి దండిగా సంపద పోగేసుకుంటోంది. సైన్యంలోని కార్పొరేట్ సామ్రాజ్యం ఫౌండేషన్ల ఏర్పాటు చేసి పాక్ ప్రభుత్వ వ్యవస్థలా నడిపిస్తోంది. ప్రస్తుత, మాజీ సైనిక ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నడిచే ఈ సంస్థలు వారిదే ముసుగులో వ్యాపార దందా సాగిస్తున్నాయి. సంపద మాత్రం సైనిక ఉన్నతాధికారుల జేబుల్లోకి పోతుంది. మళ్లీ ఈ డబ్బుని తమకు కావాల్సిన రాజకీయ పార్టీలకు ఇస్తుంది. కింది స్థాయి సైనికులకు అందేది కూడా నామమాత్రమే. ఇటీవల విరమణ చేసిన సైన్యాధిపతి జనరల్ కమర్ జావేద్ బజ్వా, అధికార ప్రతినిధి అసిమ్ సలీమ్ బజ్వా, ఆయన సోదరుడు నాలుగు దేశాల్లో 133 రెస్టారెంట్లు పెట్టారంటేనే అర్థం చేసుకోవచ్చు. ఇక పాక్ భూభాగంలో 12 శాతం సైన్యం చేతిలో ఉందని చెబుతారు. ఇందులో మూడింట రెండొంతులు సీనియర్ సైనికాధికారుల కబ్జాలో ఉండటం. రిటైర్ అయ్యేటప్పటికి వీరికి ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టడం సంప్రదాయంగా మారిందట. సైన్యం మాట వినందుకే పాక్ ప్రధాన మంత్రి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వాన్ని కూలదోశారు. 1979లో ఆయనను ఉరి తీశారు.

ఈయన కుమార్తెనే మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో. ఈమె కుమారుడే ప్రస్తుతం పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో. ఇతడు 28 ఏళ్లకే 2022లో విదేశాంగ మంత్రి అయ్యాడు. బేనజీర్ భర్తనే ఆసిఫ్ జర్దారీ. గతంలో పాకిస్థాన్ అధ్యక్షుడిగా పనిచేశాడు.

# మే 21...దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి - జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం

జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం మే 21న దేశవ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. 1991, మే 21న తమిళనాడు రాష్ట్రంలోని పెరంబుదూర్ ఎన్నికల ప్రచారంలో ఎల్.టి.టి.ఇ. తీవ్రవాదులు జరిపిన అమానుష దాడిలో రాజీవ్ గాంధీ బలి అయినారు. రాజీవ్ గాంధీ హత్య గావించ బడిన నాటి నుండి మే 21 తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించ బడింది. స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా జరుప బడుతుంది. తీవ్రవాద చర్యలు రూపుమాపి, దేశ ప్రజలు సహజీవనంతో మెలగాలన్నది ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్న భావాన్ని ప్రజల్లో కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 40 ఏళ్ల వయసులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ అప్పట్లో చిన్న వయస్కులైన నేతల్లో ఒకరు. రాజీవ్‌గాంధీ 1944లో ఆగస్ట్ 20న ముంబైలో జన్మించారు. భారతదేశం స్వాతంత్ర్యం సాధించే నాటికి ఆయన తాత ప్రధానమంత్రి అయ్యేనాటికి రాజీవ్ వయసు కేవలం 3 సంవత్సరాలు మాత్రమే. ఆయన తల్లిదండ్రులు ఇందిరా ఫిరోజ్ లక్నో నుంచి ఢిల్లీకి మకాం మార్చారు. 1984 అక్టోబర్ 31న తల్లి ఇందిరా గాంధీ దారుణ హత్యకు గురైన సమయంలో ప్రధాన మంత్రిగాను, కాంగ్రెస్ అధ్యక్షుని గానూ ఆయన బాధ్యతలు చేపట్టారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మే 20 మధ్యాహ్న సమయంలో బయలుదేరి భువనేశ్వర్ మీదుగా, ఆంధ్ర ప్రదేశ్ లోని కొన్ని నియోజక వర్గాలలో పర్యటించారు. లభ్యమవుతున్న సమాచారం ఆధారంగా...రాజీవ్ పర్యటనకు వినియోగిస్తున్న విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినప్పటికి చివరికి మరమత్తులు చేయించి సాయంత్రం 6.30కి వైజాగ్ నుంచి బయలుదేరి చెన్నై చేరుకొని, సాయంత్రం 8.30ని, లకు స్థానిక కాంగ్రెస్ నాయకురాలు మరకతం చంద్రశేఖర్ తో కలసి గ్రాండ్ వెస్టన్ ట్రంక్ రోడ్డు ఆలయ ప్రాంగణములో ఉన్న సభా ప్రాంగణానికి చేరుకున్నారు. భారీగా వచ్చిన జనాన్ని నివారించే చర్యలు చేపట్టి, కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు కొందరు వి.ఐ.పి లను మాత్రమే కట్టుదిట్టమైన భద్రత ద్వారా ఆయన్ని కలవటానికి అనుమతించారు. అయినప్పటికి రాజీవ్ గాంధీ ఉన్న వేదిక పైకి అనుమతి పొందిన వారితో పాటుగా థాను, శివరాజన్, హరిబాబులు ( ముఖ్యమైన ముద్దాయిలు గుర్తించ బడ్డారు) కూడా వెళ్ళారు. థాను అనే ఒక యువతి ఒక గంధపు మాల తీసుకుని రాజీవ్‌గాంధీ వైపు మళ్లింది. ఆమె ఆయన పాదాలను తాకేందుకు వంగగానే..తన నడుముకు ఉన్న ఆర్డీఎక్స్ అనూహ్యంగా ప్రయోగించింది. చెవులు పగిలిపోయేలా ఒక పేలుడు సంభవించింది. అలా రాజీవ్ గాంధీ హతమార్చ బడ్డారు. ఎల్‌టీటీఈకి చెందిన ఆత్మాహుతి దళం బాధ్యులు నళిని, శ్రీలంక జాతీయుడైన ఆమె భర్త మురుగన్ ఎల్‌టీటీఈ ఉగ్రవాదులతో కలిసి రాజీవ్ గాంధీ హత్యకు కుట్ర పన్నారు. మే 21న రాత్రి పది గంటల ప్రాంతంలో ఈ హత్య జరిగింది. ఆ భయంకర పేలుడు జరిగిన సమయంలో తమిళనాడు కాంగ్రెస్ నేతలు మూపనార్, జయంతి నటరాజన్, రామమూర్తి అక్కడే ఉన్నారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో రాజీవ్‌గాంధీని వెతకడం ప్రారంభించారు. అప్పటి ఆయన శరీరంలో ఒక భాగం, సగం తల కనిపించింది. ఆయన కపాలం ముక్కలై పోయింది. దాని నుంచి బయటి కొచ్చిన మెదడు, ఆయన సెక్యూరిటీ అధికారి పీకే గుప్తా కాళ్లపై పడి ఉంది. పేలుడు జరిగిన సమయంలో రాజీవ్‌తో పాటు పలువురి శరీరాలు ముక్కలు ముక్కలుగా ఎగిరి పడ్డాయి. కాగా, రాజీవ్ గాంధీని చూసేందుకు సభా స్థలికి వచ్చిన జనాల్లో చాలా మంది నల్లటి మాంసపు ముద్దల్లా మారిపోయారు. ఆ రోజు అందరి శరీరాలు ముక్కలు ముక్కలుగా మారిపోయాయి. రాజీవ్ సెక్యూరిటీ అధికారి ప్రదీప్ గుప్తా కొంత సేపు ప్రాణాలతో బతికినా తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. తర్వాత రాజీవ్ గాంధీ శరీరం కనిపించింది. ఆయన లోటో బూట్లు, తెగిపడిన చేయి, దానికి ఉండే వాచ్‌లను చూసి అవి రాజీవ్ గాంధీయేనని నిర్ధారించారు. రాజీవ్ హత్య జరిగిన రోజు 10 గంటల 25 నిమిషాలకు ఢిల్లీలో రాజీవ్ నివాసం 10 జన్‌పథ్ లో అప్పటికే సోనియా, ప్రియాంక కూడా నిద్రకు ఉపక్రమించారు. అయితే రాజీవ్‌గాంధీ ప్రైవేటు సెక్రటరీ జార్జ్‌కు ఓ ఫోన్ వచ్చింది. రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారనే వార్త తెలియగానే ఇంటి లోపలికి పరుగెత్తి సోనియా గాంధీకి తెలియ జేయడంతో ఆమె వెంటనే ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నోటి మాట రాలేదు. ఈ దుర్ఘటనలో సుమారు 14 మంది హతులైనారు. ఈ హత్యకు ప్రధాన సూత్రధారి తెన్మోజి రాజరత్నం. ఈమె థానుగా పిలువ బడింది. ఈ హత్యోదంతానికి శ్రీలంక లోని లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్.టి.టి.ఈ) సంస్థ ప్రధాన కారకులు. కేసు విచారణ కోసం సీఆర్పీఎఫ్ ఐజీ డాక్టర్ డీఆర్ కార్తికేయన్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. ఈ కమిటి... హరిబాబు (ముద్దాయిలలో ఒకడు) తీసిన ఫొటోల ఆధారంగా విచారణ ప్రారంభించింది. ఈ దర్యాప్తు బృంద విచారణ ప్రకారం ఈ హత్యలో భాగస్వామ్యులు అందరు ఎల్.టి.టి.ఇ. కి చెందిన వారుగా గుర్తించింది. తర్వాత కొన్ని నెలల్లోనే ఈ హత్యారోపణలతో ఎల్.టి.టి.ఇ.కి చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. ముఖ్య ముద్దాయిలు శివరాజన్, శుభలను వీరు ప్రాణాలతో పట్టుకొన లేక పోయారు. ప్రధాన నిందితుడు శివరాజన్, ఆయన సహచరులు అరెస్ట్ కావడానికి ముందు సైనైడ్ తీసుకున్నారు. కార్తికేయన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిట్ హత్య జరిగిన ఏడాదిన్నర తర్వాత నివేదిక సమర్పించారు. 500 వీడియో క్యాసెట్లు, లక్ష ఫోటో గ్రాఫులను పరిశీలించి, వేలాదిమంది సాక్షుల్లో 1044 మంది సాక్షుల వాంగ్మూ లాలను ఉదహరిస్తూ, 10వేల పేజీల వాంగ్మూలాలు, 1477 వస్తువులు, సాక్షులను కోర్టు ముందుంచి నివేదిక సమర్పించింది. ఈ కేసును సుప్రీం కోర్ట్ ధర్మాసనం న్యాయ మూర్తులు కె.పిథమస్, ది.పి.వాధ్వా, సయ్యద్ షా మొహమ్మద్ ఖ్వాద్రిల ఆధ్వర్యంలో నాలుగు మాసాలు చర్చ అనంతరం 1995 మే 5 న తుది తీర్పుగా కొందరు ముద్దాయిలకు ఉరి శిక్ష, మరి కొందరిని జీవిత ఖైదు విధించారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో మొదట 26 మందికి మరణ శిక్ష విధించారు. తర్వాత వీరిలో ఏడుగురే దోషులుగా మిగిలారు. నళినికి, మరో ముగ్గురికి మరణ దండన పడింది. రాబర్ట్ ప్యాస్, జయకుమార్, రవిచంద్రన్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 2000వ సంవత్సరంలో నళిని మరణ శిక్షను జీవిత ఖైదుగా మార్చడం, మరణ శిక్ష పడిన మరో ముగ్గురికి 2014లో శిక్షను తగ్గించి, యావజ్జీవ కారాగారం విధించడం క్రమానుగతంగా జరిగాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టు తన అధికారాలను వినియోగిస్తూ 2022 మే 18న పేరరివాళన్ విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. కేసులోని మిగతా దోషులు నళిని శ్రీహరన్, ఆర్పీ రవిచంద్రన్, శంతన్, మురుగన్, రాబర్ట్ పయాస్, జయకుమార్ లను కూడా నవంబర్ లో రిలీజ్ చేయాల్సిందేనని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో వారంతా విడుదల అయ్యారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




# తెలుగు సంస్కృతిని పరిరక్షించాలి - మే 21...ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం

ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవ సాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగు మల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగు మల్లి, భువన విజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళ్ల కృషి చేసి విజయం సాధించాయి. అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా




తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. 2024లోనూ అదే సంప్రదాయాన్ని పాటించారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్ట మొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సారెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గొల్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం- భారతదేశం, జిజ్ఞాస %-% భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ %-% కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్తెన్-ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ %-% న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి %-% న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి %-% ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగు లోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించా ల్సిన అవసరం అనివార్యంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పర్యావరణ ప్రేమికుడు సుందర్‌లాల్ బహుగుణ - మే 21... సుందర్ లాల్ బహుగుణ వర్ధంతి



ప్రఖ్యాత పర్యావరణ వేత్త, చిప్కో ఉద్యమకారుడు సుందర్ లాల్ బహుగుణ 1927 జనవరి 9 న ఉత్తరాఖండ్ లోని తెహ్రీ సమీపంలో ఉన్న మరోడా గ్రామంలో జన్మించారు. ఆయన గాంధేయవాది, ఉద్యమకారుడు, పర్యావరణవేత్త. ప్రధానంగా చిప్కో ఉద్యమానికి నాయకత్వం వహించారు. చెట్లు, పర్యావరణం, మానవ సమాజం అంటూ అందరికీ అర్థమయ్యే రీతిలో "చిప్కో ఉద్యమాన్ని" చేపట్టి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. "చిప్కో" అనే పదం హిందీ నుంచి వచ్చింది. దీని అర్థం అతుక్కు పోవడం లేదా ఆలింగనం చేసుకోవడం. ప్రజల హక్కులను అటవీ సంపదను పరిరక్షించి, దానికి శాస్త్రీయంగా కొత్త రచన చేయడమే చిప్కో ఉద్యమ లక్ష్యం. చిప్కో ఉద్యమం అటవీ సంరక్షణ ఉద్యమం. 1973లో చమోలి జిల్లా (ఉత్తరాఖండ్) లోని గోపేశ్వర్‌లో 300 వృక్షాలను నరికేందుకు ఉత్తరప్రదేశ్ అటవీశాఖ (అప్పట్లో ఈ ప్రాంతం ఉత్తరప్రదేశ్లో భాగం) సైమన్ కంపెనీకి అనుమతిచ్చింది. దీనికి ఆ గ్రామ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒక్కొక్కరూ ఒక్కో చెట్టును ఆలింగనం చేసుకొని చెట్లను నరకాలనుకుంటే వాటితోపాటు మమ్మల్నీ నరకండి అని హెచ్చరించారు. దీంతో చిప్కో ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమాన్ని ఉత్తరాఖండ్ అడవుల్లో నివసించే గిరిజనులు (ముఖ్యంగా బిష్ణోయ్ తెగ మహిళలు) ఆ ప్రాంతంలోని అడవులను (నరికివేయకుండా) కాపాడు కోవడానికి చేపట్టారు. తొలుతచారిత్రకంగా, తాత్వికంగా, గాంధేయ సత్యాగ్రహ విధానాల్లో వృక్షాలను రక్షించే ఉద్యమంగా ప్రారంభమై తర్వాత ఆర్థిక ఉద్యమంగా మారి చివరకు పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా రూపు దిద్దుకుంది. ఈ ఉద్యమాన్ని అడవి సత్యాగ్రహం అని కూడా అంటారు. బ్రిటిషర్లు రూపొందించిన అటవీ చట్టం -1927 వల్ల పల్లె ప్రజల హక్కులకు భంగం వాటిల్లడం, గ్రామీణులు జీవనోపాధి కోల్పోవడం, అడవులను వాణిజ్యా వసరాల కోసం విపరీతంగా కొల్లగొట్టడంతో ఈ ఉద్యమం దేశమంతా వ్యాపించింది. బహుగుణ దేశ స్వాతంత్రంకు ముందు ముందు వలస రాజ్యాల పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించారు. అతను తన జీవితంలో గాంధేయ సూత్రాలను అవలంబించారు. అతను వివాహానంతరం గ్రామీణ ప్రజల మధ్య నివసించా లనీ, గ్రామంలో ఆశ్రమం ఏర్పాటు చేయాలనే షరతుతో విమ్లాను వివాహం చేసుకున్నారు. జాతిపిత గాంధీ స్ఫూర్తితో, ఉద్యమంలో భాగంగా సుందర్‌లాల్ బహుగుణ 1981-83 మధ్య కాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో అడవులు, కొండల గుండా దాదాపు 500 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీని కలిసి హిమాలయ ప్రాంతాల్లో చెట్ల నరికివేతను నిషేధించాలని కోరారు. ఫలితంగా అక్కడ 15 ఏళ్ల పాటు చెట్ల నరికివేతను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో ఈ ఉద్యమం ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది. ప్రారంభంలో ఆయన అంటరాని తనానికి వ్యతిరే కంగా పోరాడారు. తరువాత 1965 నుండి 1970 వరకు తన మద్యపాన వ్యతిరేక ఉద్యమాన్ని గిరిజన మహిళలతో కలసి చేపట్టారు. ప్రజలతో కలసి పెద్ద ఆనకట్టలకు వ్యతిరేకంగా పర్యావరణ సమస్యలపై ఉద్యమాలను చేపట్టడం ప్రారంభించారు. వృక్షాలే కాదు, అంతరించి పోతున్న జంతు, పక్షి జాతుల పరిరక్షణ కోసం నిరంతరం పరితపించే వారు. సుందర్ లాల్ 1970 లలో చిప్కో ఉద్యమంలో సభ్యుడిగా, తరువాత 1980 ల నుండి 2004 ప్రారంభం వరకు టెహ్రీ ఆనకట్ట వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. తెహ్రీ ఆనకట్ట వ్యతిరేకంగా సత్యాగ్రహ పద్ధతులతో భగీరథి నది ఒడ్డున నిరాహార దీక్షలు చేశారు. ఆనకట్ట పర్యావరణ ప్రభావాలపై సమీక్ష కమిటీని నియమిస్తామని అప్పటి ప్రధాని పివి నరసింహారావు ఇచ్చిన హామీ మేరకు 1995 లో అతను చేపట్టిన 45 రోజుల పాటు ఉపవాస కార్యక్రమాన్ని నిలిపి వేశారు. తరువాత ప్రధాన మంత్రి హెచ్.డి.దేవేగౌడ పదవీ కాలంలో రాజ్ ఘాట్ లోని గాంధీ సమాధి వద్ద 74 రోజులు ఉపవాస దీక్ష కొనసాగింది. 1987లో రట్ లైవ్‌లీ హుడ్ పురస్కారం (చిప్కో ఉద్యమం), 1986లో నిర్మాణాత్మక పనికి జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 1989లో డాక్టర్ ఆఫ్ సోషల్ సైన్సెస్, గౌరవ డిగ్రీని ఐఐటి రూర్కీ ప్రదానం, 2009లో పర్యావరణ పరిరక్షణకు భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు పొందారు. 1981లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. అయితే ఆయన దానిని తిరస్కరించారు.. 94ఏళ్ళ సుందర్‌లాల్ బహుగుణ కోవిడ్19 తో రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ, 2021 మే 21న శుక్రవారం తుదిశ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# అన్నదాతలూ పారాహుషార్..!

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాకు చెందిన గిరిజన రైతు ధరావత్ రమేష్ 2023 యాసంగి సీజన్‌లో మరో రైతుకు చెందిన 4.20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, వరిపంట సాగుచేశాడు. ఏప్రిల్ మాసంలో రాచర్ల గొల్లపల్లిలోని ఓ డీలర్ వద్ద పురుగు మందు కొనుగోలు చేసి, పంటకు పిచికారీ చేశాడు. 18 రోజుల్లో పురుగు మందు ప్రభావంతో వరిపైరు మొత్తం పొడై, వరి కంకులు వేయలేదు. నష్టపరిహారం ఇప్పిస్తానని నమ్మబలికిన సదరు డీలర్ ఆ తర్వాత చేతులెత్తేశాడని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోలేదు.

జిల్లాలో 187 లైసెన్సు కలిగిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాలున్నాయి. ఇటీవల 15 మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు విత్తనాలు విక్రయించేందుకు కొత్తగా లైసెన్సులు జారీ చేశారు. కాగా జిల్లాలో కొందరు డీలర్లు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను యథేచ్ఛగా చేపడుతున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు. గడిచిన రెండేళ్లలో సుమారు 15 మంది డీలర్లపై కేసులు నమోదు చేశామని అధికారులు చెబుతున్నారు.

**నిబంధనలు పాటిస్తే మేలు**

చాలామంది రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఇటీవల ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. దీనివల్ల కల్తీ జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో పంట దిగుబడిపై వచ్చే పోస్టులను నమ్మవద్దు.




లైసెన్స్ కలిగిన డీలర్లను మాత్రమే సంప్రదించాలి. రసీదులతోపాటు ఖాళీ విత్తన ప్యాకెట్లను భద్రపర్చుకోవాలి.

**డీలర్ల మాయాజాలం**

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో కొంత మంది డీలర్లు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు ఇవ్వడం లేదు. డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పలు చోట్ల స్టాక్ పొజిషన్, ధరల పట్టికను ప్రదర్శించడం లేదు. పత్తి విత్తనాల్లో బీజీ-2(బోల్‌గార్డ్-2) రకాన్ని పండించడం, విక్రయించడం వరకే ప్రభుత్వ అనుమతి ఉంది. కానీ కొన్ని మండలాల్లో అనుమతి లేని బీజీ-3 లేదా హెచ్‌టీ(హెక్సిసైడ్ టాలరెంట్) విత్తనాలు కూడా అంటగడుతున్నట్లు తెలిసింది. మరికొన్ని చోట్ల ఇతర రాష్ట్రాల నుంచి విడి పత్తి విత్తనాలను, నకిలీ విత్తనాలను తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయిస్తూ పట్టుబడిన సంఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయి.

**నిఘా తీవ్రతరం చేస్తాం**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఏవోలు తనిఖీ చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల్లో నాణ్యతాప్రమాణాలపై అనుమానం వస్తే వాటి నమూనాలను పరిశోధన కేంద్రానికి పంపిస్తాం. ఏదైనా తేడా వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే డీలర్ లైసెన్సులను రద్దు చేస్తాం. వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన పురుగు మందులను మాత్రమే కొనుగోలు చేయాలి. అఫ్జల్‌బేగం, జిల్లా వ్యవసాయాధికారి

# ఉపాధికి ఊతం..!

సూర్యాపేట : జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులకు కూలీల చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇకపై అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు గాను అయిదుగురితో కూడిన పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు జిల్లాలో సన్నాహాలు చేపడుతున్నారు. గ్రామాల్లోనే ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జిల్లాకు, అక్కడి నుంచి మండల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ కమిటీలు

గ్రామ స్థాయిలో నిఘా పర్యవేక్షణకు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను రూపొందించనుంది. ఈ కమిటీలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యురాలు, ఉపాధి కూలీ, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఉంటారు. వారం పాటు జరిగిన పనులపై



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. పనుల మంజూరు, కూలీల హాజరు, కూలీ చెల్లింపులు పారదర్శకంగా జరిగాయా లేదా అని పరిశీలించి నివేదికను మండల పరిషత్తు అధికారులకు సమర్పిస్తారు. ఆ తరువాత మండల పరిషత్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తారు. దీంతో పనుల ఎంపిక, పనుల నిర్వహణ, కూలీ చెల్లింపులు మొత్తం ఇక పారదర్శకంగా కొనసాగే అవకాశం ఉంది.

ఎంపికకు సూచనలిచ్చాం.. : అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా చూసేందుకు గ్రామీణ స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలు అందాయి. కమిటీలను గుర్తించి ఎంపిక చేసేలా మండల అధికారులకు సూచనలు జారీ చేశాం. త్వరలో ఏర్పాటు చేసి పనులు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

# చివరి మజిలీకి చిక్కులు




కరీంనగర్ : నగర పరిధిలో పేద, మధ్యతరగతి ప్రజల చివరి మజిలీకి చిక్కులు వచ్చాయి. నగరంలో అమలు చేస్తున్న రూపాయికే అంత్యక్రియల పథకం నిలిచిపోయింది. రెండు రోజులుగా గుత్తేదారు చేతులేత్తయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకం అమలవుతోంది. దహన సంస్కారం చేసేందుకు గుత్తేదారుకు రూ.10 వేల చొప్పున చెల్లిస్తారు. టెండర్ గడువు ముగియగా కొన్ని నెలలపాటు పొడిగించారు. చివరికి బిల్లులు రాలేదనే కారణంతో గుత్తేదారు ఆ పథకం నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. టెండర్ పొడిగించినా సక్రమంగా పని చేయడంలేదని, నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కార్పొరేటర్ల లేఖలు**

నగర పరిధిలోని 60 డివిజన్లలో చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు పాలకవర్గ పదవీకాలంలో ఉన్నప్పుడు కార్పొరేటర్లు లేఖలు అందించారు. ఆ లేఖల ప్రకారం రేషన్‌కార్డు లేకున్నా, డివిజన్‌కు చెందిన వారు కాకున్నా సిఫార్సు చేసేవారు. మొత్తం మీద నెలకు 90 నుంచి 120 వరకు అంత్యక్రియలు చేసే వారు. పదవీకాలం ముగిసిన తర్వాత వార్డు అధికారులు ధ్రువీకరిస్తే తప్ప బల్దియా పథకం అమలు కావడంలేదు. మరో వైపు అంత్యక్రియల పథకం బిల్లులపై విచారణ జరిపించాలని పలువురు మాజీ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని చెబుతున్నారు.

**ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి**

రూపాయికే అంత్యక్రియల పథకం దుర్వినియోగం కాకుండా సిఫార్సు లేఖలు పక్కన బెట్టి నగరవాసులకు మాత్రమే ఈ పథకం వర్తించేలా నిబంధన పొందుపర్చారు. నగరంలో నివసిస్తున్నట్లు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఉన్న వారికి వార్డు అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇలా ఉంటే నిలిచిపోయిన అంత్యక్రియల పథకంపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే.

**టెండర్..రీకాల్**

నగరపాలక అధికారులు రూపాయికే అంత్యక్రియల పథకానికి ఇటీవల టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ సమయంలో ఎవరూ ముందుకు రాలేదు. మళ్లీ రీకాల్ చేసేందుకు చర్యలు చేపట్టారు. రూ.90 లక్షలతో టెండర్ నిర్వహిస్తుండగా ఈసారి వైకుంఠ రథం(వ్యాన్) నిర్వహణతోపాటు డీజిల్, డ్రైవర్‌తోపాటు రూపాయికే అంత్యక్రియలు చేసేలా పొందు పర్చారు. దాంతో వెనక్కి తగ్గుతున్నట్లుగా తెలుస్తోంది.

**వారం రోజుల్లో పూర్తి చేస్తాం**

కాంట్రాక్టు గడువు ముగియకముందే ఇంజినీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. ఎవరు పాల్గొనకపోవడంతో మళ్లీ రీకాల్ చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం.

వేణుమాధవ్, సహాయ కమిషనర్, నగరపాలిక

# ఇసుక లభ్యత.. పూర్తి పారదర్శకత



సిరిసిల్ల: జిల్లాకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కు ఆదాయం సమకూరడంలో ప్రధానమైనది ఇసుక. అనుమతుల జారీలో రెవెన్యూశాఖ లోపాలు.. గనులు భూగర్భశాఖ పర్యవేక్షణలేమి.. అక్రమార్కులకు వరంగా మారింది. ఇటు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్టవేసి.. అనుమతుల్లో పారదర్శకంగా వ్యవహరించేలా 'సాండ్ టాక్స్' విధానం తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇసుక లభ్యత.. ప్రభుత్వానికి సమకూరే ఆదాయం.. సామాన్యులకు కలిసివచ్చే తీరుపై కథనం.

**రూ.63 కోట్ల ఆదాయం**

జిల్లాలోని 13 మండలాలు ఉండగా 12 మండలాల్లో మానేరు, మూలవాగులు ప్రవహిస్తున్నాయి. వీటిలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతోంది. గృహ అవసరాలు, ప్రాజెక్టులకు దీనికి ప్రాధాన్యం ఇస్తారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లను గనులశాఖ గుర్తించింది. వీటిలో వర్షాలకు వరదల ద్వారా ఏటా 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా ఏటా రూ.6.34 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. జిల్లాలో ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపడుతున్న నిర్మాణాలకు వినియోగించిన ఇసుక మొత్తానికి ఎంబీ రికార్డుల్లో వే బిల్లుల రసీదులను నమోదు చేయాలి. అప్పుడే బిల్లులు మంజూరు చేసేలా నిబంధనలు కఠినతరం చేశారు. ప్రస్తుతం వే బిల్లులో ట్రాక్టర్ ఇసుక (మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.450 చెల్లిస్తున్నారు. సాండ్ టాక్స్‌లోనూ ఇదే ధరను నిర్ణయించే అవకాశం ఉంది.

**నిబంధనలు ఇవీ..**

కలెక్టర్ ఛైర్మన్‌గా ఇసుక నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు, మండల రెవెన్యూ అధికారులు కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారు. కలెక్టరేట్‌లో సాండ్‌టాక్స్ నిర్వహణకు రెవెన్యూశాఖకు చెందిన ఇద్దరు నోడల్ అధికారులు ఉంటారు. కాల్‌సెంటర్, ఖాతాలు, ఆన్‌లైన్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తారు. కమిటీ నిర్వహణకు మొదట బ్యాంకుఖాతాను ప్రారంభిస్తారు.

ఇసుక రవాణాను జీవనాధారంగా చేసుకున్న వారు రెవెన్యూశాఖలో ట్రాక్టర్‌కు రూ.10వేలు చెల్లించి సాండ్ ట్యాక్స్ పథకంలో నమోదు చేసుకోవాలి.

నమోదు చేసుకున్న ట్రాక్టర్ ట్రాలీలకు ఎంపికచేసిన రంగుతో ఇసుక నిర్వహణ కమిటీ గుర్తును వేస్తారు. ట్రాక్టర్ యాజమాని ఎప్పుడైనా వ్యవసాయ అవసరాలకు మళ్లించుకోవాలనుకుంటే.. డిపాజిట్ సొమ్మును కమిటీ నుంచి చెల్లిస్తారు.

ఇసుక క్వారీల నుంచి దూరాన్ని బట్టి రవాణా, ఇతర రుసుములను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనుమతి పొందిన 24 గంటల్లో వినియోగదారుడు పేర్కొన్న చిరునామాకు పంపిస్తారు.

అక్రమాలకు తావు లేకుండా

ఇసుక రీచ్‌ల నిర్వహణలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించేందుకు సాండ్‌టాక్స్ విధానం తీసుకురాబోతున్నాం. దీనిలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావులేకుండా పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహణ జరుగుతుంది. ట్రాక్టర్ యజమానులు నమోదు చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

సందీప్ కుమార్ ఝా, కలెక్టర్

# రాములోరి గోశాలకు మహర్దశ!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలో ఉన్న గోశాలకు మహర్దశ పట్టనుంది. రామాలయానికి 3 కి.మీ. దూరంలో గల ఈ గోశాలను పూర్తిస్థాయిలో విస్తరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. 104 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్రాంగణంలో ఇప్పటికే రూ.30లక్షలతో రెండు షెడ్లు నిర్మించగా.. వీటిలో సుమారు 75 ఆవులు, దూడలు ఉంటున్నాయి. ఎండకు, వానకు దెబ్బతినకుండా గోవుల దాణాను భద్రపర్చేందుకు రూ.5 లక్షలతో ఇనుప రేకులతో కంటైనర్ తరహాలో రెండు గదులను ఉపయోగిస్తున్నారు. తాజాగా ప్రవాస భారతీయుల సహకారంతో రూ.40లక్షలతో రెండు షెడ్లను నిర్మించేందుకు ఈఓ రమాదేవి పర్యవేక్షణలో ఈఈ రవీంద్రనాథ్ పనులు ప్రారంభించారు. ఇవి కాకుండా మరో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు.

**భవిష్యత్తు కార్యాచరణ?**

రాములవారికి నిత్యపూజలు, అభిషేకాలకు గోవు పాలు అవసరం. నిత్య అన్నదాన సత్రంలో రోజుకు 2వేల మందికి భోజనాలు వడ్డిస్తుంటారు. మజ్జిగ తప్పనిసరి. ఇందుకోసం పాలను తోడు పెట్టి మజ్జిగను అన్నదానంలో ఉపయోగిస్తున్నారు. రామాలయం వద్ద గోకులంతో పాటు పురుషోత్తపట్నంలోని శ్రీ గోకుల రామం పేరిట గోశాలలు ఉన్నాయి. ఈ రెండుచోట్ల కలిపి సుమారు 80 గోవులను ఉంటున్నప్పటికీ పాలు ఇచ్చేవి పది లోపే. రోజుకు 15 లీటర్ల నుంచి 20 లీటర్ల పాలు లభిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఆలయ అవసరాలకు ఇవి చాలకపోవటంతో వ్యాపారుల నుంచి కొంతమేర కొనక తప్పటం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే వందల సంఖ్యలో గోవులతో గోశాలను విస్తరించాలి. ఇది జరిగితే పవిత్రమైన గోక్షీరం పుష్కలంగా లభిస్తుంది. లీటరు పాలను కూడా బయట కొనకుండా చూడొచ్చు.

**దాతల సహకారంతో..**



గోశాల వద్ద మూడేళ్ల క్రితం రూ.10 లక్షలతో ముఖద్వారం పూర్తయ్యింది. దీన్ని సుందరీకరించాలి. గోశాల రక్షణకు చుట్టూ 2 కి.మీ. పొడవైన ప్రహరీ అవసరమవగా.. రూ.15 లక్షలు వెచ్చించి కొంతమేర నిర్మించారు. దాతల సహకారంతో మరో అర కి.మీ. వరకు రూ.40 లక్షలు వెచ్చించి గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇంకా మిగిలిన గోడ పూర్తి కావాలంటే మరో రూ.కోటి కావాలని అంచనా వేస్తున్నారు.

వర్షాకాలంలో గోశాల ఆవరణలోని చెరువు పొంగిపొర్లి జగదీశ్ కాలనీ లోతట్టు ఇళ్లను వరద నీరు ముంచెత్తుతుంది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున చెరువులో నీటి నిల్వను నియంత్రించేందుకు తగిన పనులు చేపట్టనున్నారు. నక్షత్ర వనం, రాశీ వనాల పేరిట పూదోటలను ఏర్పాటు చేయాలని యోచిస్తు న్నారు. దీన్ని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా మార్చాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు కాకుండా దాతల సహకారంతో మరో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని ఆలయాధికారులు చెబుతున్నారు.

# పడకేసిన పల్లె పాలన

జగిత్యాల : పల్లెలపై అధికారుల పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుద్ధ్యం గాడితప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో జాప్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాక పంచాయతీలలో నిధులు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడాదికిపైగా ప్రభుత్వం నుంచి నిధులు రాక జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి కానరావటంలేదు. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు మెండుగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పల్లెలకు ప్రత్యేకాధికారులు వెళ్లకపోవటంతో పారిశుద్ధ్యం లోపించింది. పారిశుద్ధ్య కార్మికులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి



వేతనాలు కూడా రావటంలేదు. వేతనాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏప్రిల్ నెలలోనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులైన తమ సమస్యలు పట్టించుకుంటారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**విధుల్లో చేరని జిల్లా పంచాయతీ అధికారి**

పల్లె పాలనను పట్టించుకోవటంలేదనటానికి మరో నిదర్శనం జిల్లా పంచాయతీ అధికారి లేకపోవటం. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బదిలీ అయిన తర్వాత డీఆర్‌డీవో ఏపీడీ మదన్‌మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రెండు విధులు నిర్వహించటం ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. రెండోసారి సైతం విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చేరకపోవటంతో పూర్తి బాధ్యతలు లేక పాలన పూర్తిగా కుంటుపడింది.

# చిల్లర సమస్యలు ఉండవిక..!

వలిగొండ : ఆర్టీసీ ప్రయాణికులకు బస్సులో చిల్లర సమస్య అధికంగా ఉంది. టికెట్‌కు సరిపడ డబ్బులు ఇవ్వాలని కండక్టర్లు అడుగుతున్నా చిల్లర లేక నోట్లు ఇస్తుంటారు. దీంతో అటు ప్రయాణికులు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి మధ్య వాగ్వాదాలకు దారి తీస్తోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టెందుకు ఆర్టీసీ డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తీసుకురానుంది. బస్సులో ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యూ (ఈ-టిమ్)ను ప్రవేశపెడుతోంది. ఫోన్-పే, గూగుల్ పే, స్వైపింగ్ ద్వారా టికెట్ తీసుకునే సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో డిజిటల్ చెల్లింపులు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కూడా ఈ విధానంపై కొన్ని నెలలుగా కసరత్తులు మొదలు పెట్టింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ చెల్లింపులు అమల్లోకి తీసుకురాగా ఇది విజయవంతమైంది. అన్నీ చోట్ల ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, టికెట్ బుకింగ్ ఏజెన్సీల వద్ద ప్రవేశపెట్టనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట డిపోకు 70 ఈ-టీమ్ మిషన్లు రావడంతో కండక్టర్లకు త్వరలో శిక్షణ తీసుకోనున్నారు.

త్వరలో అందుబాటులోకి సేవలు:మురళీకృష్ణ, డిపో మేనేజర్, యాదగిరిగుట్టయాదగిరిగుట్ట డిపోకు ఈ-టిమ్స్ మిషన్లు 70 వచ్చాయి, మరికొన్ని రావాల్సి ఉంది. యంత్రాల పని తీరు పరిశీలించి కండక్టర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

# చెరువుల వద్ద.. చేపల కొలనులు

చేగుంట : ప్రతి గ్రామంలో కొలనులు ఏర్పాటు చేసి చేపల పెంపకానికి చేయూత నివ్వాలని కేంద్రం ప్రభుత్వం సంకల్పించింది. ఉపాధి పథకంలో ప్రతి గ్రామంలో చెరువు శిఖంలో వీటి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించగా, కొన్ని చోట్ల పనులు మొదలయ్యాయి. దీనివల్ల కూలీలకు పనులు, శిఖం భూముల పరిరక్షణ, మత్స్యకారులకు మరింత ఆదాయం సమకూరాలన్నదే లక్ష్యం. జిల్లాకు ప్రస్తుతం 85 చేపల కొలనులు మంజూరుకాగా, 59 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి, చేగుంట, నార్సింగి, హవేలిఘనపూర్, కొల్చారం, పాపన్నపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, మెదక్, నర్సాపూర్ మండలాల్లో కొనసాగుతున్నాయి. నార్సింగి మండలంలో నార్సింగి, సంకాపూర్, భీంరావుపల్లి, నర్సంపల్లిలో నిర్మాణాలను ముమ్మరం చేశారు. ఒక్కో కొలనుకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

అత్యధిక పనిదినాలు కల్పించేలా..: ఆర్థిక సంవత్సరం 2025-26లో ఉపాధి పథకంలో కొత్తగా మరిన్ని పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ పనులను పరిశీలించి చేపల కొలనులు ఏర్పాటు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో గ్రామంలో 3,300 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో కొలను 14 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. ఎంపిక చేసిన చెరువు శిఖంలో నాలుగు కొలనులు నిర్మిస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాటిలో నీరు నిల్వ ఉండటంవల్ల చేపలు పెంచుకునేందుకు దోహదపడుతుంది. శిఖం భూముల పరిరక్షణకు: ప్రస్తుతం మత్స్యశాఖ రాయితీతో చేప పిల్లలను నీటి వనరుల్లో పెంచుతున్నారు. వీటికి వంద నుంచి మూడు వందల మీటర్ల దూరంలో కొలనులు నిర్మిస్తున్నారు. కూలీలకు ఉపాధి, చెరువుల శిఖం భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా పనుల రూపకల్పన చేశారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక, రాయితీ చేపపిల్లలను కూడా వీటిలో వదిలేలా ఏర్పాటు చేస్తున్నారు. **ఎన్ని ప్రతిపాదనలు వచ్చినా అనుమతి : శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో** గ్రామాల నుంచి చేపల కొలనుల నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా మొదటగా కొన్నింటికి ప్రతిపాదనలు రావడంతో పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం వరకు పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టి మత్స్యసంపదను పెంపొందించాలన్నది లక్ష్యం. శిఖం భూములను రక్షించేందుకు కూడా ఇది దోహదపడుతుంది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రతిపాదనలు పంపించాలి.

చురకలు



## భూ భారతి.. నిరీక్షణ తప్పనిసరి

హైదరాబాద్: భూముల క్రయవిక్రయాలు, పట్టాదార్ పాస్‌పుస్తకాల జారీ, మ్యుటేషన్ వంటి పనుల కోసం భూ భారతి పోర్టల్‌లో దరఖాస్తులు చేసిన రైతులు, ప్రజలు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనే పరిష్కారమయ్యే అంశాలుండడంతో వారి పరిశీలనలో ఉంటున్నాయి. వీరిద్దరిలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వద్ద వందల సంఖ్యలో పెండింగ్ ఫైళ్లు పేరుకుపోతున్నాయి. 9 నెలల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేకపోవడంతో ప్రతిమాసింగ్‌కే బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె రెవెన్యూ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వ్యవహారాలను పర్యవేక్షించలేకపోతున్నారు. అప్పటికీ ప్రాధాన్యక్రమంలో ఫైళ్లను పరిష్కరిస్తున్నా పెండింగ్ ఫైళ్లు వందల్లో ఉన్నాయి.

**సాంకేతిక అంశాలు.. రోజుల తరబడి..**




రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాల్లో భూములుండడం, ఐదారేళ్లుగా అవి సర్కార్ ప్రాంతాలుగా రూపుదిద్దుకోవడం, విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు వస్తుండడంతో భూముల రేట్లు రూ.కోట్లకు చేరుకున్నాయి. రైతులు, వ్యవసాయ భూములు కలిగిన వారు వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. డేటాలో మార్పులు, చేర్పులకూ, కొన్ని సాంకేతిక అంశాల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. సాంకేతిక అంశాలను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించేందుకు వీలున్నా.. రోజుల తరబడి ఆలస్యమవుతోంది. ఈ దరఖాస్తులన్నింటిపైనా అదనపు కలెక్టర్, కలెక్టర్‌లదే నిర్ణయాధికారం. ప్రాథమిక స్థాయిలో తహసీల్దార్లు, ఆర్డీవోలు పరిష్కరించి పంపుతున్నా అదనపు కలెక్టర్ వద్ద అవి ఆగిపోతున్నాయి. దరఖాస్తుదారులు స్వయంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను అభ్యర్థించేందుకు వెళ్తుండగా.. కార్యాలయం అధికారులు తిప్పిపంపుతున్నారు.

## తగ్గాల్సిందే జోరు..!



హైదరాబాద్ : ద్విచక్రవాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్ పోలీసులకు చిక్కినప్పుడు అధిక శాతం మంది చెప్పే సమాధానాలు ఇవి. జరిమానా విధిస్తున్నా, జైలుశిక్ష పడుతున్నా అదే తీరు. తమ డ్రైవింగ్ అనుభవంతో ప్రమాదాలు అధిగమిస్తామనే అతివిశ్వాసం. ఒకవేళ పట్టుకున్నా చలానాతో బయటపడొచ్చనే భావన.. నగర వాహనదారుల్లో ఎక్కువగా కనిపిస్తోందని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు.

**అడ్డుకట్టవేసేందుకు..**

నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలు, జైలుశిక్షతోపాటు కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. రహదారి ప్రమాదాల వీడియోలు, ప్రమాదం బారిన వైకల్యం సంభవించినా, మరణించినా కుటుంబ పరిస్థితులు ఎలా ఉంటాయనేది వివరిస్తూ మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**కాపాడిన శిరస్త్రాణం**

ఓ మహిళా కానిస్టేబుల్ బైక్‌పై వెళ్తుండగా అపసవ్య దిశలో వచ్చిన యువకుడు ఢీకొట్టడంతో ఆమె కిందపడ్డారు. కాలికి తీవ్రగాయమైంది. శిరస్త్రాణం ధరించటంతో ప్రాణాపాయం తప్పింది. ః బేగంపేట ప్రధాన మార్గంలో బైక్‌పై వెళ్తున్న యువకుడిని అపసవ్య దిశలో వచ్చిన ఆటో ఢీకొట్టింది. తలకు శిరస్త్రాణం ఉండటంతో స్వల్పగాయాలతో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

**ప్రమాదాలకు ప్రధాన కారణాలు**

శిరస్త్రాణం ధరించకుండా వాహనం నడపటం ః యూటర్న్ దూరమని అపసవ్యదిశలో ప్రయాణం

నిబంధనల ఉల్లంఘనుల్లో 18-35 మధ్య వయస్కులే ఎక్కువున్నారని వీరిలో అధికశాతం డెలివరీ బాయ్స్ ఉంటున్నట్టు గుర్తించారు. రహదారి ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో 80 శాతం ద్విచక్ర వాహనదారులే.

**అపోహలు వద్దు**

కట్టా హరిప్రసాద్, ఏసీపీ, పంజాగుట్ట ట్రాఫిక్

జుట్టురాలుతుందని, తలనొప్పి వస్తుందనే అపోహలతో చాలామంది హెల్మెట్ ధరించడం లేదు. మద్యం తాగి వాహనం నడిపితే నియంత్రణ కోల్పోతారు. ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయలేరు. ఈ విషయాలు తెలుసుకోవాలి. కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్‌తో చాలామంది మారుతున్నారు.

ఇదీ లెక్క (4 నెలల కాలంలో)

రోడ్డు ప్రమాదాలు 820

మైనర్ డ్రైవింగ్ వల్ల మృతులు 10

క్షత గాత్రులు 750

శిరస్త్రాణం ధరించక మరణించింది 22

గుర్తించిన రాంగ్ డ్రైవింగ్ ప్రాంతాలు 50

ఈ ఏడాది ఇప్పటి వరకు ఉల్లంఘన కేసులు ఇలా

మైనర్ డ్రైవింగ్ 1904

శిరస్త్రాణం 9,99,835

రాంగ్‌రూట్ 1,86,312

ట్రిపుల్ రైడింగ్ 47,053

నంబర్‌ప్లేట్ 25,631

సెల్‌ఫోన్ 24, 312

డ్రంకెన్‌డ్రైవ్ 18,100

## పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్: జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి. ఆస్తిపన్ను మదింపునగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. వీటన్నింటికి ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటిసులు వచ్చే అవకాశముంది.

అదనపు కట్టడాలకు నోటీసులు

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ



అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు చేపడుతున్నారు. ప్రధానంగా అదనంగా అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న పన్ను**

భువన్ యాప్‌తోపాటు అదనపు నిర్మాణాలకు కొలతలు ఇష్టానుసారంగా చేస్తుండటంతో అడ్డగోలుగా పన్నుల భారం పడుతుంది. దాంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరికి అయితే ఎలాంటి కొలతలు చేపట్టకుండానే రివైజ్డ్ ఆస్తిపన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఓ దశలో నల్లా కనెక్షన్ కూడా తొలగించారు. వీటిపై అభ్యంతరాలు పరిష్కరించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా దాటేశారని మండి పడ్డారు. ప్రస్తుతం ఆస్తిపన్ను అధికంగా వస్తుందనే ఫిర్యాదుల మేరకు తిరిగి కొలతలు చేపట్టి ఆస్తిపన్ను రాబట్టుకోవాలని నిర్ణయించారు.

## పచ్చదనం.. ఫలసాయం

సారంగాపూర్: గ్రామస్తులు ఐక్యతతో పండ్లతోటల పెంపకం చేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. సారంగాపూర్, పెంబట్ల, లక్ష్మీదేవిపల్లె గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మొక్కల పెంపకంతో పచ్చదనంతోపాటు ఫలసాయం అందడంతో లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కేవలం లక్ష్యం కోసం కాకుండా ఫలసాయం అందించే మొక్కలు నాటితే ప్రజలకు ప్రయోజనకరంగా ఉండడమే కాకుండా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరనుంది. పంచాయతీ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు నాటేలా దృష్టి సారించినప్పుడే పల్లెలు పచ్చదనం సంతరించుకుంటాయి.

**వనసంరక్షణ ఆధ్వర్యంలో చింత నర్సరీ**

సారంగాపూర్ వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో దాదాపు 15 ఏళ్ల కిందట అటవీ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 20 ఎకరాల్లో చింత నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరగడమే కాకుండా పచ్చదనం, కాతకు వచ్చాయి. అయిదేళ్ల కిందట ఉపాధి హామీ పథకం ద్వారా సారంగాపూర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ నుంచి



భీమన్న గుట్ట వరకు రహదారికి ఇరువైపులా మామిడి మొక్కలు నాటారు. ఇందుకు ప్రత్యేకంగా నర్సరీ నుంచి దాదాపు 200 మొక్కలను ఒక్కో మొక్కకు రూ.250 వెచ్చించి తీసుకొచ్చి నాటారు. ప్రత్యేక దృష్టి సారించి సేంద్రియ ఎరువులు, నీటిని అందించడంతో ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. ఈ ఏడాది చెట్లు కాతకు రాగా, మరో ఏడాది పంచాయతీకి ఆదాయం సమకూరనుంది.

**కుల సంఘాలకు ఆదాయం**

మండలంలోని లక్ష్మీదేవిపల్లె, పెంబట్ల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి ఉండగా ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పదేళ్ల కిందట ముదిరాజ్ సంఘ సభ్యులు మామిడి మొక్కల పెంపకం చేపట్టారు. దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో మామిడి మొక్కలు నాటడంతో మూడునాలుగేళ్లుగా కాత కాస్తుంది. రెండేళ్లుగా సంఘ సభ్యులు మామిడి తోటను ఏడాదికి రూ. 1.35 లక్షలకు లీజుకు తీసుకొని సంఘానికి అందిస్తున్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లెలో మ్యాదారం గిరిజనులు శీత్లాభవాని ఆలయం నిర్మించుకొని దానిపక్కనే దాదాపు రెండెకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటారు.

**సభ్యులకు ఉపాధికుల** వృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా పదేళ్ల కిందట మామిడి మొక్కల పెంపకం చేపట్టేందుకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. సంఘం ద్వారా మొక్కలను నాటి సంరక్షణ చేపట్టడంతో రెండు మూడేళ్లుగా కాతకు రావడంతో సంఘానికి ఆదాయం సమకూరుతోం ది. వచ్చిన ఆదాయం సామాజిక అవసరాలకు వినియోగించుకోవడంతో ఆర్థిక భారం తగ్గడమే కాకుండా కుల సంఘ సభ్యులకు ఉపాధి లభిస్తోంది.

పిట్టల నర్సయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు, పెంబట్ల

## సెలవుల్లో సాగు బడికెళ్దామా



హైదరాబాద్: క్షణం తీరిక దొరికితే చాలు చరవాణి తెరను తడిమేస్తుంటారు. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ రీల్స్, స్నాప్, ఎక్కువ లైక్స్ అంటూ అదో లోకంలో తేలిపోతుంటారు. దీంతో వారి విలువైన బాల్యం స్మార్ట్‌ఫోన్‌లో బంధీ అవుతోంది. స్నేహితులతో కలిసి సరదాగా గడపడం, ప్రకృతిలో మమేకమై ఆటలాడటాన్ని మరిచిపోతున్నారు. ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని పెంచే వేసవి శిక్షణ శిబిరాలు ఉంటే పంపాలని తల్లిదండ్రులు చూస్తున్నారు. ఈ ఆలోచనతోనే నగర శివార్లలో వ్యవసాయ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. పంట పొలాలు, పండ్ల మొక్కల, హైడ్రోఫోనిక్స్ వంటి మెలకువలు నేర్పడంతో పాటు అనేక కార్యశాలల ద్వారా వారిలో జిజ్ఞాసను పెంపొందిస్తుండటంతో వేలాది మంది విద్యార్థులు వీటిల్లో చేరుతున్నారు.

**అసలేం నేర్పిస్తున్నారు...**

ఏడు నుంచి 17 ఏళ్ల పిల్లలను ఈ వ్యవసాయ పాఠశాలల్లో చేర్చుకొని రోజు నుంచి ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నారు. చేవెళ్లలోని కౌకుంట్ల, కేసారం, బాకారం జాగీర్ తదితర ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి. సీబీఎస్ఈ సిలబస్ పాఠ్యాంశాల ఆధారంగా విద్యార్థులకు వాస్తవిక విజ్ఞానం అందించే ప్రయత్నం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఒకరోజు కార్యశాల అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, ఐదు రోజుల కార్యశాల అయితే బస, భోజనం వంటి సదుపాయాలు కల్పించి నిపుణులతో విజ్ఞానం పంచుతున్నారు. పప్పులు, ధాన్యాలు, కూరగాయలు, పండ్ల పెంపకంలో చిన్నారులను భాగస్వామ్యం చేస్తున్నారు. కుప్పనూర్చడం, సేంద్రియ ఎరువుల తయారీ, పశువులకు మేత వేయడం చేయిస్తుండటంతో విద్యార్థులు సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. దీంతో పాటు వ్యవసాయ క్షేత్రం మొత్తం తిరిగేలా ఫార్మ్‌ట్రైన్ వంటివి ఏర్పాటు చేస్తుండటంతో సమయాన్ని ఆహ్లాదంగా గడిపేస్తున్నారు.

**జీవన నైపుణ్యాలను అందిస్తున్నాం**

వంశీ, వ్యవసాయ పాఠశాల నిర్వాహకుడు

కార్యశాలల్లో భాగంగా జీవన నైపుణ్యాలను అందిస్తున్నాం. ఉదయాన్నే నిద్రలేవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఉద్వేగ స్థిరత్వం పెంపొందించుకొనేలా శిక్షణ ఇస్తాం. తల్లిదండ్రులు వాటిని కొనసాగించాలి. ప్రకృతితో మమేకం, ఇంద్రియ అభివృద్ధి, బృందంతో కలిసి పనిచేయడం వంటివి ఇందులో ఉన్నాయి. వైఫల్యాలు ఎదురైనా తిరిగి పుంజుకోవాలనే అంశాలపై శిక్షణ అందిస్తున్నాం.

## చల్లనివన్నీ.. మంచివి కాదండోయ్..!

నీలగిరి : ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేం దుకు చల్లటి పానీయాలు తీసుకుంటే బాగుంటుందని అందరూ భావిస్తుంటారు. అయితే చల్లనివన్నీ మంచి పానీయాలా కాదా అని ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరు తాగాల్సిన అవసరం ఉంది. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు జ్యూస్ లు, ఐస్‌క్రీంలు, ఇతర పానీయాలు తీసుకుంటారు. వినియోగదారులను ఆకర్షించేందుకు నిర్వాహకులు వీటిలో రంగులు, ఇతర పదార్థాలను కలుపుతారు. వీటి వల్ల అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు.

**కల్తీకి అవకాశం ఉన్న పదార్థాలు**

జ్యూస్‌లు, మజ్జిగ, ఐస్‌క్రీంలు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు కల్తీ జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. రంగులు, రుచి కోసం పలు రకాల రసాయనాలను వీటిలో కలుపుతారు. ఫుట్‌పాత్‌లపై తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఓ సారి ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు తయారు చేసేందుకు కలుషిత నీరు, పాలు..పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైడ్‌లను వినియోగిస్తారు.

**కల్తీపై నిరంతర నిఘా**

–జ్యోతిర్మయి, జోనల్ అధికారి ఆహార కల్తీ నిరోధక శాఖ ఉమ్మడి నల్గొండ

జిల్లా ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టాం. ఉమ్మడి జిల్లాలో సంచార తనిఖీ వాహనం తిప్పుతున్నాం. వినియోగదారులు ఫిర్యాదులు చేసిన చోట, అనుమానం ఉన్న ఫుడ్ తయారీ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

2024-25 నల్గొండ జిల్లాలో మొత్తం 42 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల అనారోగ్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. 33 చోట్ల నాణ్యత పాటించడంలేదని తేలింది. వీరికి రూ. 3.47లక్షలు జరిమానా విధించారు.

వేసవిలో తీసుకోవాల్సిన పదార్థాలు

–కల్యాణి, డైటీషియన్


వేసవిలో ఆరోగ్యం కోసం తాజా పండ్లు, అధిక నీటిని అందించే కూరగాయలు తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగుతూ ఉండాలి. నీరు అధికంగా ఉండే సొరకాయ, బీరకాయ, దోసకాయ, టమాట, కీరదోస మొదలైనవి తీసుకోవాలి. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం పొందుతుంది. ఫ్రైలు, అధిక కొవ్వు పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. షుగర్ వ్యాధిగ్రస్థులు పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.

## రాతపుస్తకం.. బాలలకు ఉపయుక్తం

కరీంనగర్ : సర్కారు పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులకు అనేక ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తోంది. మెరుగైన విద్యాబోధనతోపాటు పాఠశాలల్లో వారికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను సమకూరుస్తోంది. అన్ని వసతులను ఉచితంగా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యాసంవత్సరంలో సర్కారు బడులను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలు తీసుకొస్తోంది. గతంలో లేని విధంగా నూతన విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1-5 తరగతులు చదువుతున్న బాలలకు రాత పుస్తకాలను ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలను ఇప్పటికే బడుల్లో సమకూరుస్తున్న ప్రభుత్వం తాజాగా రాత పుస్తకాల పంపిణీకి సిద్ధమైంది.

**13,910 మందికి ప్రయోజనం**

వచ్చే నెలలో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బడుల ప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలను అందించేందుకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. దీనికితోడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 1-5 తరగతుల బాలలకు కూడా బడుల ప్రారంభం రోజునే రాత పుస్తకాలను అందించేందుకు సిద్ధంగా ఉంది. జిల్లాలో 1-5 తరగతులు చదువుతున్న బాలలు 13,910 మంది ఉన్నారు. రెండేళ్లుగా 6-10వ తరగతి విద్యార్థులకు రాతపుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. నూతన విద్యాసంవత్సరంలో 1,



2 తరగతుల వారికి మూడు, 3-5 తరగతుల బాలలకు నాలుగు చొప్పున రాత పుస్తకాలను అందించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వాటిని పెంచేందుకు విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగే ఆస్కారం ఉందని ఎస్జీటీ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో 1-5 తరగతుల బాలలకు కృత్రిమమేధ(ఏఐ) బోధనను ప్రయోగాత్మకంగా చేపట్టారు. నూతన విద్యాసంవత్సరంలో జిల్లాలోని మరిన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేస్తుండటం కూడా ప్రవేశాల పెంపునకు దోహదపడే అవకాశముంది.

## గురుకులం.. పక్కా పర్యవేక్షణే బలం

సంగారెడ్డి : గురుకులాలు.. ఒకప్పుడు సీటు లభించాలంటే ప్రవేశ పరీక్షకు కష్టపడి చదవాలి. ఇక్కడ సీటు దక్కింతే తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లిదండ్రులు సంబర పడేవారు. రానురాను గురుకులాల్లో నాణ్యత తగ్గుతోంది. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు.. భోజనం నాణ్యంగా లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు వీటిలో చదివేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలు తీసుకుంటాయి. ఫలితాలు వచ్చిన తరువాత పిల్లలు చేరకపోవడంతో సెప్టెంబరు వరకు సైతం ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. **అద్దె భవనాల్లో ఇరుకుగా..** ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాల్లో బీసీ, మైనార్టీ గురుకులాలు 56 ఉన్నాయి. వీటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తరగతి గదిలోనే ఉదయం పాఠాలు వినడం.. రాత్రిపూట అదే గదిలో పడుకోవడం చేయాల్సి వస్తోంది. సొంత భవనాలు నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కావడంలేదు. కొద్దిపాటి శౌచాలయలు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. విద్యార్థులు అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నారు. వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఆటపాటల ప్రోత్సాహం తక్కువే** సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ గురుకులాల్లో గతంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించే వారు. విద్యాభ్యాసంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఆటలు.. సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేవారు. 5వ తరగతి నుంచే క్రీడలు నేర్పించేవారు. ఇక్కడ చదివిన పిల్లలు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రత్యేకంగా కౌన్సెలర్లతో సైకాలజీ తరగతులు నిర్వహించేవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే వారు.. మార్కులు తదితర కారణాలతో అఘాయిత్యాలు చేసుకోకుండా మానసిక స్థైర్యం కల్పించే వారు. వేసవి శిబిరాలు అన్ని జిల్లాల్లో నెల రోజుల పాటు ఉండేది. మూడేళ్ల నుంచి అరకొరగా చేపడుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు వచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు చెప్పించేవారు.

చురకలు



# లెక్కలో తేడాలో..
# పొంతనలేని ఖర్చులు

పెద్దపల్లి : జిల్లాలోని స్థానిక సంస్థలు, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయాల్లో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు తేలింది. నిధుల ఖర్చులో వ్యత్యాసం కనిపిస్తోంది. అవసరమైన ఆధార పత్రాలు లేకుండానే ఖర్చు చేసినట్లు స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా ఆడిట్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో పాలకుల లోపాలు బహిర్గతమయ్యాయి. నిధుల ఖర్చులో అభ్యంతరాలపై నోటీసులు జారీ చేయనున్నారు. నిర్ణీత గడువులోపు ఆధారపత్రాలు సమర్పించకుంటే రికవరీ జారీ చేస్తారు.

**జిల్లా పరిషత్తులో అత్యధికం**

జిల్లా, మండల పరిషత్తులు, గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఇతర అభివృద్ధి నిధులు పక్కదారి పట్టకుండా ప్రతీపైసా లెక్కిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులపై ఆడిట్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో దస్త్రాలను పరిశీలించారు. మంజూరు చేసిన నిధులు, ఖర్చుల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. జిల్లాలో స్థానిక సంస్థలు, దేవాలయాలు, మార్కెట్ కమిటీల్లో మొత్తం 3,431 అభ్యంతరాలకు రూ.62,87,42,110 వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. అత్యధికంగా జిల్లా పరిషత్తులో



11 అభ్యంతరాలకు రూ.55.90 కోట్లు వ్యత్యాసం ఉంది. గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా అభ్యంతరాలు 3,021 వచ్చాయి.

**నోటీసులు జారీ**

అభివృద్ధి పనులకు సంబంధించి నోటీసులు జారీ చేసేందుకు ఆడిట్ శాఖ సిద్ధమవుతోంది. నాలుగు నెలల్లోపు ఆయా నోటీసులకు సరైన ఆధారాలతో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ సమాధానం ఇవ్వకుంటే మరోసారి నోటీసులిస్తారు. తర్వాత ప్రత్యేకంగా నోటీసులు ఇచ్చి తనిఖీలు చేస్తారు. తనిఖీల్లో అనుమానం ఉంటే మరోసారి కూడా వెళ్లి పరిశీలిస్తారు. వీటిన్నంటికి స్పందించకుంటే చివరిసారిగా రికవరీ నోటీసులు ఇస్తారు.

**రికార్డుల నిర్వహణ అధ్వానం**

నిధుల ఖర్చులో పొంతన లేదు. మంజూరైన నిధులకు జీఎస్టీ, ఇతర పన్నులు తిరిగి చెల్లించడం లేదు. పంచాయతీల్లో నిధులకు సంబంధించి నగదు పుస్తకం, ఆన్‌లైన్ నమోదులో తేడా ఉంది. గతేడాదిలో పన్నుల రూపంలో వచ్చిన నిధులను రాబట్టుకోవడం లేదు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఆడిట్ శాఖకు చూపకపోవడం వంటి లోపాలున్నాయి.

# చెత్త బండి.. మరమ్మతులో ఉంది!

జగిత్యాల : జిల్లాలోని 5 పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు, బ్లేడ్‌ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తడంతో వాటిని వెంటనే పరిష్కరించేందుకు బల్దియాలు శ్రద్ధ వహించడంలేదు. ఫలితంగా పట్టణాల్లోని అత్యధిక వార్డుల్లో చెత్త సేకరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నిత్యం ఏదో ఒక వార్డులో చెత్త సేకరణ వాహనాలు రాక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో 25 వాహనాలు



మరమ్మతులోనే ఉండటం గమనార్హం. నిబంధనల మేరకు వాహనాల నిర్వహణకు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిత్యం వాహనాలపై పర్యవేక్షణ ఉండాలి. మరమ్మతులను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాల్సి ఉంటుంది. కానీ పురపాలికలు ఇవి అమలు చేయడం లేదు. ఆటోలు మరమ్మతుకు గురైతే రూ.లక్షల్లో బిల్లులు చూపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. మెట్‌పల్లి పురపాలికలో రూ.14 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం. వాహనం కొనుగోలు చేసిన కొన్నాళ్లకే మూలన పడింది. మరమ్మతుకు నోచుకోక ఇలా పక్కనబెట్టారు.

జగిత్యాల పురపాలికలో రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం రెండేళ్లుగా మూలన పడేశారు. మరమ్మతు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

**ఏటా రూ.25 లక్షలు**

జిల్లా కేంద్రమైన జగిత్యాలలో ఏటా చెత్త సేకరణ వాహనాల పేరిట రూ.25 లక్షలు వ్యయం చేస్తున్నారు. అయినప్పటికీ వాహనాల కొరత తీవ్రంగా ఉంది. బల్దియాలో 47 ఆటోలు, 12 ట్రాక్టర్లు, 1 జేసీబీ, 2 టిప్పర్లు, 1 బ్లేడ్ ట్రాక్టరు, 1 స్వీపింగ్‌యంత్రం ఉన్నాయి. ప్రస్తుతం 11 ఆటోలు మరమ్మతులో ఉన్నాయి. ఏడాది కిందట కొనుగోలు చేసిన 5 వాహనాలు సైతం మరమ్మతు దశకు చేరడం నిర్వహణ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. తరచూ మరమ్మతుల సాకుచూపి రూ.వేలల్లో ఖర్చయ్యే వాహనాలకు సైతం అడ్డగోలు బిల్లులు చూపి అక్రమాలకు తెరలేపుతున్నారు. జగిత్యాలలో 67 వాహనాలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా వీటిలో 11 ఆటోలు మరమ్మతులో ఉన్నాయి. మెట్‌పల్లిలో చెత్త సేకరణకు 36 వాహనాలున్నాయి. వీటిలో 4 ఆటోలు, 2 టిప్పర్లు పనిచేయడంలేదు. రాయికల్ పురపాలికలో 7 చెత్త సేకరణ వాహనాలుండగా ఒకటి మరమ్మతుకు గురైంది. కోరుట్ల పట్టణంలో 45 వాహనాలకుగాను 5 వాహనాలు మరమ్మతులో ఉన్నాయి. ఉన్న ఒక్క స్వీపింగ్‌యంత్రం పనిచేయడంలేదు. ధర్మపురిలో 7 వాహనాలుండగా ఒకటి పనిచేయడంలేదు.

# లక్ష్యం వైపు వడివడిగా అడుగులు



పెద్దపల్లి: ప్రభుత్వం సీఎంఆర్(కస్టమ్ రైస్ మిల్లింగ్) కింద ఇచ్చే లెవీ కోటాను పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి జాప్యం చేసే మిల్లర్లు గడిచిన వానాకాలం కోటాను ఇవ్వడానికి మాత్రం పోటీ పడుతున్నారు. ప్రారంభించిన మూడు నెలల వ్యవధిలోనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే 62 శాతం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంతో పౌర సరఫరాల విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బియ్యం సేకరణ చేపట్టడంతో అందివచ్చిన అవకాశాన్ని మిల్లర్లు వినియోగించుకుంటున్నారు.

**వారికి అవసరం.. వీరికి అవకాశం**

గత వానాకాలంలో సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లించింది. ఈ మేరకు సేకరించిన ధాన్యంతోనే సన్న బియ్యం పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో రెండు నెలలుగా లెవీ సేకరణపై దృష్టి సారించింది. సన్న ధాన్యం తీసుకున్న మిల్లర్లు నిర్దేశిత సమయంలో సీఎంఆర్ కోటాను పూర్తి చేయడానికి లక్ష్యాన్ని నిర్దేశించడంతో పాటు ఎప్పటికప్పుడు మిల్లుల్లో నిల్వలపై తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రభుత్వానికి సన్న బియ్యం అత్యంత అవసరమైనందున నాణ్యతా ప్రమాణాలపై పౌర సరఫరాల అధికారులు కాస్త ఉదాసీనంగా ఉంటారన్న భావనతో కోటాను త్వరితగతిన పూర్తి చేయడానికే మిల్లర్లు మొగ్గు చూపుతున్నారు.

**మొదటిసారి బ్యాంకు గ్యారంటీ విధానం**

2018 సీజన్‌కు సంబంధించిన కోటాను ఇప్పటికీ కొందరు మిల్లర్లు పూర్తి చేయలేదు. వీరికి జూన్ 6 వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. నిబంధనల మేరకు ప్రతి సీజన్‌కు సంబంధించిన లెవీ కోటాను మరుసటి సీజన్ ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలి. ఇందుకోసం అధికారులు సమీక్షలు నిర్వహిస్తూనే మిల్లర్లకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. 2022-23 యాసంగిలో మిల్లర్లకు ప్రభుత్వం 3,53,764 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించింది. బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో మిల్లర్ల వద్ద మిగిలిపోయిన 2.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం వేలం నిర్వహించారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఈ ఏడాది మొదటిసారి బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయిస్తోంది.

**నాణ్యతపై దృష్టి సారించాల్సిన తరుణమిదే**


బియ్యపు గింజ పరిమాణంతోపాటు రంగు, నూక శాతం తదితర అంశాలపై ఎఫ్‌సీఐ కఠినంగా వ్యవహరిస్తోంది. నాణ్యతలో ఏమాత్రం తేడాలున్నా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పౌర సరఫరాల శాఖ మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం మిల్లర్లకు కలసివస్తోంది. ప్రస్తుతం సేకరిస్తున్న బియ్యం మొత్తం రేషన్ దుకాణాలకే చేరుతుండటం లెవీ ప్రక్రియ వేగవంతమయ్యేందుకు దోహదపడుతుంది. ఈ పరిస్థితుల్లో రేషన్ దుకాణాల్లోని బియ్యంలో నూక శాతం పెరగకుండా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖదే.

# గనుల్లో అక్రమాలకు చెక్



సిరిసిల్ల: ప్రభుత్వం గనుల లీజు బకాయిల చెల్లింపులకు ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) విధానం తీసుకొచ్చింది. ఇటీవల ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే మార్గాలపై అధికారులు దృష్టిసారించారు. అందులో గనులశాఖలో ఏళ్ల తరబడి సీనరేజీ రూపంలో రావాల్సిన ఆదాయంపై అధ్యయనం చేశారు. ఉమ్మడి జిల్లాలో నిబంధలకు విరుద్ధంగా గ్రానైట్, బిల్డింగ్ స్టోన్, రోడ్‌మెటల్ తవ్వకాలు జరుపుతున్న 91 గనులను ఇదివరకే గుర్తించారు. వీటిపై ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వేసైతం చేపట్టారు. ఆక్రమాలు జరిగిన క్వారీలను గుర్తించి జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు. మరికొన్నింటిని నిషేధిత జాబితాలో చేర్చారు. ఏడాదిలోపు ఓటీఎస్ ద్వారా రాయితీలు, వాయిదాలతో గనుల యజమానులు జరిమానాలను చెల్లించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సిరిసిల్ల, కరీంనగర్‌లోని పలు క్వారీల్లో ఉల్లంఘనలు ఎక్కువగా జరిగినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో లీజు గడువు దాటినా.. హద్దులు మీరి తవ్వకాలతోపాటు అనుమతి తీసుకోకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పన్నులు ఎగవేస్తున్నట్లు గుర్తించారు. ఇలా ఒక్క రాజన్నసిరిసిల్ల జిల్లాలో రూ.129 కోట్ల బకాయిలను గనులశాఖ గుర్తించింది. కరీంనగర్, జగిత్యాల జిల్లాలోనూ భారీగానే ఉన్నాయి. క్వారీల అనుమతులు ఇచ్చిన విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపిన వాటికి సీనరేజీపై ఐదు రేట్లు ఎక్కువ జరిమానా విధించారు. ఓటీఎస్‌లో రెండింతలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల ఒక చోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వకాలు జరిపినట్లు ఈటీఎస్ సర్వేలో గుర్తించారు. ఇప్పటికీ బ్లాక్‌చేసిన క్వారీలు తమ జరిమానాలో 20 శాతం చెల్లించి నిషేధిత జాబితా నుంచి తొలగించుకోవచ్చు. మిగతా జరిమానాను ఏడాదిలోపు నాలుగు వాయిదాల్లో చెల్లించవచ్చు. **నివేదికలు పంపుతున్నాం** జిల్లాలో 20 క్వారీల్లో ఈటీఎస్ సర్వే చేశాం. వాటిపై లీజుదారులకు నోటీసులు అందజేశాం. ఇప్పటి వరకు ఆరుగురు తవ్వకాలు జరిపి, విక్రయించిన మెటీరియల్‌పై నివేదిక సమర్పించారు. ప్రభుత్వ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు మినహా యించి మిగతా ఎంత చెల్లించాల నేది లెక్కతేల్చాల్సి ఉంది. మరికొం దరు యజమానులు ముందుకొచ్చి జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓటీఎస్ విధానంలో పురోగతిపై ప్రతివారం రాష్ట్ర ఉన్నతాధికా రులకు నివేదికలు పంపుతున్నాం. క్రాంతికుమార్, గనుల శాఖ ఏడీ, రాజన్నసిరిసిల్ల

# గిరిజన గ్రామం.. ఉద్యోగుల నిలయం



కోనరావుపేట: అదో మారుమూల అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామం. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడి ప్రజలు జీవనం సాగించడానికి అటవీ ప్రాంతంపై ఆధారపడేవారు. మొర్రి, తునికి పండ్లు, ఇప్ప పువ్వు సేకరణ, వంట చెరకు విక్రయించి జీవనం సాగించేవారు. తండాలో కనీస సౌకర్యాలు లేవు. విద్యతోనే అభివృద్ధి, గుర్తింపు, విలువ లభిస్తుందని... తల్లిదండ్రుల కష్టాలకు పరిష్కారం లభిస్తోందని ఇక్కడి యువత భావించారు. కాలినడకన కిలో మీటర్ల దూరం వెళ్లి చదువు కొనసాగించారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తూ పోటీ పరీక్షలు రాసి ప్రతిభ చాటుతున్నారు. ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు.

**140 జనావాసాలు... 80కి పైగా ఉద్యోగులు**

కోనరావుపేట మండలం జైసేవాలాల్ గిరిజన తండా. వట్టిమల్ల గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామంగా కొనసాగింది. గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా జైసేవాలాల్ గిరిజన తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 612 మంది జనాభా ఉండగా వీరిలో 317 పురుషులు, 304 స్త్రీలు ఉన్నారు. 140 జనావాసాలు ఉండగా 80 పైగా వివిధ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు-12, బ్యాంకు ఉద్యోగులు-5, వివిధ ప్రభుత్వ శాఖలు-12, వైద్య వృత్తి-1, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్-52 మంది పనిచేస్తున్నారు. తండా ప్రజలు స్థానికంగా వరిసాగు చేస్తూ మెరుగైన దిగుబడి సాధిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉద్యోగులందరూ సంఘంగా ఏర్పడి గ్రామంలోని యువతకు తోడ్పాటు అందిస్తున్నారు. ఉన్నత చదువులు అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారికి సూచనలు, సలహాలు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. గ్రామాభివృద్ధికి సైతం సహకరిస్తున్నారు.

**1989లో ఉద్యోగం సాధించా**నేను 7వ తరగతి చదువుతుండగానే 1989లో యూనియన్ బ్యాంకు మెట్‌పల్లి శాఖలో అటెండర్‌గా ఉద్యోగం సాధించా. నిమ్మపల్లిలో ప్రాథమిక విద్య అభ్యసించడానికి సుమారు 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లా. తల్లిదండ్రులు పడుతున్న కష్టం, ఉద్యోగంతోనే కుటుంబ భద్రత, గుర్తింపు లభిస్తుందని భావించా. సర్కారు కొలువు సాధంచడమే లక్ష్యంగా చదివాను. ప్రస్తుతం కరీంనగర్ యూనియన్ బ్యాంకులో బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నా. భూక్యా బీమ్లానాయక్, యూనియన్ బ్యాంకు మేనేజర్, కరీంనగర్

**కష్టపడి చదివితే విజయం** తండా నుంచి సర్కారు కొలువు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకున్నా. డీఎస్సీ 2002లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. ప్రస్తుతం గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. నేటి యువత చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోంది. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కష్టపడి చదవాలి. శర్మాన్ నాయక్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

# ఉన్నవి తాగునీటికే..

మామడ: మండుతున్న ఎండలకు రోజురోజుకూ నీటి వనరుల్లో జలమట్టం తగ్గిపోతోంది. చిన్న కుంటల నుంచి పెద్ద జలాశయాల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పలు జిల్లాలకు తాగు, సాగు నీటిని అందించే శ్రీరామసాగర్ ప్రాజెక్టుపైనా వేసవి ప్రభావం భారీగానే కనిపిస్తోంది. ప్రస్తుతం సరస్వతి కాలువకు మినహా మిగతా వాటికి నీటి విడుదల నిలుపుదల చేశారు. ఉన్న కాస్త నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు.

**ఆ జలం ఎంతో విలువైనది**

మిషన్ భగీరథ ద్వారా పోచంపాడు ప్రాజెక్టు నుంచి నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకు నీటి సరఫరా అవుతోంది. వేసవిలో వందలాది గ్రామాలకు ఆ నీరే ఆధారం. ప్రస్తుత ఎద్దడి



పరిస్థితుల దృష్ట్యా ఎక్కడా చుక్క నీరు వృథా చేయకపోవడం మంచిది. ఇప్పటికీ చాలా మంది కుళాయిలను అలానే వదిలేస్తున్నారు. పైప్‌లైన్ల లీకేజీలను పట్టించుకోవట్లేదు. ప్రాజెక్టు ఎండుతున్న తీరు, అక్కడ నీటిని విడుదల చేసేందుకు చేస్తున్న కసరత్తు, వర్షాకాలం వరకు సర్దుబాటుకు చేసే ప్రణాళిక గమనిస్తే ఎంత పొదుపుగా వాడాలో తెలుస్తుంది.

**రోజుకు 360 క్యూసెక్కులు..**

ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలుకాగా ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జిల్లాలో వరి పంట చివరి దశలో ఉన్నందున సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కులు(ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63) వదులుతున్నారు. ఎత్తిపోతల పథకాలు, ఇతర కాలువలకు నిలిపివేశారు. రోజుకు 359 క్యూసెక్కుల నీరు ఎండలకు ఆవిరవుతోంది. జలాశయంలోకి 1 జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు 289.345 టీఎంసీల నీరురాగా 285.515 టీఎంసీలు బయటకు విడుదలైంది. వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చే వరకు ఉన్న నీటిని లెక్కలేసుకుంటూ వాడుకోవాల్సిందే..

# పైసల 'పంచాయతీ'

మామడ : గ్రామపంచాయతీ కార్యాలయాల కోసం భవనాలు మంజూరు కావడంతో స్థానికులు సంతోషపడ్డారు. అప్పటి సర్పంచులు, ఇతర వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ పనులు కదా పని చేస్తే బిల్లు వస్తుందని భావించారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. నిర్మించి నెలలు గడుస్తున్నా డబ్బులు రాక తెచ్చిన చోట వడ్డీ కట్టేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. తమ ఆస్తులు అమ్ముకునే దుస్థితి నెలకొందని వాపోతున్నారు. భవనాలు నిర్మించి అప్పులపాలయ్యాం. మాకు బిల్లులు ఇప్పించండంటూ గిరిజనులంతా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. దాదాపు ఆరు నెలల క్రితమే వీరంతా రాష్ట్ర సచివాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

జిల్లాలో ఐటీడీఏ నుంచి దాదాపు అన్ని పంచాయతీ భవనాలను నిర్మించిన వారు మధ్యతరగతికి చెందిన వారే. చేసిన అప్పులను ఎలా చెల్లించాలో తెలియక తలపట్టుకుంటున్నారు. నిధులు రాక బయట తిరిగే పరిస్థితి లేదని మొండిగుట్ట పంచాయతీ మాజీ సర్పంచి కిచ్యానాయక్ వాపోయారు. సారంగాపూర్ మండలం కుప్టితండా, పొట్యాతోపాటు జిల్లాలోని మరో రెండు చోట్ల పనులు వంద శాతం పూర్తి చేశారు. వాటిలో కార్యాలయాలు సైతం నిర్వహిస్తున్నారు. అలాంటి చోట్లా డబ్బులు ఇవ్వకపోవడం శోచనీయం.

ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రామపంచాయతీ భవనం మామడ మండలం రాసిమెట్ల గ్రామానిది. దీనిని స్థానికుడు రూప్‌సింగ్ అనే వ్యక్తి నిర్మించారు. ఏడాది క్రితమే ఈ పని పూర్తి దశకు చేరుకుంది. ఇందుకు ఆయన రూ.15 లక్షలకుపైగానే ఖర్చు చేశారు. ఇప్పటికీ ఆయనకు ప్రభుత్వం నుంచి నయా పైసా రాలేదు. అప్పు తెచ్చిన డబ్బులకు నెలకు రూ.30 వేల వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని రూప్‌సింగ్ వాపోతున్నారు. చేతిలో చిల్లి గవ్వ లేక మిగిలిన కొద్ది పనులను ఆపేశారు. వ్యవసాయంలో వచ్చిన పైసలూ బాకీలు కట్టేందుకే పోతున్నాయని తన దయనీయ పరిస్థితిని వివరించారు.

ఎస్టీ ఎస్డీఎఫ్‌లో జిల్లాలో నిర్మించిన భవనాల వివరాలు
మంజూరైన మొత్తం గ్రామ పంచాయతీలు 42
పనులు చివరి దశకు చేరుకున్నవి 26
పూర్తయినవి 04 పనులు ప్రారంభం కానివి 12
ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు దాదాపు రూ.6 కోట్లు

# కేంద్ర సిలబస్ బోధనకు వేళాయె

కొత్తగూడెం : సింగరేణి తొలిసారి తన సొసైటీకి చెందిన ఓ విద్యాసంస్థలో సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌ను ప్రవేశపెడుతోంది. గతేడాది కాలంగా ఈఆలోచన చేస్తోంది. ఈనేపథ్యంలో రామగుండం-2 ఏరియాలోని సెక్టార్-3 పాఠశాలలో సీబీఎస్‌ఈ విధానాన్ని అమలు చేస్తామంటూ కొద్దినెలల క్రితం 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' బోర్డు అనుమతి కోరింది. ఆ బోర్డు ఈనెల 19న అనుమతి పత్రాన్ని మంజూరు చేసింది. దీంతో 'సెక్టార్-3'లో కేంద్ర సిలబస్ బోధన కొత్త విద్యా సంవత్సరం నుంచి కొనసాగనుంది. **అభిప్రాయ సేకరణ** సింగరేణికి తొమ్మిది పాఠశాలలున్నాయి. వాటిల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కొన్నేళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గతేడాది ఏప్రిల్‌లో సంస్థ ఉద్యోగుల అభిప్రాయాలను సేకరించింది. 70 శాతం మంది పిల్లల తల్లిదండ్రులు కేంద్ర సిలబస్ వైపు మొగ్గుచూపారు. దీంతో ప్రయోగాత్మకంగా ఒక పాఠశాలలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. **అక్కడే ఎందుకంటే..**'సెక్టార్-3' పాఠశాల గతేడాది పది వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఈ ఘనతను భూపాలపల్లి పాఠశాల కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా సీబీఎస్‌ఈ సెక్టార్-3 విద్యాలయాన్ని యాజమాన్యం ఎంపిక చేసింది. ప్రయత్నం ఇక్కడ విజయవంతంగా అమలైతే, రీజియన్‌కు ఒకటి చొప్పున పాఠశాలలో ప్రారంభిస్తారు. కొత్తగూడెం రీజియన్‌లో జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు ఈ అవకాశం దక్కే వీలుంది.

**దశలవారీగా అప్‌గ్రేడ్**ముందుగా 1-8 తరగతుల్లో సెంట్రల్ సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఆ తర్వాత ఒక్కో ఏడాదికి పెంచుతూ పోతారు. అలా రెండేళ్లలో పదో తరగతి వరకు కొత్త విధానం అమలు అవుతుంది. ఇలా కాకుండా ఒకేసారి పది వరకు కొత్త సిలబస్‌ను బోధిస్తే ఉత్తీర్ణత శాతంపై ప్రభావం పడుతుందని ఎడ్యుకేషన్ సొసైటీ అధికారులు భావిస్తున్నారు.

**ప్రమాణాల ప్రకారం వసతులు** సీబీఎస్‌ఈ బోర్డు అనుమతి కావాలంటే పాఠశాలల్లో కొన్ని ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. అధునాతన గ్రంథాలయం, క్రీడాప్రాంగణం, నాణ్యమైన బోర్డులు, 40 మంది విద్యార్థుల సామర్థ్యం.. అన్ని వసతులతో కూడిన తరగతి గదులు వీటిలో ముఖ్యమైనవి. 'సెక్టార్ 3' ఆయా ఏర్పాట్లకు సంబంధించి సొసైటీ ముందే తగిన కసరత్తు చేసింది.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా..

విశాఖపట్నం: గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన ప్రమాదాల్లో బాధితులకు విశాఖ పోలీసులు అండగా నిలుస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరిగిన హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం' పేరుతో విశాఖ సీపీ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో సీఐ, ఎస్.ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బంది పనిచేస్తున్నారు. గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదాల్లో మృతులకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి అందేలా చర్యలు చేపట్టారు. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు 51 మంది బాధితులకు రూ.40.50లక్షలు పరిహారం అందేలా చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

**దగ్గరుండి దరఖాస్తు చేయించి:** హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ఈ కేంద్ర పథకం గురించి అవగాహన ఉండటం లేదు. ఒకవేళ అవగాహన ఉండి దరఖాస్తు చేసినా అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించేందుకు స్టేషన్లు, ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా పరిహారం అందడంలో జాప్యమవుతోంది. ఇది గుర్తించిన విశాఖ సిటీ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తన కార్యాలయంలోనే ఓ సెల్ ఏర్పాటు చేశారు. ఈ బృందం హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు అవగాహన కల్పించడంతోపాటు, ఓ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్టు, తీవ్ర గాయాలైతే క్షతగాత్రులకు ధ్రువీకరణ పత్రం, ఎంవీఐ నివేదికలు తెప్పించి బాధితులతో దరఖాస్తు చేయిస్తున్నారు.

**కలెక్టర్ ఛైర్మన్‌గా:** ఈ కేంద్ర ప్రభుత్వ పథకానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఛైర్మన్‌గా ఉన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రదేశాన్ని బట్టి సంబంధిత తహసీల్దార్ తొలుత ఆ దరఖాస్తును విచారిస్తారు. ఆ తర్వాత ఆర్డీవో నుంచి కలెక్టర్ వద్దకు వెళ్లి అక్కడ ఆమోదిస్తారు. కలెక్టర్, ట్రాఫిక్ ఏడీసీపీ, రవాణాశాఖ డీటీసీ అధికారుల కమిటీ



సంతకాలు చేసి ఫైనల్ చేస్తుంది. ఆ దరఖాస్తును జీఐ (జనరల్ ఇన్సూరెన్స్) కౌన్సిల్ ముంబైకు కమిషనరేట్ నుంచి కాపీలు స్కాన్ చేసి పంపిస్తారు. అంతా సక్రమంగా ఉంటే నేరుగా బాధిత ఖాతాలో పరిహారం జమ చేస్తారు.

**ఎంవీవోపీ కేసుల్లోనూ బాధితులకు..:** గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన కేసులతోపాటు రోడ్డు ప్రమాదాల కేసుల్లోనూ బాధితులకు ఈ కేంద్రం సహాయం చేస్తోంది. బాధితులకు బీమా ఇప్పించే విషయంలో, డాక్యుమెంటరీ, న్యాయ సహకారం అందిస్తున్నారు. విశాఖ పరిధిలో గడిచిన పదేళ్లలో పరిశీలిస్తే ఎంవీవోపీ (మోటార్ వెహికల్ ఒరిజినల్ పిటిషన్) కేసులు పదివేలకు పైగా ఉన్నాయి. ఈ కేంద్రం ఏర్పాటు చేశాక 353 కేసులు జిల్లా కోర్టులో ఫైల్ చేసేలా చూశారు.

'హిట్ అండ్ రన్ కేసుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టిసారించాం. బాధితులు ఎవరైనా పరిహారం అందకపోతే ఈ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నెంబరు 79950-95793కు కాల్ చేయొచ్చు'. శంఖబ్రత బాగ్చీ, సిటీ పోలీస్ కమిషనర్ హిట్ అండ్ రన్ కేసుల వివరాలు..

2022 ఏప్రిల్ తర్వాత మొత్తం కేసులు: 275
పరిహారం అందిన బాధితులు: 51
జనరల్ ఇన్స్యూరెన్స్ (జీఐ)లో పెండింగ్: 17
కలెక్టర్ ఆమోదముద్రకు సిద్ధంగా: 21
తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో విచారణ దశలో: 107
స్టేషన్ల నుంచి ఇంకా దరఖాస్తు చేయాల్సినవి: 79

# సరిపడా 'గంగ'.. లేదిక బెంగ..!

విశాఖ : ఏటా వేసవిలో నీటికి ఇబ్బందులు ఎదుర్కొనే నగర ప్రజలకు... ఈసారి అలాంటి అవస్థలేమీ ఉండవని, తాగునీటికి కొదవ ఉండదని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇతర జిల్లాల్లోని వనరులపై ఆధారపడుతున్న విశాఖకు.. అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. గతేడాది వర్షాలు బాగానే కురవడంతో వనరుల్లోకి నీరు చేరింది. ప్రధానమైన ఏలేరు జలాశయంతో పాటు గోదావరిలోనూ నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. తాటిపూడి, రైవాడ నగరానికి దగ్గరగా ఉన్నా..., అవి వ్యవసాయానికి వినియోగించే నీటి వనరులు. వాటిల్లోనూ



నగరానికి కేటాయింపులు ఉండటంతో నీటిని తరలిస్తున్నారు.

సుమారు 156 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలేరు రిజర్వాయర్ నుంచి విస్కో (విశాఖపట్నం పరిశ్రమల నీటి సరఫరా సంస్థ) సహకారంతో కాలువ ద్వారా గ్రావిటీపై నీటిని నగరానికి తీసుకొస్తున్నారు. అలా తెచ్చిన నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు అందిస్తున్నారు. నీటి తరలింపునకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏటా రూ.150 కోట్లు వరకు ఖర్చు చేస్తుండగా, రూ.210 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఏటా వ్యయ ప్రయాసలకోర్చి ఆయా వనరుల నుంచి నగరానికి నీటిని తరలించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వర్షాలు తక్కువగా ఉంటే వనరుల్లో నీరు తగ్గిపోయి, రెండు రోజులకు ఓసారి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

ప్రజలకు- పరిశ్రమలకు..! విశాఖ నగర ప్రజలతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నీటిని ఇతర జిల్లాల నుంచి తరలించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముడసర్లోవ మినహా, నగరంలో తాగునీటి అవసరాలు తీర్చే రిజర్వాయర్లు లేకపోవడంతో తాటిపూడి, రైవాడ, ఏలేరు, గోస్తనీలపై ఆధారపడాల్సి ఉంటుంది.

# 'చిన్న' చూపేలా?



సాగునీటి వనరుల్లో సమృద్ధిగా నీళ్లున్నా అవి పొలాలకు చేరాలంటే ఆనకట్టలు, కాలువలు సక్రమంగా ఉండాలి. ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వాటిని సరిచేయించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి సిద్ధంగా ఉంచాలి. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పనులకూ పైసా కేటాయించలేదు. సాగునీరు పొలాలకు చేరక రైతులు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి సాగునీటి వనరులన్నింటికీ మరమ్మతు చేయిస్తారని ఎదురుచూస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఎక్కడ ఏ పనులు చేపట్టాలో పరిశీలించి నిధుల మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపారు. జలవనరుల శాఖ నర్సీపట్నం డివిజన్‌లోని పది మండలాల్లో సాగునీటి కాలువలు, ఆనకట్టలు పలుచోట్ల శిథిలమయ్యాయి. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 17 పనులకు రూ.2.27 కోట్లు, చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట, రావికమతం మండలాల్లో నాలుగు పనులకు రూ.58 లక్షలు, ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో పది పనులకు రూ.46 లక్షలు, పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలంలో ఎనిమిది పనులకు రూ.38.15 లక్షలు అవసరమని ప్రతిపాదించారు. ఇవికాక 394 చోట్ల చిన్నపాటి మరమ్మతులకు రూ.50.60 కోట్లు అవసరమని అంచనా వేశారు.

గొలుగొండ మండలంలో రావణాపల్లి ఆవ మదుం ఆరునెలల కిందట దెబ్బతింది. తాత్కాలిక మరమ్మతు కోసం సభాపతి అయ్యన్నపాత్రుడు రూ.2 లక్షలు విడుదల చేయించారు. శాశ్వత మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరం. వర్షాకాలం రాకముందే ఈ మదుం పునరుద్ధరణ జరిగితే రైతులు ధీమాగా ఉంటారు.

మాకవరపాలెం మండలంలో జాగారం గెడ్డ కోతకు గురవుతోంది. గెడ్డనీరు పొలాలను ముంచెత్తుతోంది. దీనికి రక్షణగోడ నిర్మించాలి. మాకవరపాలెం మండలం కోడూరు ఆనకట్ట, నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఆనకట్ట గేట్లు పాడయ్యాయి. గొలుగొండ మండలం విప్పలపాలెం ఆనకట్ట గేట్లూ దెబ్బతిన్నాయి.

రావికమతం మండలం కల్యాణలోవ రెండో కిలోమీటరు వద్ద ఆక్విడక్టు దెబ్బతింది. నీరు వృథా అవుతుండటంతో దిగువ ఆయకట్టుకు నష్టం జరుగుతోంది. రోలుగుంట మండలం కోమరవోలు ఆవ తూములు పాడవడం వల్ల నీరు లీకేజీ రూపంలో వృథా అవుతోంది.

సాగునీటి కాలువలు, ఆనకట్టల మరమ్మతులు గతంలో ఏప్రిల్ నుంచే మొదలయ్యేవి. జూన్ నెలాఖరు/ జులై రెండో వారానికి పూర్తి చేసేవారు. జిల్లాలో జులై చివరి వారం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు వరినాట్లు ముమ్మరంగా జరుగుతుంటాయి. మరమ్మతుల విషయం జలవనరుల శాఖ ఇన్‌ఛార్జి ఈఈ బాలసూర్యం దృష్టికి తీసుకువెళ్లగా.. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు విడుదల కాగానే పనులు మొదలవుతాయని పేర్కొన్నారు.

# పెట్టుబడుల ప్రవాహం



అనకాపల్లి: కూటమి ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదిరింది. కొత్తగా తీసుకువచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ నచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం వచ్చింది. సర్కారు కొలువుదీరి ఏడాది గడవక ముందే రూ.4.95 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ప్రవాహంలా వచ్చాయి. ఇందులో సింహభాగం రూ.3.4 లక్షల కోట్ల పెట్టుబడులు అనకాపల్లి జిల్లాకు రావడం విశేషం. మిగతా జిల్లాలతో పోలిస్తే అనకాపల్లి అన్నివిధాలా అనుకూలంగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలంతా ఇటువైపే చూస్తున్నారు. తాజాగా రూ.8,339 కోట్లతో రెండు కొత్త పరిశ్రమలు ఏర్పాటుకానుండగా, మరో రెండు కంపెనీలు రెండోదశ విస్తరణకు శ్రీకారం చుడుతున్నాయి. తద్వారా 6,350 మందికిపైగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**ఏడాదిలో ఎంత మార్పు..** అచ్యుతాపురం సెజ్‌కు సంబంధించి గత ఐదేళ్లు ఓ లెక్క.. ఈ ఏడాది ఓ లెక్క అన్నట్లుంది. వైకాపా హయాంలో పారిశ్రామికవేత్తలు ఈ సెజ్ వైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాదిలో 'కంపెనీలు పెడతాం.. భూములు ఎక్కడ కేటాయిస్తారు. ఎంత ధర చెల్లించాలి. ఏఏ సదుపాయాలు కల్పిస్తారు. ఎప్పటిలోగా అనుమతులిస్తారు' అంటూ దిగ్గజ సంస్థల నుంచి నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వరకు ఆరా తీస్తూ ఆసక్తి చూపుతున్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో ఆమోదం పొందగా మరికొన్ని కంపెనీలు ప్రతిపాదనలతో సిద్ధంగా ఉన్నాయి.

**ఇది వరకే అనుమతులు..**

రాంబిల్లి మండల పరిధిలోని 106 ఎకరాల్లో సుమారు రూ.1,175 కోట్లతో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ అనే కంపెనీ ఏర్పాటుకానుంది. తద్వారా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

సబ్‌స్ట్రాక్ట్ మాన్యుఫ్యాక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంటర్‌ప్రైజ్ (స్మైల్) అనే కృత్రిమ మేధ ఉత్పత్తుల తయారీ కంపెనీ రూ.189 కోట్లతో పెట్టుబడితో సెజ్‌లో అడుగుపెడుతోంది.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన మా దుర్గా పైపుల తయారీ కంపెనీకి 45 ఎకరాలు కేటాయించనున్నారు. దేశంలో అతి పొడవైన పైపులను తయారీ చేసే ఏకైక కంపెనీ ఇది.

**తాజాగా..**

రాంబిల్లిలో జూపిటర్ రెన్యూవబుల్స్ ప్రై.లి సంస్థ రూ.2,700 కోట్ల పెట్టుబడితో 2,216 మందికి ఉపాధి కల్పించేలా కొత్త కంపెనీ ఏర్పాటు చేయనుంది. 4.8 మెగావాట్ల సోలార్ సెల్, 1.5 మెగావాట్ల మాడ్యుల్స్ తయారీ చేయనుంది.

రాంబిల్లి క్లస్టర్‌లోనే బ్లూజెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ రూ.1750 కోట్లతో రాంబిల్లి మండలంలోనే 125 ఎకరాల్లో ఇంటర్మీడియట్ మాన్యూఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 1,750 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

అచ్యుతాపురం సెజ్‌లో జపాన్‌కు చెందిన ఏటీసీ టైర్ల కంపెనీ రెండో దశ విస్తరణ పనులను రూ.1,779 కోట్లతో చేపట్టనుంది. మరో 600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

పాయకరావుపేట మండలంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ రూ.1,560 కోట్లతో కుమారపురం వద్ద రెండో దశ విస్తరణ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురానుంది. దీనివల్ల 1800 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే జిల్లాలో బల్క్‌డ్రగ్ పార్క్, గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనలు జరగగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ లాంటి దిగ్గజ ప్రాజెక్టు త్వరలో పట్టాలెక్కనుంది. వీటికి తోడు కొత్తగా వస్తున్న మరికొన్ని కంపెనీలతో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ముఖచిత్రమే మారిపోనుందని పరిశ్రమలశాఖ అధికారులు చెబుతున్నారు.

# రసాయన వ్యర్థాలతో ఉక్కిరిబిక్కిరి



అచ్యుతాపురం : అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు 27 గ్రామాలను తరలించారు. అచ్యుతాపురం మండలం చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్లదిబ్బ, రాంబిల్లి మండలం చినపూడి గ్రామాలను ఇప్పటికీ తరలించలేదు. వీటి చుట్టూ ప్రమాదకరమైన రెడ్ జోన్ పరిశ్రమలకు కేటాయించారు. వీటిలో చినపూడి చుట్టూ అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు విడుదల చేసే పరిశ్రమలు వెలిశాయి. భరించలేని దుర్గంధాన్ని వెదజల్లే ఈసీటీపీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ కంపెనీల నుంచి లీకవుతున్న రసాయన వ్యర్థాలు చినపూడి తాగునీటి పథకంలో కలవడంతో ఏడాదిన్నర క్రితం ఈ గ్రామానికి చెందిన 60 మంది నిర్వాసితులు వాంతులు, విరోచనాలతో విశాఖలోని కేజీహెచ్‌లో చేరారు. చికిత్స అందడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ట్యాంకులతో తాగునీటిని అరకొరగా అందిస్తున్నారు. మండుతున్న ఎండలతో సిమెంటు రేకుల ఇళ్లల్లో ఉండలేక నిర్వాసితులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం విద్యుత్తును కూడా సక్రమంగా సరఫరా చేయడంలేదని ఆందోళన చేస్తున్నారు. చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్లదిబ్బ వాసుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. **విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు..:** విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదు. సమస్యను పరిష్కరించాలని అచ్యుతాపురం, రాంబిల్లికి చెందిన విద్యుత్తు అధికారులను కోరినా పరిధి మాది కాదంటూ తప్పించుకుంటున్నారు. రసాయన వ్యర్థాలు లీకై తాగునీరు కలుషితమవుతోంది.రాజాన సంజీవి, యువకుడు, ఉద్దపాలెం

తాగునీరు కలుషితం..: ఈసీటీపీ ప్లాంట్ నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. ఇళ్లపై తెల్లటి దుస్తులు ఆరబడితే నల్లగా మారిపోతున్నాయి. కలుషితమైన తాగునీటితో కిడ్నీ బాధితులు పెరిగిపోతున్నారు. ఎం.రమాదేవి, గృహిణి, చినపూడి

# ప్రాణాలు నిలిపే ప్రణాళికే కీలకం

విశాఖపట్నం : గతేడాది ఆగస్టులో అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 24 మందికి అనకాపల్లి, విశాఖ, అచ్యుతాపురంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అందులో అధిక శాతం క్షతగాత్రులకు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే చికిత్స అందించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడిన బాధితుల్లో ఆరుగురిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా, ఇతర పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా దుర్ఘటనల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ముందుగా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా మారినా, కాలిన గాయాలు ఎక్కువగా ఉన్నా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. రసాయన, జీవసంబంధ, రేడియోలాజికల్, న్యూక్లియర్ (అణు) సంబంధిత ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించేందుకు స్థానికంగా ప్రత్యేక సదుపాయాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కేంద్రం ఏర్పాటును వేగవంతం చేయాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

గతేడాది వైద్యులకు శిక్షణ: సీబీఆర్ఎన్ సెంటర్ కోసం విమ్స్‌లో



రెండెకరాల స్థలం కేటాయించారు. 2024 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులు స్థలాన్ని పరిశీలించారు. గతేడాది అక్టోబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. విమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు తమిళనాడులోని కుడంకుళం అణువిద్యుత్తు ప్లాంటులో శిక్షణ అందజేశారు. తర్వాత ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. కేంద్రం పూర్తయ్యాక అందులో పనిచేసేందుకు పూర్తి సిబ్బందిని కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలు కూడా కేటాయిస్తుంది.

**ఏర్పాటైతే ప్రయోజనాలు..**

కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సెక్టర్ డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ రెస్పాన్స్, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద ఈ కేంద్రం నిర్మించాలని భావించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) తదితర సంస్థల సహకారంతో దీన్ని నిర్మించనున్నారు. రియాక్టర్ పేలుళ్లు, గ్యాస్ లీకేజీలు, రసాయనాల విస్ఫోటనాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన వారికి అత్యాధునిక వైద్యం అందించేలా రెండంతస్తుల్లో తీర్చిదిద్దుతారు. ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరీన్ గ్యాస్ లీకేజీ, అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లోని ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, ఇతర పేలుళ్ల తరహా ఘటన లు జరిగితే బాధితులకు ఒకేచోట మెరుగైన వైద్యం అందించొచ్చు. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా తక్షణ, ప్రత్యేకమైన వైద్యం అందించేందుకు వీలుంటుంది. బాధితులకు అత్యవసర చికిత్స చేయడానికి 20 పడకల ఐసీయూ, ఐసోలేషన్ పడకలు తదితర ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

# అమ్మలకు అండగా.. వసతులు మెండుగా

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ఒకప్పుడు నెలకు 400 నుంచి 500 వరకు ప్రసవాలు జరిగేవి. రాష్ట్రంలో అత్యధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో ముందు వరసలో ఉండి అవార్డులు అందుకున్న ఘనత ఈ ఆసుపత్రిది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ ప్రతిష్ఠ మసకబారింది. నెలకు 300 ప్రసవాలు జరగడం గగనమైపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే, సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రసూతి సేవల మెరుగుకు చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగు నెలల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వెయ్యి సాధారణ ప్రసవాలు, 300 శస్త్రచికిత్సలు చేశారు. గతంతో పోలిస్తే శస్త్రచికిత్సలు 30 శాతం తగ్గాయి. శస్త్రచికిత్స అవసరమైతే సీనియరు వైద్యులను సంప్రదించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుంచి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి కొన్ని కేసులను పంపేవారు. ఇప్పుడిలా తరలించడం లేదు. అర్ధరాత్రి అయినా అప్పటికప్పుడు వైద్యులు వచ్చి అవసరమైతే శస్త్రచికిత్సలూ చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆసుపత్రి నుంచి ఒక్క గర్భిణినీ బయటకు పంపలేదు. వైద్యుల సేవలు మెరుగుపడ్డాయి. శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలను వైద్యులు రోజుకు రెండు మూడుసార్లు పలకరిస్తున్నారు. ఆసుపత్రిలోనే అవసరమైన ఫొటోథెరఫీ యూనిట్లు అందుబాటులో ఉ



న్నాయి. కామెర్లు ఉన్న పిల్లలను గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు పంపేవారు. కుటుంబ సభ్యులు అక్కడ రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఉంచుతున్నారు. బరువు తక్కువ పిల్లల కోసం ఎస్ఎన్‌సీయూలో వార్మర్లు ఉన్నాయి. పీజీ వైద్య విద్యార్థులతో కలిసి ముగ్గురు పిల్లల వైద్యులు, నలుగురు ప్రసూతి వైద్య నిపుణులు ఆసుపత్రిలో ఉన్నారు. మందులు కొరత తలెత్తకుండా అవసరమైతే ఆసుపత్రి నిధులతోనే బయటి నుంచి కొనుగోలు చేసి ఇస్తున్నారు.

ఓపీ విభాగంలో సీనియర్ గైనకాలజిస్టు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాశారద రోగులను పరీక్షిస్తున్నారు. తాజాగా ఓపీ విభాగంలో ఏసీ సదుపాయం కల్పించారు. ప్రసూతి విభాగం వద్ద శుద్ధజలం అందుబాటులో ఉంచారు. డాక్టర్ సుధాశారద మాట్లాడుతూ.. 'నాలుగు నెలలుగా వైద్యులందరి సమష్టి కృషితో ప్రసవాల సంఖ్య పది నుంచి 40 వరకు పెరిగాయి. నెలకు నాలుగైదు వందల ప్రసవాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం 150 పడకలు ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలున్నాయి. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడే అవకాశముంద'న్నారు.

# హెచ్చెల్సీ మరమ్మతులపై నీలినీడలు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (టీబీ హెచ్చెల్సీ) నిర్వహణ, పాలన వ్యవహారంలో నీలినీడలు కమ్ముకున్నాయి. కీలకమైన ఎస్ఈ పోస్టుపై సందిగ్ధం నెలకొంది. రెండు వారాలు గడిచినా రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించ లేదు. ఎస్ఈ రాజశేఖర్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అదే రోజే అర్హత కల్గిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈదఫా భిన్నమైన పరిస్థితి తలెత్తింది.

**రూ.33.89 కోట్ల పనులపై ప్రభావం**

గత వైకాపా పాలనలో హెచ్చెల్సీని పూర్తిగా నిర్వీర్యం చేశారు. మరమ్మతు, నిర్వహణకు పైసా ఇవ్వలేదు. ప్రధాన కాలువ శిథిలావస్థలో ఉంది. 2వేల క్యూసెక్కుల నీటిని తీసుకోలేని దయనీయ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రాగానే హెచ్చెల్సీ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం లభించింది. అత్యవసరంగా చేపట్టాల్సిన వంతెన, కాలువ గట్ల బలోపేతం, ఇతర మరమ్మతుల కోసం ఒకేసారి రూ.38 కోట్లు



ఏకంగా బడ్జెట్‌లో కేటాయించడం విశేషం. ఇందులో రూ.33.89కోట్ల విలువైన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. జూన్ ఆఖరు నాటికి నిర్దేశిత 11 పనులు పూర్తి చేయాలి. కీలకమైన ఎస్ఈ లేకపోవడంతో ఆ పనులపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. మరోవైపు ఉప ఎస్ఈ సైతం సెలవులో ఉన్నారు. లోకలైజేషన్ ఈఈ ఈనెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు.

**సాధారణ బదిలీలు ఎలా?**

జూన్ నుంచి నీటి సీజన్ మొదలు కానుంది. ఈలోపే టీబీ బోర్డు ఎస్ఈల స్థాయి సమీక్ష జరగనుంది. హెచ్చెల్సీ ఎస్ఈనే హాజరు కావాల్సి ఉంటుంది. మరో వైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చింది. జూన్ 2వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. హెచ్చెల్సీ ప్రాజెక్టులో అటెండర్ స్థాయి నుంచి కార్యాలయ పర్యవేక్షకుడి దాకా ఎస్ఈనే బదిలీ చేయాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి బదిలీల ప్రక్రియ ఆరంభమైంది.

# బోధనేతర సిబ్బంది బదిలీలు జరిగేనా ?

చిత్తూరు : ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో బోధనేతర సిబ్బంది స్థాన చలనానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియ జూన్ 2లోగా పూర్తి చేయాల్సి ఉంది. ఒకేచోట రెండేళ్లు సర్వీసు పూర్తైన వారు అభ్యర్థన కింద బదిలీ చేసుకోవచ్చు. ఐదేళ్లు ఒకేచోట సర్వీస్ పూర్తైన వారు తప్పనిసరిగా బదిలీ కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలా బదిలీలు జరిగేనా అనేది ప్రశ్నార్థకం. ఉమ్మడి జిల్లాలో 158 మంది కార్యాలయ సహాయకుల నుంచి పర్యవేక్షకుల వరకు ఉన్నారు. వారిలో కార్యాలయ సహాయకులు, దిగువ, ఎగువ శ్రేణి సహాయకులను చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలో చిత్తూరు డీఈవో వరలక్ష్మి బదిలీ చేయనున్నారు. పర్యవేక్షకులను ఆర్జేడీ



జోనల్ స్థాయిలో బదిలీ చేస్తారు. ఆ పైస్థాయి అధికారులను రాష్ట్ర విద్యాశాఖ బదిలీ చేయనుంది. జిల్లాల విభజనకు ముందు డీఈవో కార్యాలయంలో ఉన్న అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసేవారు. సీనియర్ అసిస్టెంట్లను చిత్తూరు పీసీఆర్, నగరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు, డైట్ కళాశాలలకు బదిలీ చేయాలి. కార్వేటినగరం డైట్ కళాశాలలో ఇద్దరు టైపిస్టులు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్, పర్యవేక్షకులు ఒకరు చొప్పున ఉన్నారు. దీంతో చాలావరకు ఆ శ్రేణి ఉద్యోగులు చిత్తూరు విద్యాశాఖ కార్యాలయంలోనే కొన్నేళ్లుగా పాతుకుపోయారు. వారిని ఏ డీఈవో ఉన్నా బదిలీ చేయకపోవడం గమనార్హం. ఈసారైనా పాతుకు పోయిన వారికి స్థాన చలనం కలిగేనా అనేది వేచిచూడాలి.

# ఒడా.. ఎవరో పీఠం పైన!

ఒంగోలు : కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ చేపడుతోంది. దీంతో గుర్తింపు కలిగిన పదవుల కోసం ఆశావహులు కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. స్థానిక నాయకుల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటూనే.. అన్ని కోణాల్లో పరిశీలించి వడపోతలు చేపట్టి.. ఆ తర్వాత పార్టీ అధినాయకత్వం పదవులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా)పై కేంద్రీకృతమైంది.

**జిల్లాకు పెరిగిన ప్రాతినిధ్యం:** నామినేటెడ్ పదవుల భర్తీలో కూటమి ప్రభుత్వం జిల్లాకు పెద్దపీట వేసింది. భాజపా కోటాలో ఒంగోలుకు చెందిన లంకా దినకర్‌కు కేబినేట్ ర్యాంకు పదవైన రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ స్థానాన్ని అందించింది. రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా దామచర్ల సత్య, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూకసాని బాలాజీలను నియమించింది. తాజా నియామకాల్లో రాష్ట్ర లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ నియమితులయ్యారు. గతంతో పోలిస్తే జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి పదవులే దక్కాయి. తాజాగా జిల్లా స్థాయిలోనూ కీలక పదవుల భర్తీపై తెదేపా అధినాయకత్వం దృష్టి పెట్టింది. ఆ క్రమంలోనే పీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడిగా డాక్టర్ కామేపల్లి సీతరామయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్‌గా కనిగిరికి చెందిన శ్యామల కాశిరెడ్డి నియమితులయ్యారు.సామాజిక సమీకరణలు కీలకం: జిల్లాస్థాయిలో ఇప్పుడు అందరి దృష్టి ఒడాపై కేంద్రీకృతమైంది. ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ ఛైర్మన్‌ల తర్వాత జిల్లాల విస్తృతమైన అధికార పరిధి, అర్థిక వనరులు ఉన్న కార్పొరేషన్ ఇది. దీంతో ఈ పదవి ఎవరికి దక్కనుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ పదవిని దక్కించుకునేందుకు పలువురు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. సామాజిక సమీకరణలు కీలకంగా మారడంతో పదవులు దక్కని కొన్ని వర్గాలకు చెందిన నేతలు ఆశలు పెంచుకున్నారు. ఒడా పరిధిలోకి జిల్లా మొత్తం వస్తుండటంతో అన్ని నియోజకవర్గాలకు చెందినవారు తమస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తెదేపా అధిష్ఠానం ఈ పదవిని ఎవరికి కేటాయిస్తుందనే విషయమై చర్చోపచర్చలు సాగుతున్నాయి.

# ఆధ్యాత్మిక కేంద్రంలో స్వచ్ఛతకు తూట్లు



పుట్టపర్తి : కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర'కు పాలకవర్గం, యంత్రాంగం తూట్లు పొడుస్తోంది. ఆధ్యాత్మిక కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారం దర్శనమిస్తోంది. జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. నిత్యం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ చేతన్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పలుమార్లు ఆదేశించినా ఫలితం లేదు. చెత్తసేకరణ ప్రక్రియ, తరలింపు అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు చెత్త తరలించే రిక్షాలు అందుబాటులో లేవు. వ్యర్థాలను ఎలా తరలించాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వీధుల్లో నుంచి పోగు చేసి.. ఒక చోట చేర్చడానికి కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు.

**పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావన**

శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలకు సిద్ధం కావాలని.. ఇందుకు తగిన ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పలు కౌన్సిల్ సమావేశాల్లో సూచించినా కార్యరూపం దాల్చలేదు. పది రోజుల వ్యవధిలో మూలపడిన రిక్షాలు, కంపాక్టర్స్‌ను మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించి మూడు నెలలు అవుతున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.

పురపాలక సంఘానికి సంబంధించి పుష్‌కార్ట్స్ 20 ఉండగా...కేవలం 5 మాత్రమే పనిచేస్తున్నాయి. రిక్షాలు 18కిగాను మూడు వినియోగంలో ఉన్నాయి. చెత్తను తరలించే రెండు కంపాక్టర్ వాహనాలు రెండు ఏడాదిగా మూలకు చేరడం గమనార్హం.

మరమ్మతులు చేయించాల్సిన అధికారులు.. వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. అద్దె ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన దుస్థితి వచ్చింది. గత వైకాపా పాలకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేసింది.

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

పురపాలిక పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు గురైన పుష్‌కార్ట్స్, కంపాక్టర్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు గుత్తేదారులను ఆహ్వానించాం. కొత్త పుష్‌కార్ట్స్ కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం.

**పురపాలికలో ఇలా..**

వార్డులు : 20
జనాభా : 38 వేలు
రోజూ సందర్శించే భక్తులు, పర్యాటకులు: 5వేల మంది
శానిటరీ డివిజన్లు: 02
పారిశుద్ధ్య కార్మికులు : 58
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త: 8 టన్నులు

# నాలుగు గ్రేడ్‌లుగా పంచాయతీల విభజన!



పుట్టపర్తి : గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించడానికి కసరత్తు జరుగుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత గ్రామ పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించే ప్రక్రియ ఆరంభమైంది. రెండు మూడు రోజుల్లో విభజన ప్రక్రియ పూర్తవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. స్పెషల్‌గ్రేడ్, గ్రేడ్-1, 2, 3లుగా విభజించనున్నారు.

**జనాభా, ఆదాయం మేరకు..**

ప్రస్తుతం రెండు మూడు పంచాయతీలను క్లస్టరుగా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించారు. జనాభా, ఆదాయాన్ని బట్టి విభజన చేస్తున్నారు. గ్రేడ్‌ల విభజన పూర్తయితే ప్రతి పంచాయతీకి కార్యదర్శిని నియమించాలన్న ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం మేజరు, మైనరు పంచాయతీల వ్యవస్థ నడుస్తోంది. జనాభా, ఆదాయాలు పెరిగినా ఎలాంటి మార్పు తీసుకురాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలు కల్పించాలని కృతనిశ్చయంతో ఉంది.

పంచాయతీల ఆదాయం రూ.కోటికి పైగా లేదంటే జనాభా 10 వేలకు మించిన వాటిని స్పెషల్ గ్రేడ్‌గా గుర్తిస్తారు. ఇరు జిల్లాల్లో ఇలాంటి పంచాయతీలు దాదాపు 20 వరకు ఉన్నట్లు అంచనా. గిరిజన ప్రాంతాల్లో జనాభా 5వేలు దాటితే స్పెషల్ గ్రేడ్‌గా గుర్తించనున్నారు. జనాభా 4 వేల నుంచి 10వేల లోపు లేదంటే ఆదాయం రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఉంటే గ్రేడ్-1 పంచాయతీగా గుర్తిస్తారు. ఇలాంటివి 200లోపు ఉంటాయి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 3 వేల నుంచి 5వేల లోపు ఉంటే గ్రేడ్-1 జాబితాలో ఉంటుంది.

గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలు ఆదాయంతో సంబంధం లేకుండా జనాభాను ప్రాతిపదికగా తీసుకుని విభజిస్తారు. 1500 నుంచి 3వేల లోపు ఉన్నవి గ్రేడ్-2, 1500లోపు ఉన్న పంచాయతీలు గ్రేడ్-3లో ఉంటాయి. వివరాలన్నీ ఎంపీడీలు, డీఎల్‌పీఓలు సేకరించి వర్గీకరిస్తున్నారు. స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలకు ఈఓఆర్డీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేడ్-4 నుంచి 6 వరకు ఉన్న కార్యదర్శులను గ్రేడ్-2 లేదా గ్రేడ్-3లో విలీనం చేయనున్నారు.

**నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం**

నాగరాజునాయుడు, డీపీఓ

వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. త్వరలో కలెక్టర్‌కు నివేదిస్తున్నాం. ఆదాయం, జనాభా ప్రాతిపదికన పంచాయతీలను వర్గీకరించాం. సవరణలు చేసిన తర్వాత జాబితా ప్రకటిస్తాం. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు ఈఓఆర్డీలను నియమించే అవకాశం ఉంది. దీనివల్ల పోస్టుల సంఖ్య పెరుగుతుంది.

# ఆయకట్టు.. చెప్పకుండానే కనికట్టు!



చిత్తూరు: ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అన్నదాతల కడగండ్లు తీర్చేందుకు.. కరవు నేలను సస్యశ్యామలంగా మార్చేందుకు చేపడతారు. వైకాపా హయాంలో మాత్రం ఇందుకు భిన్నంగా పుంగనూరు నియోజకవర్గంలో రెండు జలాశయాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అనుకున్నదే తడవుగా ఆఘమేఘాలపై పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులపై కేసులు నమోదు చేశారు. బతుకుదెరువు కోల్పోతున్నందున పరిహారం ఇవ్వాలని కోరిన కర్షకుల వినతులను పరిగణనలోకి తీసుకోలేదు. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ పనులపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అక్కడి నుంచి వచ్చే సిఫార్సులకు అనుగుణంగా బాధ్యులపై సర్కార్ చర్యలు తీసుకుంటోంది.

ముఖ్యమంత్రిగా జగన్ ఉన్న సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గంలో రెండు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించేందుకు 2020 సెప్టెంబరు 2న రాష్ట్ర ప్రభుత్వం పాలనా అనుమతులు ఇచ్చింది. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లెలో జలాశయాల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ పనులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ప్రాజెక్ట్సు చేపట్టింది. ప్రాజెక్టులు కట్టే ముందు శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి. ఎంత వ్యయమవుతుంది? నిర్మాణంతో ఏ మేరకు లబ్ధి జరుగుతుంది? అని ప్రాథమికంగా సర్వే చేస్తారు. కట్టే ఖర్చు కన్నా ఎక్కువ లబ్ధి ఉంటేనే ప్రభుత్వం పాలనా అనుమతులు ఇస్తుంది. మూడు జలాశయాల నిర్మాణంలో మాత్రం దీనిపై కాకి లెక్కలు వేసి సర్కార్‌కు నివేదిక పంపించారని సమాచారం. దీనికోసం జలవనరుల శాఖ అధికారులపై 'పెద్దాయన' ఒత్తిడి చేశారని అప్పట్లో ప్రచారం జరిగింది. పాలనా అనుమతుల మంజూరుకు ముందే ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించవచ్చు? ఎంతమందికి తాగునీరు ఇవ్వవచ్చు? అని తేల్చాలి. అంచనా వ్యయం తయారు చేసిన తర్వాత 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

**పరిహారం ఇవ్వకుండానే..**

రైతుల భూములు తీసుకుంటే సాగునీటి సదుపాయం ఉన్న వాటికి ఎకరాకు ఎంత పరిహారం ఇవ్వాలి? వర్షాధార నేలలకు ఎంత చెల్లించాలో కూడా నోటిఫికేషన్ ప్రచురిస్తారు. అన్నదాతల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత, పరిహారం వారి ఖాతాల్లో జమ చేసిన తర్వాతే నిర్మాణాలు ముందుకు సాగుతాయి. ఇక్కడ అలా జరగలేదు.

# దేవాదాయ భూముల స్వాధీనానికి సన్నద్ధం

అనకాపల్లి : ఆక్రమణలకు గురైన దేవాదాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాకినాడలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో కలిసి ఇటీవల దేవరాపల్లి మండలం మారేపల్లిలో ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నారు. చాలాచోట్ల అసలు భూములు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. వీటిపై రెవెన్యూ అధికారుల సహకారంతో భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 721 దేవాలయాలు ఉన్నాయి. వీటికి 287 గ్రామాల్లో 5,746 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1,350 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. మిగిలిన దానిలో 3,008 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వీటిలో కొన్ని న్యాయస్థానాల్లో ఉన్నాయి. దేవరాపల్లి మండలం మారేపల్లిలోని రామాలయానికి 40 ఎకరాల భూమి ఉంది. ఇది అన్యాక్రాంతమైంది. వి.మాడుగుల రాధాస్వామి దేవాలయానికి 1860 సంవత్సరంలోనే 113 ఎకరాలు ఉంది. అసలు ఆ భూమి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. దేవరాపల్లిలో ఉమామహేశ్వరి అమ్మవారికి 1.40 ఎకరాలు ఉంది. ఇందులో 40 సెంట్లలో తిరుమల, తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం



నిర్మించారు. మిగిలిన ఎకరా ఆక్రమణకు గురైంది.

అనకాపల్లి దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన విలువైన స్థలాలు, భూములు అన్యాక్రాంతమయ్యాయి. రహదారిని ఆనుకుని ఉన్న 60 సెంట్లు విలువైన స్థలం ఆక్రమణకు గురైంది. వేదుల వారి కుటుంబీకులు దేవస్థానం దూపదీప నైవేద్యాల నిమిత్తం ఈ భూమిని దానంగా ఇచ్చారు. దీన్ని కొందరు ఆక్రమించారు. ఒకరు దేవాదాయ భూమినే బ్యాంకులో తనఖాపెట్టి రుణం పొందారు. బాకీ చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి గతంలో యత్నించినా దేవస్థానం పాలకవర్గం అడ్డుకుంది. ఈ స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.15 కోట్లు ఉంటుందని అంచనా. వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 578 గజాల స్థలం ఆక్రమణకు గురైంది.

నిషేధిత జాబితాలో భూముల వివరాలు... దేవాదాయశాఖకు చెందిన భూముల వివరాలు రిజిస్ట్రార్లకు ఇచ్చి నిషేధిత భూముల జాబితాలో చేర్పించాం. ఎన్ని తరాల నుంచి ఉన్నా వారి సొంతం కాదు. దేవాదాయ శాఖ చట్టం చాలా పక్కాగా ఉంటుంది. ఆక్రమణ భూములు అన్నింటినీ స్వాధీనం చేసుకుంటాం. దేవాదాయశాఖ భూమి అని తెలియక చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. ఒక్క సెంటు భూమిని కూడా వదిలేది లేదు.– సుధారాణి, దేవాదాయ శాఖ జిల్లా అధికారిణి

# అల్లుకున్న అక్రమాల తీగ

నంద్యాల : విద్యుత్తుశాఖలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పైసలు ఇవ్వందే ఏ పనీ చేయడం లేదు. లంచం ఇవ్వనిదే లైను చూడటం లేదు. మూడేళ్ల నుంచి విద్యుత్తు సామగ్రి సరఫరా సరిగా జరగడం లేదు. కండక్టర్లు, కేబుల్ సరఫరాలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఇది కొంతమంది అధికారులు, సిబ్బందికి వరంగా మారింది. గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం, నియంత్రికల ఏర్పాటు కోసం తిరుగుతున్న వినియోగదారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు.

**షిఫ్టింగ్ పేరుతో దోపిడీ**

హెచ్‌టీ, ఎల్‌టీ, 11 కేవీ విద్యుత్తు లైన్ల మార్పిడి పేరుతో కొంతమంది అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యుత్తు తీగలు మార్పిడి కోసం ప్రభుత్వానికి చెల్లించే మొత్తం ఒకటైతే అందుకు రెట్టింపు స్థాయిలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రత్యేకించి శివారు ప్రాంతాల్లో వెంచర్లు వేసే స్థిరాస్తి వ్యాపారులు లేఅవుట్ అడ్డుగా ఉన్న స్తంభాలు, తీగలను మార్చాలని కోరుతున్నారు. అలాంటి వారి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ముందస్తు ఒప్పందం చేసుకుంటేనే..**

రైతులు, వినియోగదారులకు కనెక్షన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అదే అధికారులతో ముందస్తు ఒప్పందం ఉంటే మాత్రం సకాలంలో ఇస్తున్నారు. వ్యవసాయ సర్వీసులు, గృహ, వాణిజ్య సర్వీసులు ఇచ్చేందుకు విద్యుత్తు శాఖ ఒక ప్రణాళిక అమలు చేస్తుంటే.. అధికారులు మరో పద్ధతిలో వెళ్తున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి కర్నూలు స్టోర్‌లో నియంత్రికలు, సామగ్రి, కండక్టరు, కేబుల్ వంటివి సిద్ధంగా ఉన్నా వెయిటింగ్ లిస్టు పేరుతో రైతులకు కనెక్షన్లు సకాలంలో ఇవ్వడం లేదు.

**పట్టుపడినా మారరంతే..**

రుద్రవరం మండలం చిన్నకంబలూరుకు చెందిన రైతులు లింగమూర్తి, రామకృష్ణమాచారి తమ పొలంలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏడాదైనా రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. చివరకు విద్యుత్తు శాఖ డిప్యూటీ ఈఈ రవికాంత్‌చౌదరి రూ.30 వేలు డిమాండ్ చేశారు. అంతమొత్తం లంచం ఇస్తామని ఒప్పుకొన్న రైతుల నుంచి ఆ డబ్బును మీటర్ రీడర్ ప్రతాప్ తీసుకుంటుండగా అనిశా అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో సూత్రధారి రవికాంత్‌చౌదరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయి..**

తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డ రవికాంత్‌చౌదరి సుదీర్ఘకాలంగా ఆళ్లగడ్డలోనే విధులు నిర్వహిస్తున్నారు. మధ్యలో కొంతకాలం నంద్యాలలో పనిచేసినా మళ్లీ అక్కడికే వెళ్లారు. ఇద్దరు సబ్ ఇంజినీర్లు కూడా ఇదే డివిజన్‌లో చాలా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిచయాలతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 16 ఏళ్లుగా సబ్ ఇంజినీరుగా పనిచేస్తున్న అధికారిని ఇటీవల కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా డిప్యుటేషన్‌పై మళ్లీ ఇదే స్థానానికి రావడం గమనార్హం.

**ప్రతి పనికీ పైసావసూల్**

వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక కావాలంటే స్తంభాల సంఖ్యను బట్టి లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఒక్కో స్తంభానికి రూ.10 వేలు చొప్పున రైతులు ముట్టజెప్పాల్సిందే.

గృహ విద్యుత్తు కనెక్షన్‌కైతే దూరం పెరిగేకొద్దీ మూమూళ్ల మొత్తం పెరుగుతుంది.

తీగల మార్పిడికి సంబంధించి హెచ్‌టీకి ఒక ధర, ఎల్‌టీ లైనుకు ఒక ధర చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

కొత్త మీటరు ఇవ్వాలంటే లైన్‌మ్యాన్ నుంచి ఏఈ వరకు అందరికీ ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే.

# కట్టేది పేదల నివాసాలే.. దస్త్రాల నిండా మోసాలే!!

విశాఖపట్నం: జిల్లాలో 'ఒక సెంటు' స్థలాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాల్లో పలు అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో అధికారుల తీరు విస్మయపరుస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు దస్త్రాలు సృష్టిస్తున్నారు. సాంకేతిక వివరాల ద్వారా ఆ స్థలబ్ధిదారులను తప్పుదారి పట్టించి వారనుకున్న గుత్తేదారులకు బిల్లులు అందేలా చేస్తున్నారు. కొందరు అధికారులపై ఫిర్యాదులు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జియోట్యాగింగ్‌లోనూ మోసాలే: ఒక సెంటు స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్ల వద్ద జియోట్యాగింగ్ సాంకేతికతను కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. ఆయా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేలా జియోట్యాగింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు యాప్ ద్వారా నమోదు చేస్తారు. లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం ఏ స్థాయిలో ఉందో తెలిపే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఇక్కడే అసలు మోసం సాగుతోంది. అసలైన




లబ్ధిదారుడికి చెందిన ఇల్లు కాకుండా పూర్తయిన వేరొకరి ఇంటిని అప్‌లోడ్ చేస్తున్నట్లు సమాచారం.

**ఎక్కడెక్కడంటే..**

నగరంలోని 22వ వార్డు లబ్ధిదారులకు పద్మనాభం మండలం విజయరామపురం లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే పూర్తయినట్లు పేర్కొనడంపై ఫిర్యాదులున్నాయి. ఈ లేఅవుట్‌లో ఓ మహిళ ఇల్లు ప్రస్తుతం పైకప్పు వరకే నిర్మించారు. కానీ మొత్తం పూర్తయినట్లు చూపిస్తున్నారు. మరో లబ్ధిదారు ఇల్లు పునాదుల వరకు నిర్మిస్తే... పైకప్పు వరకు నిర్మించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.మరో పది మంది ఇళ్లు పైకప్పు వరకే నిర్మించినా పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో పేర్కొన్నారు.

పైకప్పు పూర్తయిన గృహ నిర్మాణాలు 42 ఉన్నట్లు, పునాదుల నుంచి పైకప్పు వరకు వచ్చినవి 17 ఉన్నట్లు తప్పుడు వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సమాచారం. ఓ మహిళకు విజయరామపురం లేఅవుట్‌లో కేటాయించిన స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు. ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచారు. అయినా అక్కడ ఇల్లు పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చూపడం గమనార్హం.

పద్మనాభం మండలంలోని మద్ది, గొట్టిపల్లి..అలాగే పెందుర్తి, ఆనందపురం మండలాల్లో నిర్మిస్తున్న ఇళ్ల ప్రక్రియపైనా ఇదే తరహా ఆరోపణలున్నాయి.

# పురోగతిలేని పొగాకు మార్కెట్

పొదిలి : పొగాకు ధరలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వేలం కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా పురోగతి కనిపించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేదన్న సాకుతో వ్యాపారులు ఆచితూచి అడుగులేస్తున్నారు.

అక్కడ ఉత్పత్తి పెరిగిందని...: మన దేశంలో పండించిన పంటలో 65 నుంచి 70 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది. బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా తదితర దేశాల్లోనూ ఈ సాగు ఎక్కువ. ఈ ఏడాది ఆయా ప్రాంతాల్లోనూ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని... ఆ ప్రభావం మన మార్కెట్‌పైనా పడుతుందని చెబుతున్నారు. గత మూడేళ్లు ఆయా దేశాల్లో వర్షాభావం కారణంగా ఉత్పత్తి తగ్గడంతో... ఇక్కడి వ్యాపారులు గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా పోటీపడి కొనుగోలు చేశారు. దీంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాదీ అవే ధరలు కొనసాగుతాయన్న అంచనాతో బోర్డు నిర్దేశించిన లక్ష్యానికి మించి సాగు చేశారు. వాతావరణ ప్రతికూలతలు ఎదురైనా



వ్యయప్రయాసలకోర్చి ఉత్పత్తి చేశారు.

**సరాసరిన రూ.300 ఇస్తేనే గిట్టుబాటు...**

ప్రస్తుతం జిల్లాలోని అన్ని వేలం కేంద్రాల్లో గరిష్ఠ ధర కిలో రూ.280కు సీలింగ్ పెట్టుకొని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత పది రోజులుగా మీడియం, బ్రైట్ రకాలను కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 5.3 మిలియన్ కిలోల అమ్మకాలు జరగ్గా... సరాసరిధర రూ.262 మాత్రమే లభించింది. కొనుగోలుదారుల సంఖ్యా తక్కువగానే ఉంది. బోర్డు అధికారులు నిర్దేశించిన ధరకు తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో ఎక్కువ బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారుల మధ్య పోటీ పెంచేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది గిట్టుబాటు కావాలంటే సరాసరి ధర కిలోకు రూ.300కు తగ్గకుండా చూడాలని కోరుతున్నారు.

# మస్తర్లలో మాయాజాలం!

భీమవరం : భీమవరం పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుల మస్తర్ల నమోదులో మతలబులు చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొందరు విధులకు గైర్హాజరైనా యథావిధిగా హాజరు నమోదవుతుండగా.. మరికొందరు తమ స్థానంలో మరొకరితో పనిచేయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ వ్యవహారాల్లో ప్రతి నెలా రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎటు చూసినా చెత్త.. ఇప్పుడు స్వచ్ఛాంధ్ర, గతంలో స్వచ్ఛ సంకల్పం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినా భీమవరంలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేమి, కార్మికులు విధులకు హాజరయ్యారో లేదో పరిశీలన లేదు. భీమవరంలోని ఏడు పారిశుద్ధ్య డివిజన్లలో 274 మంది ప్రైవేటు, దాదాపు 90 మంది శాశ్వత కార్మికులు ఉన్నారు. ప్రతి వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టరు, మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు ఉంటారు. ఆయా వార్డుల్లో ఎందరు కార్మికులు విధులకు హాజరవుతున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిదే. కానీ ప్రతినెలా ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు కార్మికుల హాజరు నమోదులో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.చుక్క పెట్టి వదిలేసి.. శాశ్వత కార్మికుల్లో కొందరు వారి తరఫున వేరొకరిని నియమించి వారికి ఎంతో కొంత వేతనం ఇస్తుంటారు. కొందరైతే మస్తరు వేయించుకుని ఇంటికెళ్లిపోతారు. శాశ్వత, ప్రైవేటు సిబ్బందిలో ఎవరైనా పనికి రాకపోతే పర్యవేక్షణాధికారులు మస్తరు పుస్తకంలో చుక్క(.) ఉంచుతారు. తరువాత దాన్ని హాజరైనట్లుగా మారిస్తే ఆ రోజు వేతనంలో కొంత సొమ్ము వారి జేబుల్లోకి చేరుతుంది.మస్తరు మాట ఎలా ఉన్నా.. పనులు చేసినా చేయకపోయినా కొన్ని డివిజన్లలో నెల వారీ మామూళ్లుగా కార్మికుల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఇవి కాకుండా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, చిరు వ్యాపారులు నుంచి నెలవారీ వసూళ్లు ఉంటాయనే ప్రచారం ఉంది.

# ఉద్యోగుల హేతుబద్ధీకరణకు రంగం సిద్ధం



కాకినాడ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హేతుబద్ధీకరణకు రంగం సిద్ధమైంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సచివాలయాలను క్లస్టర్ వ్యవస్థగా మార్చనుంది. జనాభా ఆధారంగా సచివాలయ ఉద్యోగులను జనరల్ పర్పస్(మల్టీపర్పస్) ఫంక్షనరీలు, స్పెసిఫిక్(టెక్నికల్) ఫంక్షనరీలుగా విభజించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 620 సచివాలయాలను 310 క్లస్టర్లుగా మార్చనున్నారు. ఈ మేరకు ప్రక్రియ పూర్తయినా ప్రభుత్వానికి నివేదిక పంపే క్రమంలో కొన్ని ప్రతిబంధకాలు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మూడుకు పైగా సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఏ రెంటింటిని క్లస్టర్‌గా తీసుకోవాలన్న ప్రతిపాదనపై కొన్నిచోట్ల రాజకీయ ోక్యంతో జాప్యం జరుగుతోంది.

**ఉద్యోగుల కేటాయింపు..**

గ్రామ సచివాలయంలో జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 1-5), డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వార్డు సచివాలయంలో అడ్మిన్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి, మహిళా పోలీసును కేటాయించింది. నీ స్పెసిఫిక్ పర్పస్ ఫంక్షనరీలుగా వీఆర్వో, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్‌లను కేటాయించింది. నీ వార్డు సచివాలయంలో రెవెన్యూ కార్యదర్శి, హెల్త్ కార్యదర్శి, ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించనున్నారు. ఈ మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 610 గ్రామ, వార్డు సచివాలయాల్లో 6,526 మంది ఉద్యోగులు ఉండగా, తాజా మార్గదర్శకాల ప్రకారం 1,766 మందితో జనరల్ పర్పస్ ఫంక్షనరీ జాబితా సిద్ధం చేశారు.

**జనాభా ఆధారంగా విభజన..**

సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ఏ-కేటగిరీలో 2,500 లోపు జనాభా ఉన్న చోట ఆరుగురు, బీ-కేటగిరీలో 2,501-3,500 మధ్య జనాభా ఉన్న చోట ఏడుగురు, సీ-కేటగిరీలో 3,501 ఆపైన ఉన్నచోట ఎనిమిది మంది ఉద్యోగులను కేటాయిస్తారు. ప్రస్తుతం సచివాలయాల్లో 8 నుంచి 12 మంది వరకు ఉద్యోగులున్నారు. కొన్నిచోట్ల అవసరాలకు మించి ఉన్నారు. మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖల్లో సర్దుబాటు చేస్తారు.

# ప్రగతికి పెద్దపీట.. పరిశ్రమలకు రాచబాట..



రాజానగరం: గత ఐదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ఆదాయ వనరులు పెరగాలంటే పరిశ్రమలు, ఇతర సంస్థలు విరివిగా ఏర్పాటు కావాలన్న సత్యాన్ని గుర్తెరిగి ఆ దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలోనే రాజానగరం మండలం కలవచర్లలో 104 ఎకరాల్లో పారిశ్రామికవాడ శరవేగంగా రూపుదిద్దుకుంటోంది.

**వసతుల కల్పనపై దృష్టి**

కలవచర్ల పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టి ప్రస్తుతం ఆ దిశగా కసరత్తు జరుగుతోంది. మే నెలాఖరు నాటికి రహదారులు, డ్రెయినేజీలు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యం తదితరాలు సమకూర్చే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అధికారులు పనిచేస్తున్నారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్థలాలు కేటాయించాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 104 ఎకరాల పారిశ్రామికవాడను 369 స్థలాలుగా విభజించారు. వచ్చిన దరఖాస్తుల మేరకు 300 గజాల నుంచి ఒక ఎకరం వరకు స్థలం ఇవ్వడానికి ఏపీఐఐసీ ద్వారా చర్యలు తీసుకున్నారు.

**విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు**

ఈ పారిశ్రామికవాడలో విద్యుత్తు ఉపకేంద్రాన్ని సైతం ప్రభుత్వం మంజూరు చేసింది. పారిశ్రామిక అవసరాలకు విద్యుత్తు సమస్య తలెత్తకుండా ఈ ఉపకేంద్రం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషితో మంజూరైంది. పారిశ్రామికవాడకు చేరుకునేందుకు అనుసంధానంగా ఒకవైపు గండేపల్లి, మరోవైపు రాజానగరం, ఇంకోవైపు కోరుకొండ నుంచి కలుపుతూ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

**ఏకగవాక్ష అనుమతులు**

ఇక్కడ పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులన్నీ సింగిల్ విండో విధానం ద్వారా పొందేలా ఏర్పాటు చేశారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ఇన్సెంటివ్ ఇవ్వడానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది, నిరుద్యోగులకు ఉద్యోగకల్పన జరుగుతుంది. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి జనరల్ కోటాలో 25 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలో 45 శాతం రాయితీ ఇచ్చే విధంగానూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**నాలుగు లక్షల మందికి ఉపాధి- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం**

కలవచర్ల పారిశ్రామికవాడ ద్వారా దాదాపు నాలుగు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఉత్పాదక యూనిట్లు, కుటీర పరిశ్రమలు, ప్యాకింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటవుతాయి. పారిశ్రామికవాడకు ప్రత్యేకించి విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేసిన సీఎంకి, ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

# బెల్లం అమ్మకాలు బేలచూపు

అనకాపల్లి : అనకాపల్లి మార్కెట్‌కు వచ్చే బెల్లం ఏటేటా తగ్గుతోంది. ముగిసిన సీజన్‌లో 7.33 లక్షల బెల్లం దిమ్మలు అమ్మకం చేశారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న మార్కెట్‌లో ఇంత తక్కువ దిమ్మలు రావడం ఇదే తొలిసారి.గతంలో ఒక నెలలోనే పది లక్షలకుపైగా దిమ్మల అమ్మకాలు జరిగాయి. అటువంటిది ఏడాది పొడవునా 7.5 లక్షల దిమ్మలూ రాలేదంటే మార్కెట్ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అనకాపల్లి నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు బెల్లం ఎగుమతి చేస్తారు. ఆయా ప్రాంతాల్లో వ్యాపారుల వద్ద నల్లబెల్లం ఉందంటూ ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేస్తుండటంతో చాలా మంది బెల్లం కొనుగోలుకు ముందుకు రావడం లేదు. తద్వారా బెల్లం ధరలు తగ్గుతున్నాయి. 2023-24 సీజన్‌లో సగటున వంద కేజీల బెల్లం ధర రూ.3,901 ఉంటే.. 2024-25 సీజన్‌లో రూ.3,811కు పడిపోయింది. ఖర్చులు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. గత సీజన్‌లో వంద కేజీల బెల్లం తయారీకి రూ.1,200 ఖర్చు కాగా, ముగిసిన సీజన్‌లో రూ.1,400కు పెరిగింది. గత సీజన్‌తో పోలిస్తే 18,591 దిమ్మలు తక్కువగా మార్కెట్‌కు వచ్చాయి. మార్కెట్‌కు ఏడాది పొడవునా బెల్లం రాదు. నవంబరు నుంచి ఏప్రిల్ వరకు భారీగా వస్తుంది. ముగిసిన సీజన్‌లో ఏ నెలలోనూ 2 లక్షల దిమ్మెలకు మించి రాలేదు.

**రూ.39.29 కోట్ల వ్యాపారం..:** బెల్లం తక్కువగా రావడంతోపాటు ధరలు తగ్గడంతో 2024-25 సీజన్‌లో మొత్తం అమ్మకాల విలువ రూ.39.29 కోట్లు. గత రెండు దశాబ్దాల్లో ఇంత తక్కువ వ్యాపారం జరగడం ఇదే తొలిసారి. గత సీజన్‌తో పోలిస్తే రూ.2.82 కోట్లు తక్కువగా అమ్మకాలు



చేశారు.

**చేతి చమురు వదిలింది..**

ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేశా. గానుగాడితే 24 టన్నుల రసం వచ్చింది. బెల్లం తయారు చేస్తే రూ.92 వేలు వచ్చాయి. బెల్లం తయారీకి రూ.44 వేలు ఖర్చయ్యాయి. చెరకు సాగుకు రూ.58 వేలు పెట్టుబడి పెట్టా. ఇంటిల్లిపాదీ అందరం కష్టపడ్డాం. మా కూలీ లెక్క వేయకపోయినా రూ.10 వేలు నష్టం వచ్చింది. కూలీ పనికి పోయినా రోజుకు రూ.800 వచ్చేది. చేతి చమురంతా వదిలింది.

మారిశెట్టి అప్పలనాయుడు, రైతు, మునగపాక

# ఖర్చులు ఆకాశంలో.. ధరలు పాతాళంలో..

కనిగిరి : గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండుమిర్చి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పెట్టిన పెట్టుబడిలో 40 శాతం కూడా వెనక్కువచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. సాగు వేళ ఖర్చులు ఆకాశాన్నంటాయని..ప్రస్తుతం ధరలు పాతాళంలో ఉన్నాయని వారంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది మిరప సాగు ఒడిదొడుకులకు లోనైంది. వాస్తవంగా 1,59,382 హెక్టార్లతో సాగు చేయాల్సి ఉండగా, కేవలం 26,563 హెక్టార్లలోనే పంట వేశారు. చాలామంది రైతులు పొగాకు వైపు మళ్లారు. అయితే వర్షాలు, పురుగులు, తెగుళు వెంటాడటంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఎకరాకు కనీసం పది క్వింటాళ్లు కూడా దిగుబడి రాకపోవడంతో వారంతా కుదేలయ్యారు. దీంతో ప్రస్తుత ధరలను బట్టి ఎకరాలకు రూ.లక్ష వరకూ నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. ఎకరాకు రూ.1.5 లక్షలకు



పైగా పెట్టుబడి పెట్టామని, కేవలం యాభై వేలే చేతికందే పరిస్థితి ఉందన్నారు.

**మూడో వంతుకు పడిపోయిన ధరలు:** దిగుబడి తగ్గినా..మంచి ధర లభిస్తే గట్టెక్కుతామని రైతులు భావించారు. అయితే అది కూడా నెరవేరలేదు. గుంటూరు, ఇతర మార్కెట్లకు తీసుకెళ్లినా కొనుగోలు చేసే నాథుడే కన్పించడం లేదని రైతులు నిర్వేదంతో చెబుతున్నారు. దళారులను సంప్రదిస్తే తక్కువ రేటుకు అడుగున్నారు. ప్రతి ఏటా క్వింటా రూ.20 వేలు పలికేది. ఈ ఏడాది మూడోవంతుకు పడిపోయింది. క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేలకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. పంట సాగుకు కూలీలు, పురుగు మందుల ఖర్చు రెట్టింపయ్యిందని, కనీసం గిట్టుబాటు ధర లభించడం లేదని, అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కనిగిరి, పీసీ పల్లి, వెలిగండ్ల, పామూరు, సీఎస్ పురం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా మిర్చి పంట వేశారు. ఆ ప్రాంతంలో వానలు కురవడంతో కాయ రంగు మారిపోయిందని, దీంతో వ్యాపారులు ముఖం చాటేస్తున్నారని వారంటున్నారు.

**నాణ్యత ఉన్నా.. ధర ఇవ్వడం లేదు**

-మధుసూదన్‌రెడ్డి, మండాదివారిపల్లి

మార్కెట్‌కు నాణ్యమైన మిర్చిని తీసుకెళ్లినా, తగిన ధర ఇవ్వడం లేదు. నేను పదెకరాల్లో మిర్చి సాగు చేశా. ఎకరాకు రూ.1.50 లక్షలకు పైగానే ఖర్చు చేశా. దిగుబడి తగ్గింది. గిట్టుబాటు ధర కూడా లేదు. ఈ సారి రూ.పది లక్షలకు పైగా నష్టమొస్తోంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే కొంతైనా గట్టెక్కుతాం.

# ఇక్కడ చెరువుండాలే..!

తాడేపల్లిగూడెం : ఒకప్పుడు తాగునీటి అవసరాలు తీర్చిన చెరువులు నేడు నామరూపాలు లేకుండా పోయాయి. మురికికూపాలుగా మారడమే కాకుండా కబ్జా కోరల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా వీటిని పట్టించుకునేవారు లేకపోవడంతో రికార్డుల్లో ఉన్న చెరువులు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయి.

జిల్లా కేంద్రం భీమవరంలో 27.73 ఎకరాల విస్తీర్ణంలో 14 చెరువులు ఉండేవి. వీరమ్మపార్కు, సోమగుండం, ఎడ్వర్డ్, ఇంగిలాయికుంట చెరువులు మాత్రమే మిగిలాయి. ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు, మీ సేవా భవనం, పురపాలక వాహనాలు నిలిపేందుకు షెడ్డు నిర్మాణాలకు కొన్నింటిని పూడ్చేశారు. కూర్మయ్యపేట, ఇంగిలాయి కుంట తదితర చెరువులు కనిపించకుండా పోయాయి.

పొంతన లేని లెక్కలు.. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో రెవెన్యూ దస్త్రాలు ప్రకారం సుమారు 100.26 ఎకరాల విస్తీర్ణంలో 23 చెరువులు ఉండాలి. కానీ పురపాలక రికార్డుల్లో 15 మాత్రమే ఉండటం గమనార్హం. మిగిలినవి పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురై ఉనికిలో లేకుండా పోయాయి. శివాలయం, గొల్లగూడెం, భట్టువానిగుంట, అనంతమ్మ, పసర్ల, సిద్ధి, కొత్త కర్ర చెరువులు కేవలం రికార్డుల్లోనే ఉన్నాయి. తాడేపల్లిగూడెం భట్టువానిగుంట చెరువులో మురికి నీరు చేరి దుర్వాసన వస్తోందని స్థానికులు పూడ్చివేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా వరకు ఆక్రమణకు గురైంది. చెరువు ఉండాల్సిన ప్రాంతంలో భారీ గృహాలు ఉన్నాయి. నాలుగు ఎకరాల



విస్తీర్ణం ఉండాల్సిన చెరువు స్థలం నేడు ఒక ఎకరానికి పరిమితమైంది. నరసాపురంలో 15.72 ఎకరాల విస్తీర్ణంలో 6 తటాకాలున్నాయి. వీటి చుట్టూ నివాసాలు పెరుగుతున్నాయి. పొన్నపల్లి చెరువు పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. ఇళ్ల స్థలాల పంపిణీకి తుంగపాటి చెరువును పూడేశ్చారు.

పాలకొల్లులో 11 మున్సిపల్ చెరువులకు గాను అయిదు ఆక్రమణకు గురయ్యాయి. పరగడ చెరువును పూడ్చి సామాజిక వర్గాల భవన నిర్మాణాలకు కేటాయించారు. బంగారువారి చెరువును సైతం పూడ్చి కాలనీలు ఏర్పాటు చేశారు. దేవాలయాలు, కల్యాణ మండపాల పేరిట ఆక్రమించుకున్నారు.ఆకివీడు నగర పంచాయతీలో 56 ఎకరాల విస్తీర్ణంలో 8 చెరువులు ఉండేవి. కొండయ్య, దొరగారు చెరువులు 30 శాతం ఆక్రమణల్లో ఉన్నాయి.'చెరువుల సంరక్షణకు కృషి చేస్తాం. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.' మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు అన్నారు.

చురకలు



# వెదుల్లగెడ్డ.. ఇసుకాసురుల అడ్డా

బుచ్చెయ్యపేట: ప్రజలు తమ సొంత అవసరాల కోసం ఉచితంగా ఇసుక తరలించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇసుకతో వ్యాపారం చేస్తున్నారు. ఉచితం పేరుతో ఎక్కడపడితే అక్కడ తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. బుచ్చెయ్యపేట పరిధిలోని వెదుల్లగెడ్డ ఇసుకాసురులకు అడ్డాగా మారింది. ఇక్కడ రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వంతెన, గ్రోయిన్లకు సమీపంలోనే తవ్వేస్తుండటంతో అవి దెబ్బతింటున్నాయి. బుచ్చెయ్యపేట మండలంలోని పెదపూడి, కరక, చింతపాక, తురకలపూడి, చిట్టియ్యపాలెం, తైపురం, రాజాం, కందిపూడి గ్రామాల మీదుగా గెడ్డ విస్తరించి ఉంది. వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీనిపై వంతెనలు, గ్రోయిన్లు, ఆనకట్టలున్నాయి. కె.బి.రోడ్డులో రాజాంకు సమీపంలో వెదుల్లగెడ్డపై మూడు దశాబ్దాల కిందట వంతెన నిర్మించారు. ఇసుక తవ్వకాల వల్ల వంతెన పునాదులు బయటపడ్డాయి. పిల్లర్ల చుట్టూ గోతుల్లో నీరు చేరింది. పెదమదిన, రాజాం గ్రామాలకు చెందిన కొంతమంది వెదుల్లగెడ్డలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు



చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పగలు మనుషులతో, రాత్రుళ్లు పొక్లెయిన్లతో తవ్వేస్తున్నారు. వంతెనకు సమీపంలో పెద్ద పెద్ద గోతులు పెట్టేశారు. వెదుల్లగెడ్డ గర్భాన్ని గుల్ల చేశారు.

**రాజాంలో ఇసుక నిల్వలు..:** ఇసుక అక్రమార్కులు రాజాంలో స్టాకు పాయింట్ ఏర్పాటు చేశారు. వెదుల్లగెడ్డ నుంచి ఇసుక ఇసుకువచ్చి అమ్మ యూపీ స్కూల్ లేఅవుట్ స్థలంలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

**కందకాలు తవ్వించి బాటల మూసివేత..:** వెదుల్లగెడ్డలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను తహసీల్దారు లక్ష్మి శనివారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు రావడం చూసి ట్రాక్టర్ల డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటికే లోడింగ్ చేసిన ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్లిపోయారు. ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా కందకాలు తవ్వించి బాటలు మూసివేయించినట్లు తహసీల్దారు చెప్పారు. తవ్వకాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**గ్రోయిన్‌కు దెబ్బ..**

కందిపూడి, చోడవరం మండలం తిమ్మన్నపాలెం గ్రామాల్లో ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు వెదుల్లగెడ్డపై గ్రోయిన్ నిర్మించారు. దిగువనే ఇసుక తవ్వేయడంతో గ్రోయిన్ దెబ్బతింటోంది. ఇప్పటికే కొంతవరకు రాతికట్టు చెల్లాచెదురైంది. రాళ్లన్నీ దిగువకు కొట్టుకుపోయి పొలాలకు సాగునీరు అందదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

# అనకొండలను అడ్డుకునేదెవరూ?

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం పట్టణంలోని కన్నేపల్లి మార్గంలో ఊరుకొండ వెనుక భాగంలో కొండను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. సర్వే నంబరు 280లో 108.30 ఎకరాల భూమి కొండకు సంబంధించి ఉంది. ఎలాంటి అనుమతి లేకుండా పొక్లెయిన్‌తో బండరాళ్లను పెకిలించి మట్టిని తోడేస్తున్నారు. చాలా రోజులుగా ఈ వ్యవహారం నడుస్తోంది. రోజూ ఐదారు ట్రాక్టర్ల ద్వారా వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1,200–1,400 వరకు అమ్ముతున్నారు. తవ్వకాలతో ఆ ప్రాంతంలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. అక్రమార్కుల స్వార్థానికి కొండలు, గుట్టలు రూపు మారిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు వెళ్లే సమయంలో సమీపంలోని పొలాలు, రోడ్లు అధ్వానం



గా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీవో వసంత్‌బాబును వివరణ కోరగా మట్టి తవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కొండను తవ్వి మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. అధికారులను పంపి దాడులు చేయిస్తాం. వాహనాలు పట్టుబడితే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

# ఉపాధి కూలీలకు తీపి కబురు

నక్కపల్లి : ఉపాధి కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన బకాయిలను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వేలాది మంది కూలీల ఖాతాల్లోకి నగదు త్వరలోనే జమ కానుంది. జిల్లాలో 24 మండలాల పరిధిలో 3.13 లక్షల మంది కూలీలు ఉన్నారు. సగటున సుమారు రెండు లక్షల మంది పనులకు వెళ్తున్నారు. వారం మొత్తం చేసిన పనికి సంబంధించిన వేతనాలను ఎప్పటికప్పుడే చెల్లిస్తుంటారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపులో భాగంగా వేతనాల చెల్లింపుల ఆలస్యమవుతుంటాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి నిధులు సకాలంలో రాకపోవడంతో 12 వారాలుగా చెల్లింపులు జరగలేదు. ఫలితంగా కూలీలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్రం బకాయిలను విడుదల చేసింది.

బీ జిల్లాలో సుమారు 80 వేల మందికి రూ.59 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం చెరువుల అభివృద్ధి, కందకాల తవ్వకాలు, నీటి కుంటల పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ ముందు వరకు రోజుకు రూ.300 వేతనం ఇస్తుండగా, ఈ మొత్తాన్ని కేంద్రప్రభుత్వం రూ.307కు పెంచింది. ప్రస్తుతం మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల, చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, కశింకోట, దేవరాపల్లి, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల తదితర ప్రాంతాల్లో ఉపాధి పనులకు కూలీలు ఎక్కువగా వెళ్తున్నారు. నిధుల విడుదలతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మల్బరీ ఆకుతో మహర్దశ



మడకశిర : మల్బరీ ఆకును పట్టు పురుగుల పెంపకానికే కాకుండా ప్రత్యామ్నాయంగా ఇతర ఔషధాలకు వాడేందుకు విక్రయిస్తూ మంచి లాభాలు సాధిస్తున్నారు మడకశిర వాసులు. మల్బరీ సాగు చేసి బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని అత్యధికంగా సాగు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానం సంపాదించుకున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా పట్టుగూళ్ల పెంపకం కష్టతరంగా మారడంతో పాటు ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాలపురుగు, సప్పడి, గంటుగూళ్లు వస్తుండడంతో పట్టు పురుగులను మధ్యలోనే పారవేస్తూ నష్టపోతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులు పండించే మల్బరీ ఆకును ఎండబెట్టి విక్రయిస్తే మంచి ధరలు ఇస్తామని ఓ కంపెనీ తెలియజేయడంతో ఆ దిశగా అడుగులు వేస్తూ లాభాలు సాధిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. విజయవాడకు చెందిన ఓ మందుల కంపెనీ వారు ఎండిన మల్బరీ ఆకు, కొమ్మలను కొనుగోలు చేస్తూ రైతులకు సొమ్ము అందిస్తుండటంతో లాభాలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర ప్రాంతంలో కంపెనీ వారు మల్బరీ తోటలను పరిశీలించి మందులకు అవసరమైన నాణ్యతతో కూడిన తోటలను ఎంపిక చేసుకున్నారు.

**క్వింటా రూ.6వేలకు కొనుగోలు..**

నాణ్యమైన తోటలోని మల్బరీ ఆకు కొమ్మలతో సహా ముక్కలుగా కత్తిరించి ఎండబెట్టి క్వింటా రూ.6వేలతో కొంటున్నారు. ఇలా టన్ను రూ.60వేలు. పచ్చి ముక్కలైతే టన్ను రూ.10వేలతో కొంటున్నారు. పట్టుపురుగుల పెంపకంతో నష్టపోతున్న రైతులకు ఇది లాభదాయకంగా ఉంది. ఎకరాకు ఎండిన మల్బరీ ఆకు ఒకటి నుంచి 2 టన్నుల వరకు వస్తుంది.

**విజయవాడకు తరలింపు**

– ప్రతాప్‌రెడ్డి, రైతు, బుళ్లసముద్రం, మడకశిర మండలం

8 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాను. ఆకును కడ్డితో సహా ముక్కలుగా చేసి ఎండబెట్టి విజయవాడలోని ఓ మందుల కంపెనీకి తీసుకువెళున్నాం. ఇటీవల రూ.2 లక్షలతో ఆకు కత్తిరించే యంత్రం కొనుగోలు చేశాను. ఇప్పటికే 5టన్నుల ఎండబెట్టిన మల్బరీ ఆకు, కడ్డీలను విజయవాడకు తీసుకెళ్లి టన్ను రూ.60వేలతో విక్రయించాను. దీంతో రూ.3లక్షలు రాగా ఇందులో కూలీ ఖర్చులు, లారీ బాడుగకు రూ.50వేలు పోను రూ.2.50లక్షలు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మరో 5 టన్నుల ఎండబెట్టిన మల్బరీ ఆకు ముక్కలు సిద్ధంగా ఉంచాం.

# వరి.. ఆశలు చెదిరి



కణేకల్లు : రబీలో వరి సాగు చేసిన రైతుల ఆశలు చెదిరిపోయాయి. పంట చేతికందే సమయంలో వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. కనీసం పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి. కణేకల్లు, బొమ్మనహాళ్, గార్లదిన్నె, పామిడి, శింగనమల, పెద్దపప్పూరు తదితర మండలాల్లో 30 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అంచనా. ఐఆర్‌ఆర్93, ఆర్ఎన్ఆర్, గంగాకావేరి, ఎన్ఎల్ఆర్ రకాలను రైతులు సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి వ్యయం చేశారు.

**అన్నదాత కంటతడి**

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని గనిగెర, బెణికల్లు, యర్రగుంట, గోనేహాళ్, శ్రీధరగట్ట, ఎల్బీనగర్, సింగేపల్లి తదితర గ్రామాల్లో ఈనెల 11న కురిసిన వడగళ్ల వర్షం కారణంగా గింజలు రాలిపోయి పంట మొత్తం తుడిచిపెట్టుకొని పోయింది. గోనేహాళ్ ఒక్క గ్రామంలోనే వేయి ఎకరాల వరకు వరి సాగు అయ్యింది. వర్షంతో ఈ గ్రామంలో రూ.5 కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**తెగుళ్లతో దిగుబడిపై తీవ్ర ప్రభావం**

తెగుళ్లు, చీడపీడలు వ్యాపించడంతో తెల్లకంకులు ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపింది. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా.. వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్న పంట పొలాల్లో 10–15 బస్తాలు, స్వల్పంగా దెబ్బతిన్న పొలాల్లో 30 బస్తాలు దిగుబడి రావడం గగనమైందని రైతులు వాపోతున్నారు.

**యంత్రాల అద్దె భారం**

ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. యంత్రాలకు వరి నూర్పిడికి గంటకు రూ.2,500 నుంచి రూ.2,600 వరకు అద్దె ఉంది. ఎకరా విస్తీర్ణంలో వరి కోత కోయడానికి 1.30 గంటలు పడుతుందని రైతులు తెలిపారు. వరిమళ్లు గాలివానకు నేలవాలితే ఎకరా విస్తీర్ణంలో కోయడానికి 2 గంటల వరకు సమయం పడుతుంది.

**గిట్టుబాటు ధర లేక రైతన్న విలవిల**

రబీలో వరి ధాన్యం ధరలు తగ్గిపోయాయి. దళారులు క్వింటాలు ధర రూ.2,020 నిర్ణయించారు. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300 ధర నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు బాజ్ పేరుతో 75 కిలోలకు మూడు కిలోల ధాన్యం దోపిడీ చేస్తున్నట్లు రైతులు వాపోయారు. ఈ విషయమై ఏవో సాయికుమార్ వివరణ కోరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. **అప్పులే మిగిలాయి - మల్లికార్జున, రైతు, గోనేహాళ్**

సొంత పొలం రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, మరో మూడెకరాల్లో పత్తి సాగు చేశా. పంట కోత చేసే సమయంలో కురిసిన వడగళ్ల వానకు రెండు పంటలు దెబ్బతిన్నాయి. వరి గింజలు రాలిపోవడంతో 10 లక్షల దిగుబడి నేలపాలైంది. రూ.5 లక్షల అప్పు మిగిలింది.

# ప్రక్షాళనకు వేళాయె!



పి.గన్నవరం: ఈ నెల 23 నుంచి కాలువలకు నీటిసరఫరా నిలిపివేయనున్నారు. తిరిగి జూన్ 1న తెరుస్తారు. వీటిమధ్య సుమారు 40 రోజుల వ్యవధి ఉంటుంది. ఈలోపు జలవనరులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి కాలువల్లో ఏర్పాటు చేసిన మురుగునీటి తూరలను తొలగించే చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. చెత్త, చెదారం వేయకుండా ప్రధానంగా గ్రామ పంచాయతీలు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి. ఈ విషయంలో జలవనరులశాఖ అధికారులకు సహకరించాలి.

**సమగ్ర రక్షిత పథకాలకు..**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 45 వరకు సమగ్ర రక్షిత పథకాలు ఉన్నాయి. ఇవికాకుండా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లతో పాటు సామర్లకోట, పెద్దాపురం, మండపేట, అమలాపురం, ముమ్మిడివరం మున్సిపాలిటీలకు చెందిన తాగునీటి పథకాలకు కాలువ జలాలు సరఫరా చేస్తున్నారు. లక్షలాది మంది జనాభాకు తాగునీరు అందిస్తున్న గోదావరి పంట కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది.

**అన్నదాతల ఆవేదన**

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లల్లో సుమారు 9.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతుంది. దీనికి ప్రధాన ఆధారం పంట కాలువలు. ఈ జలాలను కలుషితం చేస్తున్న తీరుతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు రోడ్కెక్కిన పరిస్థితులు ఉన్నాయి. ప్రధాన పంటకాలువలు 431, పిల్ల కాలువలు 2024 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. ప్రధాన పంటకాలువలు పది వరకు ఉంటే పిల్లకాలువలు వందల సంఖ్యలో ఉన్నాయి.

**లేఖలు పంపుతాం**

– కె.గోపీనాథ్, ఎస్.ఇ., జలవనరులశాఖ, ధవళేశ్వరం సర్కిల్

ఇళ్లనుంచి కాలువల్లో పెట్టిన రోజువారీ వాడకం నీటికి సంబంధించి తూరలు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శులకు లేఖలు పంపుతాం. ఈ క్లోజర్ పిరియడ్‌లో చర్యలు తీసుకుంటాం. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటాం. పంటకాలువల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటాం.

# లక్ష్య సాధనలో వెనుకడుగు

మాధవధార : జిల్లా రవాణా శాఖ 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రభుత్వం గతేడాది (ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మార్చి 2025) వరకు మొత్తం నిర్దేశించిన ఆదాయం రూ.522.79 కోట్లు కాగా.. రూ.447.80 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగింది.

మినహాయింపులు ఇవ్వడంతో: బ్యాటరీ, ఈవీ వాహనాలకు ప్రభుత్వం జీవిత కాలం పన్ను మినహాయింపు ఇచ్చింది. దీంతో ఈ ఏడాదిగా ఆ వాహనాలు కొనుగోలు ఎక్కువగా పెరగడంతో ఆ మేరకు ఆదాయం తగ్గింది. దీంతో పాటు విశాఖ జిల్లా కేవలం నగరానికి మాత్రమే



పరిమితమవ్వడంతో ట్రాన్స్‌పోర్టుతో పాటు రవాణా శాఖకు ఆదాయం వచ్చే వనరులన్నీ అనకాపల్లి జిల్లా పరిధిలోకి వెళ్లిపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. వాహనాలకు సంబంధించిన వివిధ రకాల త్రైమాసిక పన్నులతో పాటు, దరఖాస్తు రుసుములు చెల్లించేందుకు రవాణా శాఖ నూతనంగా 'పరివాహన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. చెల్లింపు సమయంలో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తడంతో అనుకున్నట్లు పన్నులు చెల్లింపులు జరగలేదు. దీంతో లక్ష్యాన్ని సాధించడంలో వెనుకబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాదికి మరో 15 రోజుల్లో లక్ష్యాన్ని నిర్దేశిస్తారని, సర్వర్ సమస్య అప్పటికల్లా పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందని అధికారులు వెల్లడించారు.

# ఇండోర్ తెరుస్తున్నారు

గాజువాక : దశాబ్దకాలంగా మరుగునపడిన గాజువాక వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియానికి(రాజీవ్ క్రీడాప్రాంగణం) మహర్దశ పట్టింది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన దీనికి రూ.10.88 కోట్లతో సర్వహంగులతో పునఃప్రారంభానికి సిద్ధం చేశారు. నిన్నమొన్నటిదాకా ఎక్కడికక్కడ ధ్వంసమైన ఫ్లోరింగ్, పెచ్చులూడిన గోడలు, వర్షంవస్తే కారిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కొత్తగా షటిల్, టెన్నిస్ కోర్టులు, ఓపెన్ ఆడిటోరియం, వాకింగ్‌ట్రాక్, ఆధునిక స్విమ్మింగ్‌పూల్ వంటి సదుపాయాలు క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చారు.

**'కూటమి' వచ్చాక..**

2012లో గాజువాక 65వ వార్డు వికాస్‌నగర్‌లో రూ.5 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. అప్పటి జీవీఎంసీ మేయర్ పులుసు జనార్ధనరావు చొరవతో దీన్ని అందుబాటులోకి తెచ్చినా నిర్మాణంలో నాణ్యతాలోపం కారణంగా కొన్నాళ్లకే జీర్ణావస్థకు చేరుకుంది. ఆరు షటిల్‌కోర్టుల చెక్క ఫ్లోరింగ్ పాడైపోయి అడుగుతీసి అడుగేయడానికి వీలుండేదికాదు. ఆవరణలో సిమెంటు గోడలు బీటలు వారి, మెట్ల మార్గాలు ధ్వంసమై లోనికి వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఓపెన్ అడిటోరియం గ్యాలరీ చూస్తే భయంగొల్పేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడాకారుల అవసరాలను గుర్తించి రూ.10.88 కోట్లతో సదుపాయాలు మెరుగుపర్చడంతో సరికొత్త అందాలతో ఇండోర్ స్టేడియం ఆకట్టుకుంటోంది.

స్టేడియంలో సింథటిక్ కోర్టు మ్యాట్‌లు, మల్టీపర్పస్ ఫ్లోరింగ్, మోడ్రన్ లైటింగ్ సరికొత్త ఆకర్షణగా నిలిచాయి. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు సౌకర్యాలను మెరుగుపర్చారు.

ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించి క్రీడాకారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్టేడియం పక్కన స్విమ్మింగ్‌పూల్ చక్కగా తీర్చిదిద్దారు. దానిపక్కనే డ్రెస్సింగ్ రూమ్, వెయిటింగ్ హాలు సిద్ధం చేశారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

లోటు తీరింది: క్రీడాకారులకు ఎప్పటి నుంచో కలగా మిగిలిన ఇండోర్ స్టేడియం సకల హంగులతో రూపుదిద్దుకోవడం సంతోషం కలిగిస్తోంది. ఇక్కడ స్విమ్మింగ్‌పూల్, వాకింగ్‌ట్రాక్ అందుబాటులోకి వస్తోంది. చిన్నారులకు ఉపయుక్తంగా ఉండేలా స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

పొగిరి రామకృష్ణ, మెహర్‌నగర్

ఇతర మైదానాలపై దృష్టి: గాజువాకలో పలుచోట్ల క్రీడా మైదానాలు నిర్లక్ష్యంగా పడున్నాయి. ఇప్పుడిప్పుడే వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియం, వినాయకనగర్‌లోని క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడం మంచి పరిణామం. ఆయా నివాసిత సంఘాలకు నిర్వహణ బాధ్యత అప్పగించాలి. ఎ.కె.బాషా, అజీమాబాద్

# అడగరని దందా.. ఆపే దమ్ముందా!!

ఆనందపురం : భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలోని రామవరం గ్రామంలో కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నా అటుగా స్థానిక, మండల రెవెన్యూ అధికారులు దృష్టి సారిస్తున్న పరిస్థితులు కనపడటం లేదు. రామవరం గ్రామం సర్వే నెంబరు 10, 11, 17ల్లో విస్తరించి ఉంది. వీటికి దగ్గరలో సర్వే నెంబరు 44(చీమల మెట్ట)ని గతంలో క్వారీ నిమిత్తం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది సుమారు 15 ఎకరాల కొండ ప్రాంతం. క్వారీ లీజు పూర్తి కావడంతో అలా విడిచిపెట్టారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు కొంత స్థలంలో పశువుల పాకలు వేశారు.

గత ప్రభుత్వ కాలంలో పశువులు కట్టిన స్థలాల్లో ఒక్కొక్కటిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు పునాదులు వేసి ఆయా స్థలాల్ని అమ్మకాలు చేశారు. అందులో చేపట్టిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఎవరూ ప్రశ్నించక పోవడంతో మిగిలిన ఖాళీ స్థలంతో పాటు కొండ భాగంపైన ప్రస్తుతం చోటామోటా నాయకుల కన్ను పడింది. ప్రస్తుతం రాత్రుళ్లు యంత్రాల సాయంతో కొండని తవ్వగా వచ్చిన గ్రావెల్, రాయిని అమ్మేసుకుంటున్నారు.

ఎవరైనా ప్రశ్నిస్తే పక్కనే ఉన్న గ్రావెల్ కొండ బిల్లు చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మరో వైపు చదును చేసి స్థలంలో అక్రమంగా పునాదులు వేసి దర్జాగా రూ. లక్షలకు అమ్మేస్తున్నారు. వాటిలో శరవేగంగా జరుగుతున్న నిర్మాణాల గురించి రెవెన్యూ అధికారులు గానీ, పంచాయతీ రాజ్ అధికారులు గానీ ప్రశ్నించడం లేదని పలువురు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా తెలియనట్లున్నారని, గడిచిన సాధారణ ఎన్నికల సమయం నుంచి విచ్చలవిడిగా ఈ దందా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి.

## రాధిక గ్యాప్ తీసుకుందా.. లేక వచ్చిందా?

డీజే టిల్లు మూవీ తో రాధికగా కుర్రకారు గుండెల్లో ముద్ర వేసుకుంది నేహా శెట్టి. కర్ణాటకకు చెందిన ఈ వయ్యారి.. 2014లో మిస్ మంగళూరు టైటిల్ గెలుచుకుంది. 2015లో మిస్ సౌత్ ఇండియా రన్నరప్ గా నిలిచింది. దాంతో కన్నడ డైరెక్టర్ శశాంక్ 2016 లో ముంగారు మాలే 2 మూవీతో నేహా శెట్టిని హీరోయిన్ గా ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఈ సినిమా యావరేజ్ గా ఆడినప్పటికీ.. నేహా అందం, అభినయానికి ప్రశంసలు దక్కాయి. 2018లో పూరి జగన్నాథ్ డైరెక్ట్ చేసిన మెహబూబా మూవీ తో నేహా శెట్టి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయింది. ఈ మూవీ ఫలితం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ తర్వాత ఆరు నెలలు పాటు న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ కోర్స్ తీసుకున్న నేహా శెట్టి.. 2021లో గల్లీ రౌడీ మూవీతో హీరోయిన్ గా రీఎంట్రీ ఇచ్చింది. ఇందులో సందీప్ కిషన్ కు జోడిగా నటించి ఆకట్టుకుంది. అదే ఏడాది మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రంలో మేఘాగా మెరిసిన నేహా.. 2022లో డీజే టిల్లుతో బ్రేక్ అందుకుంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రంలో నేహా శెట్టి పోషించిన రాధిక పాత్రకు ఎంతటి రీచ్ వచ్చిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. డీజే టిల్లుతో రాధికగా గుర్తుండిపోయిన నేహా శెట్టి.. ఆ తర్వాత బెదురులంక 2012, రూల్స్ రంజన్,



టిల్లు స్క్వేర్ వంటి చిత్రాల్లో నటించింది. చివరిగా విశ్వక్ సేన్‌తో కలిసి గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో పలకరించింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో ఆడలేదు. అయితే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి వచ్చి ఏడాది కావొస్తున్నా నేహా శెట్టి నుంచి మరో సినిమా రాకపోవడం గమనార్హం. దాదాపు రెండేళ్ల క్రితం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కు జోడిగా టైసన్ నాయుడు అనే సినిమాకు నేహా శెట్టి సంతకం చేసింది. భీమ్లానాయక్ హేమ్ సాగర్ కే. చంద్ర ఈ సినిమాకు దర్శకుడు. ప్రముఖ నిర్మాణ సంస్థ 14 రూల్స్ బ్యానర్ లో టైసన్ నాయుడు ప్రారంభమైంది. కానీ ఇంతవరకు షూటింగ్ పూర్తి కాలేదు. పడుతూ లేస్తూ అన్నట్టుగా చిత్రీకరణ జరుగుతుంది. గత ఏడాది నేపాల్ లో కొంత షూటింగ్ చేశారు. ఆ తర్వాత ఎటువంటి అప్డేట్ లేదు. అసలు ఈ చిత్రం ఉందా? ఆగిపోయిందా? అన్న విషయం కూడా తెలియని పరిస్థితి. ఇక గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి తర్వాత నేహా శెట్టి కొత్త ప్రాజెక్ట్‌లకు సైన్ చేసింది లేదు. మరి ఆఫర్లు లేక రాధికకు గ్యాప్ వచ్చిందా? లేక తనకు సెట్ అయ్యే కథలు రాక గ్యాప్ తీసుకుందా? అన్నది తెలియాల్సి ఉంది.

## కేన్స్ గుట్టు మట్లు విప్పిన ఫ్యాషనిస్టా ఊర్ఫీ

బోల్డ్ సెలక్షన్‌తో ఫ్యాషన్ సరిహద్దులు చెరిపేసిన బ్యూటీ ఊర్ఫీ జావేద్. ఈ భామ కేన్స్ 2025 ఫెస్టివల్ లో సందడి చేసేందుకు చాలా ప్లాన్ చేసినా, వీసా తిరస్కరణ కారణంగా హాజరు కాలేకపోయింది. ఈ సందర్భంగా ఊర్ఫీ ఏమాత్రం నిరశ చెందక మరో అవకాశం కోసం ప్రయత్నిస్తానని పాజిటివ్ గా స్పందించింది. అయితే కేన్స్ లో పాల్గొనడం అంటే అదేదో నెత్తిపై కుంపటి పెట్టుకున్నట్టు కాదని, టికెట్లు కొనుక్కుని ఎవరైనా వెళ్లొచ్చని చెప్పింది. ఈ వేదికలకు వెళ్లడానికి అర్హత అవసరం లేదని, స్పానర్ చేసేవాళు ఉంటే చాలని ఊర్ఫీ జావేద్ చెప్పింది. కేన్స్ 2025 ఉత్సవాలకు వెళ్లేందుకు తనకు స్పాన్సర్ చేసేవాళ్లు ఉన్నా కానీ, వీసా రిజెక్షన్ నిరాశపరిచిందని తెలిపింది. కేన్స్ రెడ్ కార్పెట్ పై ప్రభావశీరులు, ఇతర సెలబ్రిటీలు హాజరు కావడానికి స్పాన్సర్ షిప్ ఉంటుందని, విమానం టికెట్లు సహా వసతుల ఏర్పాటు వగైరా అన్నీ వాళ్లే చూసుకుంటారని కూడా ఊర్ఫీ జావేద్ వెల్లడించింది. ఊర్ఫీ ఇన్



స్టాలో ఇలా సందేశం ఇచ్చింది. 'కేన్స్‌కు వెళ్లడం అనేది మీ యోగ్యతపై ఆధారపడి లేని అవకాశం. బ్రాండ్‌లు రెడ్ కార్పెట్‌కు టిక్కెట్లు కొనుగోలు చేసి, ప్రచారం కల్పించే లేదా ప్రభావితం చేసేవారికి, సెలబ్రిటీలకు ఇస్తారు. సాధారణ వ్యక్తులు కూడా టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడవడం ఒక విజయం కాదు.. నాకు కూడా వర్తించదు. ఇది మిమ్మల్ని మీరు ప్రమోట్ చేసుకునే అవకాశం. అదే నిజం. నేను నిజం చెబుతున్నాను" అని ఊర్ఫీ రాసింది. మీ సినిమా ఫెస్టివల్ లో ప్రీమియర్ అయితే అది ఒక విజయం. డబ్బు ఉంటే, స్పాన్సర్ ఉంటే ఎవరైనా దీనిని సాధ్యం చేయగలరు.. అని చెప్పింది. కేన్స్ కి వెళ్లడానికి ఇండీ వైల్డ్ తనకు స్పాన్సర్ చేసిందని, కానీ నా వీసా తిరస్కరించరించారని ఊర్ఫీ బాధను వ్యక్తం చేసింది. తిరస్కరణలు ముగింపు కాదని, మరింత కష్టపడి పనిచేయడానికి ఒక ప్రోత్సాహకం అని తాను నమ్ముతున్నానని ఉర్ఫీ తెలిపింది. బెపన్నా, మేరీ దుర్గా సహా పలు టెలివిజన్ షోలలో కనిపించిన ఉర్ఫీ, రియాలిటీ షో బిగ్ బాస్ %ఋ% 1లో పాల్గొన్న తర్వాత బాగా పాపులరైంది. 2024లో లవ్ సెక్స్ ఔర్ ధోఖా 2 చిత్రంలో నటించింది. గత సంవత్సరం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రదర్శించిన రియాలిటీ సిరీస్ 'ఫాలో కర్ లో యార్'లో కూడా కనిపించింది.




## తమ్ముడుకి దిల్ రాజు మెరుగులు..!



దిల్ రాజు బ్యానర్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటే ఆ సినిమాకు అన్నీ తానై చూసుకుంటాడు దిల్ రాజు. కథ విని ఓకే చేసినప్పటి నుంచి షూటింగ్ లో ప్రతిదీ ప్రత్యేకంగా చూస్తాడు. అంతేకాదు సినిమా అవుట్ పుట్ ని కూడా అంచనా వేస్తాడు. ఎడిటింగ్ రూం లో ఫైనల్ మిక్సింగ్ లో రిలీజ్ ముందు ప్రమోషన్స్ ఇలా దిల్ రాజు అంటే నిర్మాతగా కాదు సినిమాకు అన్ని క్రాఫ్ట్స్ లో పనిచేసే ఒక టెక్నీషియన్ గా ఉంటాడు. ఎందుకంటే డబ్బులు పెట్టేది తనే కాబట్టి ఆయన అంత జాగ్రత్త పడటంలో తప్పులేదు. ప్రస్తుతం దిల్ రాజు బ్యానర్ లో కొన్ని ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ సినిమాలు వస్తున్నాయి. అందులో నితిన్ హీరోగా వస్తున్న తమ్ముడు కూడా ఉంది. దిల్ రాజు బ్యానర్ లో ఆస్థాన దర్శకుడు అయిన వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తమ్ముడు సినిమా వస్తుంది. ఈ సినిమా విషయంలో దిల్ రాజు చాలా నమ్మకంగా ఉన్నాడు. సినిమాలో నితిన్ తో పాటు ఒకప్పటి హీరోయిన్ లయ కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తుంది. సినిమాలో మేజర్ హైలెట్స్ లో ఆమె రోల్ కూడా ఒకటని అంటున్నారు. తమ్ముడు సినిమా నుంచి రీసెంట్ గా ఒక స్పెషల్ టీజర్ రిలీజైంది. అందులో పాత్రలను పరిచయం చేసి సినిమా ఎలా ఉండబోతుందో అని రుచి చూపించారు. ఐతే దిల్ రాజు ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ చేస్తున్నారని తెలుస్తుంది. సినిమా దాదాపు పూర్తి కాగా దిల్ రాజు తుది మెరుగులు దిద్దుతున్నారని తెలుస్తుంది. నితిన్ ఈమధ్య సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొడుతున్నాయి కాబట్టి తమ్ముడు సినిమాతో అతనికి హిట్ ఇవ్వాలని చూస్తున్నాడు దిల్ రాజు. అందులో భాగంగానే సినిమాని ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తున్నారట. నితిన్ కూడా తమ్ముడు సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడని తెలుస్తుంది. ఇదే కాదు నితిన్ నెక్స్ట్ వేణు డైరెక్షన్ లో చేస్తున్న ఎల్లమ్మ సినిమా కూడా దిల్ రాజు నిర్మాణంలోనే వస్తుంది.

సో తమ్ముడు హిట్ ఆ సినిమా మీద కూడా ఇంపాక్ట్ కలిగిస్తుంది కాబట్టి ముందు రిలీజ్ కాబోతున్న తమ్ముడు సినిమా మీద దిల్ రాజు స్పెషల్ కేర్ తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. మరి ఫైనల్ గా ఈ తమ్ముడు ఏం చేస్తాడో చూడాలి.

## ఆ ముగ్గురు భామలకు డిమాండ్!








హీరోయిన్లు ఎంతో మంది వస్తుంటారు. వెళ్తుంటారు. కానీ కొందరు మాత్రమే ఫేమస్ అవుతుంటారు చేసింది ఒక్క సినిమా అయినా ఓ వైబ్ క్రియేట్ చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో అలాంటి వైబ్ తెచ్చింది ఎవరంటే? కయాదు లోహర్, ఇవానా, మమతా బైజ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. డ్రాగన్ సినిమా తో కయాదు లోహర్ ఏ రేంజ్ లో ఫేమస్ అయిందో తెలిసిందే. అమ్మడు హాట్ అప్పిరియన్స్ తోనే రీచ్ అయిపోయింది. తమిళ అనువాద చిత్రంతోనే తెలుగులో ఫ్యాన్స్ ని సంపాదించుకుంది. అటుపై సోషల్ మీడియా లో మరింత ఫేమస్ అయింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తమిళ్ లోనే మూడు సినిమాలు చేస్తోంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ లో ఓ సినిమాకి అగ్రిమెంట్ చేసుకున్నట్లు సమాచారం. ఇంకా నవతరం దర్శకులు అమ్మడికి కథలు వినిపిస్తున్నారు. అమ్మడికి ఉన్న యువ క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని ఛాన్సులిస్తున్నారు. కేరళ కుట్టి ఇవానా కయాదు కంటే ముందే కోలీవుడ్ లో ఫేమస్ అయింది. లవ్ స్టోరీ సినిమాతో తెలుగు ఆడియన్స్ కు బాగా రీచ్ అయింది. డ్రాగన్ లో క్లైమాక్స్ ఎంట్రీలోనూ అదరగొట్టింది. ఇవానా రాకతో థియేటర్లు దద్దరిల్లాయి. దీంతో అమ్మడు టాలీవుడ్ కి ఏ రేంజ్ లో కనెక్ట్ అయిందో అర్దమైంది. ప్రస్తుతం తెలుగు సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుంటుంది. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ లో లీడ్ రోల్ పోషించి అలరించింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో మరోసారి అమ్మడి పేరు హైలైట్ అవుతుంది. అమ్మడి ట్యాలెంట్ కి మరిన్ని తెలుగు సినిమా ఛాన్సులు ఖాయం. ప్రేమలు చిత్రంతో ఇలాగే సంచలనం మైంది మమతా బైజు. ప్రస్తుతం కోలీవుడ్ లో బిజీగా ఉంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. కానీ సరైన కథలైతే తప్ప కమిట్ అవ్వనంటోంది. వీళ్లంతా ఒకే ఒక్క సినిమాతో ఫేమస్ అయిన బ్యూటీలే.

## ప్రగ్యా జైస్వాల్ గౌన్లో గ్లామర్ జల్లు!

ఫ్యాషన్‌లో ఎప్పుడూ ముందుండే ప్రగ్యా జైస్వాల్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. జీ సినీ అవార్డ్స్ నైట్‌కు ప్రత్యేకంగా సిద్ధమైన ఈ బ్యూటీ, వ్కెలెట్ డీప్ నెక్ గౌన్‌లో మెరిసిపోతూ, తన హుందాతనంతో పాటు గ్లామర్‌ని హైలెట్ చేసింది. గోల్డ్ జ్యూవెలరీ, హై పోనీ హెయిర్ బన్, న్యూట్రల్ మేకప్‌తో ఓ ప్రత్యేకమైన ఎలిగెన్స్‌ని కలిగించింది. ప్రగ్యా కెరీర్ విషయానికొస్తే, ఆమె కంచె సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

ఆ సినిమాలో ఆమె పోషించిన పాత్రకి విమర్శకుల ప్రశంసలతో పాటు నంది అవార్డు కూడా అందుకుంది. ఆ తర్వాత నక్షత్రం, అఖండ వంటి చిత్రాల్లో నటించి గ్లామర్‌తో పాటు మంచి



పెర్ఫార్మెన్స్ ఇచ్చిన నటి అనిపించుకుంది.
తాజాగా బాలీవుడ్ మీద కూడా దృష్టి పెడుతున్న ఈ బ్యూటీ, విభిన్న పాత్రలతో ప్రయోగాలు చేయాలని ఉత్సాహంగా ఉంది. ఈ ఫోటోషూట్‌లోని ఫ్రేములు ఒక్కోటి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌లా కనిపిస్తున్నాయి. ఎక్స్‌క్లూజివ్ స్టైలింగ్, విలక్షణమైన నుదురు హావభావాలు, ఆమె ఫోటోలకు ఓ మంత్రముగ్ధతను కలిగించాయి. ఇక ఆమె ఫాలోవర్స్ పాజిటివ్ కామెంట్స్ తో ఆమె అందానికి ఫిదా అవుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పటికే ఈ ఫోటోలు వేల కొద్ది లైక్స్, కమెంట్స్ పొందుతున్నాయి. ప్రతి ఫోటోలోనూ ప్రగ్యా ఫేషనబుల్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపిస్తూ, తన స్టార్ స్టేటస్‌కి తగినట్టుగా బ్రాండ్ అయ్యింది. ఈ రకమైన ప్రెజెంటేషన్ ఆమెకు ఇంకా విస్తృత గుర్తింపుని తీసుకొస్తుందనడంలో సందేహం లేదు.

## బుట్టబొమ్మ క్యాలరీలు కరిగించే కళ

ప్రతి సినిమాకి మార్పు అవసరం. ఆర్టిస్ట్ లుక్ మారాలి. పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని మలుచుకోవాలి. దాని కోసం తిండి కట్టేయాలి. తినే పదార్థాలు మారాలి. ఇలాంటి ప్రయోగాలు కథానాయికలకు కొత్తేమీ కాదు. ముఖ్యంగా వరుస సినిమాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉన్న పూజా హెగ్డే నిరంతరం తన డైట్ చార్ట్ మార్చేస్తుంది. తన పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని తీర్చిదిద్దుకుంటుంది. రెట్రో కోసం కొంత బొద్దెక్కిన ఈ బ్యూటీ ఇప్పుడు అనూహ్యంగా డైట్ మార్చేసింది. తాజాగా తన రోజువారీ తిండి వ్యాయామ షెడ్యూల్ ని రివీల్ చేసింది. నేలపై పడుకుని కేలరీలు బర్న్ చేస్తూ.. బ్రెడ్ - నూడుల్స్ తినడం వగైరా వగైరా విషయాలను షేర్ చేసింది. ఫిట్ నెస్ కోసం తపించడంలో పూజా తగ్గేదేలే! అని నిరూపిస్తోంది. ఇది సినిమా కోసం కాదు.. మంచి




రూపం కోసం ప్రయత్నం. శరీరం నుంచి అవసరం లేని ఫ్యాట్ ని తొలగించి తిరిగి తన పాత రూపానికి మారేందుకు పూజా ఇలా కఠిన వ్యాయామం చేస్తోంది.

పూజా ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీబిజీగా ఉంది. తదుపరి వరుణ్ ధావన్ - మృణాల్ ఠాకూర్‌తో కలిసి ఒక హిందీ సినిమా చేస్తోంది. కాంచన 4, జన నాయగన్, కూలీ చిత్రాలలోను నటిస్తోంది. టాలీవుడ్ లోను కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతానికి తమిళంపై ఆధారపడిన ఈ బ్యూటీ హిందీలోను పెద్ద అవకాశాల కోసం వెయిట్ చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536